Mana Telangana

ఆదివారం మన తెలంగాణ

www.manatelangana.news

అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

హైదరాబాద్
సంపుటి 6
సంచిక: 61
20, ఆదివారం
ఆగస్టు, 2017

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

గమనిక

నేటి సంచికతో ఆదివారం అనుబంధం 'హరివిల్లు' అందించడం లేదు. ఇందుకు బదులుగా పాఠకులు వినాయక చవితి పర్వదినాన వ్రతకల్పం ప్రత్యేక పుస్తకం అందుకోగలరు.

– సంపాదకులు

14 బోగీలు బోల్తా



యుపిలో ఘోర ప్రమాదం, 23 మంది దుర్మరణం

- 60 మందికి పైగా గాయాలు
- ముజఫర్‌నగర్ జిల్లా ఖతౌలి వద్ద పట్టాలు తప్పిన ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్
- మృతుల సంఖ్య పెరిగే సూచన
- దర్యాప్తుకు ఆదేశం

ముజఫర్‌నగర్: ఉత్తరప్రదేశ్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. ముజఫర్‌నగర్‌లోని ఖతౌలి వద్ద శనివారం పూరీ– హరిద్వార్– కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 14 బోగీలు పట్టాలు తప్పిన ఘటనలో 23 మంది దుర్మరణం చెందారు. 60 మందికిపైగా ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. సాయంత్రం 5.46 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. పట్టాలు తప్పిన బోగీలు ఒక దానిపైకి మరొకటి దూసుకువెళ్లాయి. దీనితో మృతుల సంఖ్య మరింతగా పెరిగే వీలుందని ఆందోళన చెందుతున్నారు. బోగీలలో తరువాయి 6లో

పత్తికి పన్ను భీతి

- 5% జిఎస్‌టి వల్ల గిరాకీ పడిపోతుందనే గుబులు
- రాష్ట్రంలో విస్తారంగా సాగు చేస్తున్న రైతులకు పీడకలలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : దేశంలో, రాష్ట్రంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఈసారి అత్యధికంగా సాగయిన పత్తి పంట ధరలపై అప్పుడే అన్నదాతల్లో చర్చ మొదలైంది. గత ఏడాది ధర వస్తుందా? లేక మొత్తానికే పడిపోతుందా అని ఒక రైతు మరొక రైతుతో సందర్భం వచ్చినప్పుడల్లా మాట్లాడుకుంటున్నారు. ఆనందంగా పత్తి విత్తినప్పటికీ, ఇప్పుడు అదే పంట అన్నదాత కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఒకవైపు గులాబీ పురుగు పంటను తింటుంటే మరోవైపు ధర ఎలా ఉంటుందోనన్న ఆలోచనలు మెదులుతున్నాయి. ఈ క్రమంలో పత్తి పంటకు గతేడాది ధర వస్తుందా? ధరను ప్రభావితం చేసే అంశాలేమిటీ? ప్రభుత్వం ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై 'మన తెలంగాణ విశ్లేషణాత్మక కథనం'.

అంతర్జాతీయ ఎగుమతులు, మనదేశంలో వినియోగం, వ్యాపారుల లాబీయింగే ప్రతి ఏటా పత్తి ధరలను తరువాయి 6లో



ముఖ్యమంత్రి కెసిఆర్‌కు వ్యవసాయ విధాన సారథి అవార్డు

5న ఢిల్లీలో ప్రదానం చేయనున్న భారత ఆహార వ్యవసాయ మండలి



మన తెలంగాణ/ హైదరాబాద్: ప్రతిష్టాత్మక అగ్రికల్చర్ లీడర్ షిప్–2017 అవార్డుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఎంపికయ్యారు. భారత ఆహార, వ్యవసాయ మండలి ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ ఆధ్వర్యంలోని కమిటీ 'పాలసీ లీడర్ షిప్' విభాగం కింద సిఎం కెసిఆర్ పేరును ప్రతిపాదించారు. భారత ఆహార వ్యవసాయ మండలి ఆధ్వర్యంలో సెప్టెంబరు 5న ఢిల్లీలోని తాజ్‌ప్యాలస్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేస్తారు. వ్యవసాయ, గ్రామీణ తరువాయి 6లో





7లో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయం నిండగా ఎత్తివేసిన తాలిపేరు గేట్లు, కృష్ణా నదిలో ఎగువ నుంచి నీళ్లు విడుదల కాక ఎండిపోయిన నాగార్జున సాగర్

ఎన్‌డిఎలో జెడియు (నితీశ్) విలీనం

- పాట్నాలో ముఖ్యమంత్రి ఇంటివద్ద ఉభయ వర్గాల ఘర్షణ
- దమ్ముంటే పార్టీని చీల్చు : శరద్ యాదవ్‌కు నితీశ్ సవాల్

మహాకూటమి తీర్పును కాదనగలవా : శరద్ ప్రతి సవాల్ 10లో

కేసుల చిక్కుల్లో ప్రాజెక్టులు

- పెరుగుతున్న పరిహార భారం
- జిల్లా కోర్టుల్లోని వ్యాజ్యాలను గట్టిగా ఎదుర్కోవాలి
- సమర్థులైన సీనియర్ న్యాయవాదులను నియమించాలి – మంత్రి హరీశ్‌రావు



మన తెలంగాణ/ హైదరాబాద్: ప్రాజెక్టులకు సంబంధించి వివిధ జిల్లా కోర్టుల్లో ఉన్న భూసేకరణ, పరిహారం కేసుల్లో ప్రభుత్వ పక్షాన సమర్థవంతంగా వాదనలు వినిపించేందుకు అవసరమైతే హైకోర్టు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదుల సేవలు వినియోగించుకోవాలని సాగునీటి శాఖమంత్రి తన్నీరు హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. కోర్టు కేసుల కారణంగా ప్రాజెక్టు అంచనా వ్యయం కంటే భూనిర్వాసితుల పరిహారం ఎక్కువవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని కేసులు ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉండడంతో ప్రభుత్వ ఖజానాపై భారం పడుతోందని, నిర్ణీత కాలవ్యవధిలో ప్రాజెక్టులను పూర్తిచేయలేకపోతే రైతులకు న్యాయం చేయలేమని అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితిలో తరువాయి 6లో

ఇంట్లో పేలుడు

- యువకుడు సజీవ దహనం
- హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్‌లో దుర్ఘటన
- ఉగ్రకోణంలో దర్యాప్తు



మన తెలంగాణ/ హైదరాబాద్/హయత్‌నగర్: నగర శివార్లలోని ఓ ఇంట్లో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రెషర్ కుక్కర్ బాంబు తయారు చేస్తుండగా ఈ పేలుడు జరిగిందనే అనుమానాలు వ్యక్తవుతున్నాయి. పేలుడు ధాటికి ఇంటి పైకప్పు సిమెంట్ రేకులు వంద మీటర్ల దూరంలో ఎగిరి పడ్డాయి. ఫ్యాన్ కూడా విరిగి కింద పడింది. ఘటనా స్థలాన్ని రాచకొండ పోలీసు కమిషనర్ మహేష్ భగవత్, డిసిపి వెంకటేశ్వర్‌రావుతో పాటు తరువాయి 6లో

కుంచెపోటు



పట్టాలు తప్పని రైలుకి ఒక టిక్కెట్టివ్వండి..!

స్కైవేకి మోక్షం

జాతీయ రహదారుల సంస్థ అంగీకారం, త్వరలోనే క్లియరెన్స్



మన తెలంగాణ / హైదరాబాద్ : రాజధాని హైదరాబాద్‌లో నిర్మించతలపెట్టిన స్కైవే పనులు కొలిక్కి వస్తున్నాయి. అంబర్ పేట (ఛే నెంబర్ జంక్షన్) ఎలివేటర్ కారిడార్ పనులకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ) సూత్రప్రాయ అంగీకారం తెలియజేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ''ఈ ప్రాజెక్టు మంజూరు పనులు చివరి దశలో ఉన్నాయి. అతి త్వరలోనే ప్రభుత్వానికి క్లియరెన్స్‌తో కూడిన నివేదిక అందనుంది అని ఎన్‌హెచ్ఎఐ వర్గాల ద్వారా తమకు సమాచారం అందింది'' అని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికార వర్గాలు 'మన తెలంగాణకు' తెలిపాయి. అంబర్ పేట ఎలివేటర్ కారిడార్ బ్రిడ్జ్ పేరిట ప్యాకేజీని ఫైనల్ చేస్తున్నారు. ఎంజిబిఎస్ బస్టాండ్ నుండి ఉప్పల్ వెళ్లే వరంగల్ హైవేలో ఛే నెంబర్ జంక్షన్‌కు కొద్ది ముందు నుండే ఈ స్కైవేను నిర్మిస్తారు. ఛే నెంబర్ జంక్షన్ కంటే తరువాయి 6లో



హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నాడు జరిగిన న్యాయవాదుల జెఎసి సదస్సులో మాట్లాడుతున్న చాడ, చిత్రంలో కోదండరామ్ తదితరులు

3

ప్రశ్నించే గొంతులను నొక్కుతున్న ప్రభుత్వం

- న్యాయవాదుల జెఎసి సభలో కోదండరామ్

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

- ఇద్దరు యువకులు మృతి
- హైదరాబాద్ శివారు నార్సింగి పరిధిలో ప్రమాదం

3

జిఎస్‌టి రిటర్న్ దాఖలు గడువు పొడిగింపు

- 50 వేల మంది వ్యాపారులకు రిజిస్ట్రేషన్ నంబర్లు జారీ



న్యూఢిల్లీ: జిఎస్‌టి రిజిస్ట్రేషన్ నంబర్ల కోసం సుమారు 50 వేల మంది వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారని ముంబయి జిఎస్‌టి జోన్ తెలిపింది. వారిలో దాదాపు చాలా మందికి నంబర్లను జారీ చేశామని సీనియర్ ఓ అధికారి శనివారం వెల్లడించారు. 'ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ల కోసం ముంబయి జిఎస్‌టి జోన్‌కి 50 వేల మంది వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో చాలామందికి నంబర్లను జారీ చేశాం' అని ఇక్కడి జిఎస్‌టి, సెంట్రల్ ఎక్సైజ్ ప్రధాన కమిషనర్ సుభాష్ వర్ష్నీ పిటిఐ వార్తా సంస్థకు తెలిపారు. స్పష్టమైన సమాచారం లేనందు వల్ల కొంతమందికి నంబర్లను జారీ చేయలేదని చెప్పారు. మొట్టమొదటి జిఎస్‌టి రిటర్న్‌ల దాఖలుకు తుది గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ముంబయి జిఎస్‌టి, సెంట్రల్ ఎక్సైజ్ జోన్, ముంబయిలు సంయుక్తంగా రిటర్న్‌ల దాఖలుకు పన్నుచెల్లింపుదారుల సౌకర్యార్థం ఒక భారీ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాయి. జిఎస్‌టి తరువాయి 6లో

డిసిఎస్‌ఒలుగా అప్‌గ్రేడ్‌కు డిమాండ్



మన తెలంగాణ/హైదరాబాద్ : పౌరసరఫరాల శాఖ కమిషనర్ సి.వి.ఆనంద్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పురస్కారాలు లభించిన సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం(టిజిఒ) ప్రతినిధులు శనివారం ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వద్ద సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న డిప్యూటీ తహసీల్దార్ల ప్రమోషన్, ఇరవై ఒక్క జిల్లాల ఎసిఎస్‌ఒలను డిసిఎస్‌ఒలుగా అప్‌గ్రేడ్ చేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. టిజిఒ అధ్యక్షులు ఎం.బి.కృష్ణ యాదవ్, ఉపాధ్యక్షులు ఎం.డి. అబ్దుల్ ఖదీర్, ఇతర నాయకులు కె.శ్రీనివాస్, వై.కృష్ణమూర్తి, నర్సింగ్‌రావు, కె.కొండల్‌రావు, కాశీ విష్ణువర్ధన్ ఉన్నారు.

బయ్యారంలో స్టీల్ ప్లాంట్!

- ఏర్పాటుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి
- కార్యదర్శిని కోరిన మంత్రి కెటిఆర్

మన తెలంగాణ /హైదరాబాద్ : గతంలో ఎలాంటి ఇనుప ఖనిజాలు లేని విశాఖపట్టణంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసిన కేంద్రం అవసరమైన మేరకు ఇనుప ఖనిజ నిల్వలు ఉన్న ఖమ్మం జిల్లా బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడంలో ఆలస్యం చేస్తోందని గనులు, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ గనుల శాఖ కార్యదర్శి అరుణ్ కుమార్‌తో శనివారం నాడు సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం హామీ ఇచ్చిన బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు గురించి ఈ సందర్భంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్రం 60 సంవత్సరాల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో అన్ని రంగాల్లో వెనుక బడిందని అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత కేంద్ర ప్రభుత్వం అత్యధిక సహాయం ఆంధ్రప్రదేశ్‌కే చేసిందన్నారు. కనీసం విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను సైతం నెరవేర్చడంలో పూర్తి స్థాయిలో సఫలం కాలేదని అరుణ్ కుమార్‌కు కెటిఆర్ తెలియజేశారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం తరఫున బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం పలుమార్లు కేంద్ర మంత్రులను కలిసిన ఈ అంశం ఏ మాత్రం ముందుకు కదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కార్యాచరణ ప్రారంభించాలని, ఇందుకోసం అవసరమయితే తెలంగాణ ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. వెనుకబడిన ఖమ్మంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అత్యవసరమని, దీనిపై తెలంగాణ ప్రభుత్వం తమ ప్రయత్నాలు నిరంతరం కొనసాగిస్తుందని మంత్రి కెటిఆర్ పేర్కొన్నారు.



బీడి పరిశ్రమల యాజమాన్యాలతో భేటీ

జిఎస్‌టి పన్ను పోటు కారణంగా కుదేలవుతున్న బీడీ పరిశ్రమ ఉనికిని కాపాడేందుకు ఆ పరిశ్రమల యాజ మాన్యాలతో మంత్రి కెటిఆర్ శనివారం సమావేశమయ్యారు. బేగంపేట క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ బీడి కార్మికుల జీవితాలకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సిఎం కెసిఆర్ మొదటి నుండి కూడా బీడీ కార్మికుల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, నెలకు వెయ్యి రూపాయల పింఛన్ ఇస్తుండమే నిదర్శనమన్నారు. కేంద్రానికి ఇప్పటికే ఒక లేఖ రాశామన్నారు. కేంద్రంపై మరింత ఒత్తిడి తెస్తే తప్పకుండా కేంద్రం జిఎస్‌టి పన్నును తగ్గిస్తుందన్నారు.

కర్ణాటక వెళ్లిన రాష్ట్ర బృందం

మన తెలంగాణ/మోత్కూరు: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వ కుంట్ల చంద్రశేఖర్‌రావు ఆదేశాల ప్రకారం ఆధునిక వ్యవసాయ పని ముట్ల పరిశీలనకు తెలంగాణ రాష్ట్ర బృందం శనివారం కర్ణాటక రాష్ట్రం లోని రాయచూర్ వ్యవసాయ, ఇంజనీరింగ్ యూనివర్సిటీని, వ్యవ సాయ క్షేత్రాలను సందర్శించి పనిముట్లను పరిశీలిం చారు. వ్యవసా యంలో ఆధునిక పని ముట్లను ఎలా తయారు చేస్తున్నారని, వాటి పని తీరును బృందం సభ్యులు పరిశీలించారు. ఆధునిక వ్యవసాయ పనిముట్ల పరిశీలనకు వెళ్లిన రాష్ట్ర బృందంలో టిఆర్‌ఎస్ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కిషన్ రావు, ఇరిగేషన్ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, హౌజింగ్ చైర్మన్ భూమారెడ్డి, తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రామకృష్ణా రెడ్డి, ఏడి శ్యాం సుందర్‌రెడ్డి, ఆగ్రోస్ ఆర్‌ఎంలు ఉన్నారు.



అసదుద్దీన్ అసంబద్ధ వ్యాఖ్యలు

- అయోధ్యలో స్థలం అల్లా పేరుతో రిజిస్టరైందా?
- విహెచ్‌పి జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్

మన తెలంగాణ/హైదరాబాద్ : అయోధ్యలో రామమందిర నిర్మాణం విషయంలో స్థానిక ముస్లింలు రాజీ మార్గానికి వస్తుంటే హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తూ ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి) జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్రజైన్ తీవ్రంగా మండి పడ్డారు. రెండు రోజుల భజరంగదళ్ జాతీయ కార్యవర్గ సమావేశాలు శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సురేంద్రజైన్‌తో పాటు భజరంగ్‌దళ్ జాతీయ కన్వీనర్ మనోజ్, కో కన్వీనర్ సోహన్‌సింగ్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. అయోధ్యలోని ముస్లింలంతా రాజీ మార్గంలో రామమందిర నిర్మాణానికి సుముఖత వ్యక్తం చేస్తున్నారని, రామ మందిరానికి ప్రస్తుతమున్న స్థలాన్ని ఇచ్చేసి మరో చోట మసీదు నిర్మించుకునేందుకు సానుకూలంగా ఉన్నారన్నారు. స్థానిక ముస్లింల నిర్ణయంపై అసదుద్దీన్ ఓవైసీ అభ్యంతరం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

అల్లా పేరుతో ఉన్న స్థలాన్ని ఇతరులకు ఇచ్చేది లేదని, దీన్ని అంగీకరించేది లేదని ప్రకటన చేయడం సరైంది కాదన్నారు. మసీద్ స్థలం అల్లా పేరుతో లేదని, అక్కడే కాదు, మసీదులున్న ఏ స్థలం కూడా అల్లా పేరుతో లేదన్నారు. రామమందిర స్థలంతో పాటు దేశంలోని ధార్మిక సంస్థలు, దేవాలయాలున్న స్థలాలన్నీ ఆయా దేవాలయాలు, ధార్మిక సంస్థల పేరుతో ఉన్నాయన్నారు. సామరస్యంగా పరిష్కారమయ్యే అయోధ్య విషయాన్ని రాజకీయం చేసి ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ఓవైసీ ప్రయత్నించడాన్ని ఇప్పటికైనా మానుకోవాలని సురేంద్రజైన్ హితవు పలికారు.

వడ్రంగుల వృత్తి ఆధునీకరణ!



మన తెలంగాణ/కోదాడ : వడ్రంగుల వృత్తి ఆధునీకరించబడలని, చైనా, జర్మనీలలో మాదిరిగా కర్ర పనులతో పలు రకాల డిజైన్‌లలో వస్తువులను తయారు చేయాల బిసి కమిషన్ సభ్యులు జూలూరి గౌరి శంకర్ అన్నారు. బిసిలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు వారి కులవృత్తులను జీవన స్థితిగతులను అధ్యయనం చేసేందుకు ఆయన కోదాడ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బిసిలకు మం చి రోజులు రానున్నాయన్నారు.వడ్రంగులు త యారు చేసిన వస్తువులను అన్ని ప్రభుత్వ శాఖల వారు కొనే విధంగా చేయాల్సి ఉందన్నారు. దీనిపై సమగ్ర నివేదికను సిఎం కెసిఆర్‌కు అందజేస్తామన్నారు.

రాజధానిలో బిసి భవన్!

- జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్



మన తెలంగాణ/హైదరాబాద్/ముషీరాబాద్ : అన్ని వర్గాల కులాలకు న్యాయం చేస్తున్న సిఎం కేసీఆర్ జనాభాలో 50 శాతం ఉన్న బిసిలను మరిచిపోతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం పైగా ఉన్న బిసిల సంక్షేమ కార్యక్రమాలను, బిసిల సమగ్ర ప్రణాళికలు రూపొందించేందుకు అందుకోసం వంద కోట్లు నిధులు కేటాయించాలని బిసి సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ దోమలగూడలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని హైదరాబాద్‌లో అనేక సామాజిక వర్గాల వారికి భవనాల నిర్మాణానికి ప్రకటనలు చేశారని, కొన్నింటికి శంకుస్థాపనలు చేశారన్నారు. బిసి భవన్ కోసం మూడేళ్లుగా బిసిలు అడుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఒక్కో కులానికి ఒక్కో భవన్‌ను ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం 112 కులాలున్న బిసిలకు ఒక్క భవన్‌ను ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఒక శాతం ఉన్న బ్రాహ్మణులకు బ్రాహ్మణ సదన్, మూడు శాతం జనాభా ఉన్న రెడ్ల సంక్షేమం కోసం 17 ఎకరాల్లో 10 కోట్ల రూపాయలతో నిర్మించనున్న భవన్‌కు ఈ నెల 22న కేసీఆర్ శంఖుస్థాపన చేయనున్నారన్నారు. ఈ కులాల కంటే సామాజికంగా, ఆర్థికంగా, సంక్షేమ పరంగా వెనకబడిన బిసి కులాలకు కూడా భవన్ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. నెల రోజుల్లోపు బిసి భవన్‌పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే హైదరాబాద్‌లో వేలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించి బిసిల సత్తాను చాటుతామని హెచ్చరించారు. బిసి భవన్ కోసం బిసి ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జాజుల లింగం, నాయకులు మహేష్ యాదవ్, పానుగంటి విజయ్, సతీష్‌కుమార్, చందు, గంగాధర్‌ర, బత్తిని రాజు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఉద్యోగ నోటిఫికేషన్లు!

మన తెలంగాణ/హైదరాబాద్/ముషీరాబాద్ : సిఎం కెసిఆర్ ప్రకటించిన 1,12,536 ఉద్యోగాల భర్తీకై ఎలాంటి న్యాయపరమైన వివాదాలు రాకుండా పక్కా ప్రణాళికతో నోటిఫికేషన్లు జారీ చేయాలని రాష్ట్ర నిరుద్యోగ సంఘర్షణ సమితి సమావేశం డిమాండ్ చేసింది. శనివారం హైదరాబాద్ విద్యానగర్ బిసి భవన్‌లో జరిగిన ఈ సమావేశానికి ఉస్మానియా యూనివర్శిటీ, కాకతీయ యూనివర్శిటీ, తెలంగాణ, జెఎన్‌టియు, శాతవాహన తదితర యూనివర్శిటీలకు చెందిన విద్యార్థి నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయ్య విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగాల నోటి ఫికేషన్లపై పక్కాగా చర్చించి జారీ చేయాలన్నారు. బిసి యవజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్, బిసి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు సి.రాజేందర్, టిఆర్.చందర్, రాంలింగం, కృష్ణుడు, కృష్ణయాదవ్, జాతీయ కార్యదర్శి గుజ్జ రమేష్, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

అవకతవకలను సరి చేయండి

మనతెలంగాణ/హైదరాబాద్ : డిగ్రీ సీట్ల కేటాయింపుల్లో జరిగిన పొరపాట్లను సవరించి విద్యార్థులకు నష్టం జరుగకుండా సంబంధిత కళాశాలల్లో తక్షణమే సీట్లు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తక్షణమే ప్రత్యేక కౌన్సెలింగ్ ఏర్పాటు చేసి,అదేవిధంగా సీట్ల కేటాయింపులు జరిగేలా చూడాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు, కార్యదర్శి కోట రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో మాజీ మావోయిస్టు

మన తెలంగాణ/కీసర : మాజీ మావోయిస్టు నాయకుడు శ్రీరాముల శ్రీనివాస్ ఆలియాస్ సుదర్శన్‌ను శనివారం నాగారంలో సిద్దిపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో పీపుల్స్ వార్ కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేసిన శ్రీనివాస్ 2014లో లొంగిపోయి ప్రస్తుతం నాగారం ప్రియదర్శిని కాలనీలో భార్య విమలతో కలిసి నివాసం ఉంటున్నాడు. కాగా శనివారం సాయంత్రం శ్రీనివాస్ నివాసానికి వచ్చిన సిద్దిపేట పోలీసులు గతంలో ఆయనపై కేసు విషయమై అదుపులోకి తీసుకున్నారు.

బర్తరఫ్ కోసం వినతి

- రెడ్డి జాగృతి డిమాండ్

మన తెలంగాణ/హైదరాబాద్ : రాజ్యాంగబద్ధమైన పదవులు నిర్వహిస్తూ, రెడ్డి సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడిన వాటర్ రీసోర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ వీరమల్లు ప్రకాశ్‌రావు, సిఎం కెసిఆర్ ఓఎస్‌డి దేశపతి శ్రీనివాస్, తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్‌రావు, తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణలను తక్షణ వారి పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని రెడ్డి జాగృతి డిమాండ్ చేసింది. ఈ మేరకు రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు పిట్టా శ్రీనివాస్ రెడ్డి శనివారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పి. సింగ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు.



రైతు సమస్యలు పక్కన పెట్టేందుకే భూ సర్వే : జీవన్‌రెడ్డి

మన తెలంగాణ / హైదరాబాద్ : రైతు సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్ళించేందుకే సమగ్ర భూ సర్వేను ముఖ్యమంత్రి కెసిఆర్ తెరపైకి తీసుకువస్తున్నారని సిఎల్‌పి ఉపనేత టి.జీవన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, అది కేంద్ర ప్రభుత్వ బాధ్యతని రాష్ట్ర ప్రభుత్వం చేతులు ఎత్తివేసిందని విమర్శించారు. శాసనసభ మీడియా హాల్‌లో శనివారం ఆయన మీడియా సమావే శంలో మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే కూడా మరో సమగ్ర కుటుంబ సర్వేలాగే అవుతుందని చెప్పారు. మండలానికి ఒక్క సర్వేయర్ కూడా దిక్కులేదన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ ధర ఇవ్వకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బోనస్ ప్రకటించడం లేదని ప్రశ్నించారు. తక్షణమే పంటలకు బోనస్ ఇచ్చి రైతులకు అండగా నిలబడాలని కోరారు. వానా కాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని జీవన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశానికి హాజరుకాని ఏకైక ముఖ్యమంత్రి కెసిఆర్ అని దుయ్యబట్టారు. వానాకాలం, యాసంగి కాలాల్లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశాలు కూడా నిర్వహించలేదన్నారు. రైతులకు పెట్టుబడి కల్పించేందుకు ముందు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

డిగ్రీలో 6,800 మందికి లభించని సీట్లు

మనతెలంగాణ/హైదరాబాద్ : డిగ్రీ కళాశాలల్లో ఒకపక్క సగానికిపైగా సీట్లు ఖాళీగా మిగులుతుంటే, మరోపక్క ఆప్షన్లు ఇచ్చినా 6,800 మంది విద్యార్థులకు సీటు లభించలేదు. రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీల పరిధిలో మొత్తం 4,10,267 డిగ్రీ సీట్లు అందుబాటులో ఉండగా, తుది విడత సీట్ల కేటాయింపు తర్వాత 2,07,423 సీట్లు ఖాళీగా మిగిలాయి. డిగ్రీలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ(దోస్త్) వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు పరిమితంగా ఆప్షన్లు ఇవ్వడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తినట్లు నిపుణులు చెబుతున్నారు. విద్యార్థి మార్కులు, రిజర్వేషన్లను దృష్టిలో ఉంచుకుని ఆప్షన్లు ఎక్కువగా నమోదు చేసుకుంటే కచ్చితంగా సీటు లభిస్తుందని పేర్కొంటున్నారు. అలా కాకుండా సాధారణ మార్కులు సాధించిన విద్యార్థి టాప్ కళాశాల లకు మాత్రమే ఆప్షన్లు ఇచ్చుకుంటే సీటు లభించకపోవచ్చని అంటున్నారు.

సీట్లు రాని విద్యార్థులకు మరో అవకాశం : టి.పాపిరెడ్డి

డిగ్రీ సీట్ల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆప్షన్లు ఇచ్చినా సీటు లభించని 6,800 మంది విద్యార్థులకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ టి.పాపిరెడ్డి తెలిపారు. తుది విడతలో సీటు పొందిన విద్యార్థులకు కళాశాలల్లో రిపోర్టింగ్ గడువు ఈ నెల 23 వరకు ఉందని అన్నారు. రిపోర్టింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత కళాశాలల్లో సీట్ల ఖాళీల వివరాలు తెలుస్తాయని, అందుకే ఈ నెల 24 నుంచి రెండు రోజుల పాటు సీటు రాని విద్యార్థులు ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ(దోస్త్)లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులందరూ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు

సిసిఎల్‌ఏను నియమించండి : సిపిఐ

మన తెలంగాణ/ హైదరాబాద్ : తక్షణమే రెవెన్యూ శాఖలో అత్యంత కీలకమైన 'భూ పరిపాలన ప్రధాన కమిషనర్' (సిసిఎల్‌ఏ) పోస్టుకు సీనియర్ ఐఎఎస్ అధికారిని నియమించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు సిఎం కెసిఆర్‌కు శనివారం లేఖ రాశారు. సిసిఎల్‌ఏ చాలా నెలలుగా ఖాళీగాఉన్నదని, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికే దానిని అదనపు బాధ్యతగా ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్ర అధికార పరిపాలన వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాల్సిన ప్రధాన కార్యదర్శికి సిసిఎల్‌ఏ అదనపు భారమే అవుతుందన్నారు. ఇటీవలనే సమగ్ర భూ సర్వే చేపడతామని ప్రభుత్వం ప్రకటించిందని, అంతే కాకుండా ఇటీవల తరచుగా భూ వివాదాలు, మియాపూర్ వంటి భూ కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం ఈ మధ్యనే రికార్డులను కంప్యూటరీకరించే పనిని కూడా చేప ట్టిందన్నారు. ఇలాంటి కీలకతరుణంలో భూములకు సంబంధించిన రికార్డులను, పత్రాలను నిర్వహించే సిసిఎల్‌ఏ పోస్టు ఖాళీగా ఉండడం సరైంది కాదని పేర్కొన్నారు. తక్షణమే సీనియర్ ఐఎఎస్ అధికారిని సిసిఎల్‌ఏగా నియమించి పారదర్శకతను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

మహిళల భద్రతకు 181 టోల్‌ఫ్రీ




మన తెలంగాణ / హైదరాబాద్ : దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత, రక్షణ కోసం పని చేస్తోందని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహిళల, భద్రత, రక్షణ కోసం మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా ఏర్పాటు చేసిన మహిళా హెల్ప్‌లైన్ 181 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఆయన సచివాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించారు. ఈవ్ టీజింగ్, వరకట్నం, లైంగిక వేధింపులు, శిశువులు, ఆడపిల్లల విక్రయాలు, అక్రమ రవాణా, ఆఫీసులు, పని ప్రదేశాలు, కుటుంబాల్లో వేధింపులు, , గృహ హింస ఫిర్యాదులను ఈహెల్ప్‌లైన్‌కు మహిళలు నేరుగా తెలియజేయవచ్చన్నారు. ఈవ్ టీజర్ల ఆటకట్టించేందుకు ఏర్పాటు చేసిన షీ టీమ్‌లు సత్ఫలితాలిస్తున్నాయని, ఇదే స్ఫూర్తితో 24 గంటలూ పని చేసే 181 హెల్ప్‌లైన్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ గుండు సుధారాణి, మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ విజయేందిర బోయి, హైదరాబాద్ సంయుక్త కలెక్టర్ ప్రశాంతి, ఎస్‌సి కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొన్నారు.

ఎంసెట్(బి) సీట్ల కేటాయింపు పూర్తి

మనతెలంగాణ/హైదరాబాద్ : ఎంసెట్(బి) సీట్ల కేటాయింపు పూర్తయింది. బి.ఫార్మసీ, ఫార్మా డి, బయో టెక్నాలజి కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద 7,829 సీట్లు అందుబాటులో ఉండగా, 7,829 సీట్లకు కేటాయింపులు జరిగాయి. 10 బయో టెక్నాలజి సీట్లు ఖాళీగా మిగిలాయి. 125 ఫార్మసీ కళాశాలల్లో 100 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. బి.ఫార్మసీలో 125 కళాశాలల్లో 6,694 సీట్లు అందుబాటులో ఉండగా, 100 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఫార్మా డిలో 56 కళాశాలల్లో 1,103 సీట్లకు మొత్తం సీట్లు కేటాయించారు. బయో టెక్నాలజిలో 2 కళాశాలల్లో 42 సీట్లకు 32 సీట్లు భర్తీ కాగా,10 సీట్ల ఖాళీగా మిగిలినట్లు ప్రవేశాల కన్వీనర్ ఎ.వాణిప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 24లోగా ఫీజు చెల్లించి, ఈ నెల 26లోగా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఈ నెల 23లోగా ఆదాయ ధృవీకరణ పత్రం అప్‌డేషన్ చేయించుకోవాలని అన్నారు. సీటు రద్దు కోసం ఈ నెల 28వ తేదీ వరకు మాసబ్‌ట్యాంక్‌లోని సాంకేతిక విద్యాభవన్‌లో సంప్రదించాలని తెలిపారు.

నిర్మాణ పనులపై జిఎస్‌టి సెస్సు మినహాయింపు



మన తెలంగాణ/ హైదరాబాద్ : జిఎస్‌టి కింద నిర్మాణ పనులపై వసూలు చేసే ఒక్క శాతం సెస్సును జిఎస్‌టి నుండి మినహాయించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అ తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం శనివారం ఎఐటియుసి కార్యాలయంలో గన్నారపు రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రత్నాకర్‌రావు మాట్లాడు తూ నిర్మాణ పనులపై వసూలు చేస్తున్న ఒక్క శాతం భవన నిర్మాణ కార్మిక సంక్షేమానికి ఖర్చు చేస్తారని తెలిపారు. కాబట్టి దానిని జిఎస్‌టిలో చేర్చే యత్నాలను ఉపసంహరించాలన్నారు. నిర్మాణ పనులలో పనిచే స్తున్న కార్మికులందర్నీ సంక్షేమ బోర్డులో తప్పనిసరిగా సభ్యులుగా నమో దు చేయాలని, వలస కార్మికులకు వర్తించే విధంగా గుర్తింపు కార్డులను జారీ చేయాలని కోరురు. సంఘటిత రంగంలో పనిచేయు భవన కార్మికులు సామాజిక భద్రత పథకం క్రింద 60 సంవత్సరాలు దాటిన కార్మికులం దరికీ పెన్షన్ సౌకర్యం, నిర్మాణ కార్మికులకు ఇయస్ఐ, పి.ఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

బిజెడ్‌సికి ఆప్షన్లు ఇస్తే బికాంలో సీటు

డిగ్రీ తుది విడత సీట్ల కేటాయింపులో వింతలు విచిత్రాలు



మనతెలంగాణ/హైదరాబాద్ : డిగ్రీ తుది విడత సీట్లు కేటాయింపుల్లో వింతలు విచిత్రాలు చోటు చేసుకున్నాయి. కళాశాలలే కాదు, ఏకంగా కోర్సులు కూడా మారిపోయాయి. ఒక విద్యార్థి బి.జెడ్.సి. కోర్సులో చేరేం దుకు ఆప్షన్లు ఇస్తే, బి.కాంలో సీటు కేటాయించారు. ఈ నెల 11న 70, 808 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించగా, అందులో 2,790 మంది విద్యార్థులకు ఈ నెల 17న రెండవసారి సీట్ల కేటాయింపులు జరిగాయి. ఈ కేటాయింపుల్లో 2,699 మందికి తిరిగి కోర్సులు, కళాశాలల మార్పుతో సీట్లు కేటాయించారు. ఇందులో 2,365 మంది విద్యార్థులకు మొదటి జరిగిన కళాశాలలు, కోర్సుల్లోనే కేటాయింపులు జరుగాయి. 110 మందికి కోర్సుల్లో మార్పు జరగగా, 224 మంది కళాశాలలు మారిపోయాయి. మరో 91 మందికి మాత్రం తాజా కేటాయింపుల్లో సీట్లే లభించలేదు.

ఎందుకీ సమస్య..?: డిగ్రీ సీట్ల కేటాయింపుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు గత విద్యాసంవత్సరం నుంచి ఆన్‌లైన్‌లో ప్రవేశాలు చేపడుతున్నారు. విద్యార్థి సాధించిన మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఆన్‌లైన్ విధానంలో ఎలాంటి అవకతవకలకు అవకాశం ఉండదని భావించి ఈ విధానం ప్రవేశపెడుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతూ వస్తున్నాయి. ఈ విధానంలో ఎలాంటి పైరవీలకు తావులేకుండా ప్రతిభ, రిజర్వేషన్ల ఆధారంగానే సీట్ల కేటాయింపులు జరుగుతాయని పేర్కొంటున్నారు. అయితే ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాల నిర్వహణ బాధ్యతలను ఉన్నత విద్యామండలి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సిజిజి)కి అప్పగించింది. ఈ ఏడాది మొదటి విడత, రెండవ విడత కేటాయింపులు బాగానే చేసిన సిజిజి, మూడవ విడత సీట్లు కేటాయింపుల్లో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. మొదటి, రెండవ విడతలో భర్తీ అయిన సీట్లను కూడా ఖాళీలుగా చూపిస్తూ సీట్ మ్యాట్రిక్స్ రూపొందించి మూడవ విడతలో సీట్లు కేటాయించడం వల్ల ఈ సమస్య తలెత్తినట్లు గుర్తించారు. భర్తీ అయిన సీట్లను ఖాళీగా చూపించడం వల్ల సాధారణ మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు కూడా టాప్ కళాశాలల్లో సీటు లభించింది. దాంతో ఆ విద్యార్థులు వెంటనే ఆయా కళాశాలలకు వెళ్లి రిపోర్టింగ్ చేయడంతోపాటు ఫీజులు చెల్లించి, ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించారు. ఇప్పుడు ఆ సీటు రద్దై, సాధారణ కళాశాలలో సీటు కేటాయించడంతో విద్యార్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

21న మరోసారి సమావేశం: సాంకేతిక సమస్యలతో రెండు సార్లు సీట్ల కేటాయింపులు జరిగిన విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు శనివారం జరిగిన ప్రాథమిక సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సోమవారం మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

వార్తా ప్రపంచానికి ఫోటో జర్నలిజం ప్రాణం లాంటిది

ఐజెయు సెక్రటరీ జనరల్ దేవులపల్లి అమర్



మనతెలంగాణ, సిటీబ్యూరో : వార్తా ప్రపంచంలో వెయ్యి పదాలు చెప్పలేని అర్థాన్ని, భావాన్ని ఒక్క ఫోటో చెబుతుందని ఐజేయు సెక్రటరీ జనరల్ దేవుల పల్లి అమర్ అన్నారు. ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం 2017 ఉత్తమ వార్త ఛాయ చిత్రాల పోటీని శనివారం దేశోద్ధారక భవన్‌లో నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని దేవుల పల్లి అమర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్తా ప్రపంచానికి ఫోటో జర్నలిజం ప్రాణం లాంటిదని, అయినా దానికి దక్కాల్సిన ప్రాధాన్యత దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోటో జర్నలిస్టుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారికి తగిన గుర్తింపు పొందేందుకు ఇటువంటి నిర్వహించడం అభినందనీయమని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ అన్నారు. అనేక పత్రికల్లో పని చేస్తున్న ఫోటో జర్నలిస్టులకు మరింత ప్రోత్సాహాన్ని ఇవ్వాలన్న భావనతో ఇటువంటి కార్యక్రమం నిర్వహించినట్లు రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు. ఎ.గంగాధర్ అన్నారు. ఫోటో జర్నలిస్టు ఛాయా చిత్ర ప్రదర్శనకు 31 జిల్లా నుంచి 101 ఎంట్రీలు వచ్చాయని సంఘం కార్యదర్శి కె.ఎన్. హరి తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటో జర్నలిస్టులు డి.రవీందర్ రెడ్డి, కె.రవికాంత్ రెడ్డి, రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం నాయకులు కె.అనిల్ కుమార్,వి.రామమూర్తి, వసంత్‌కుమార్, ఎం.శివకుమార్,హెచ్‌యుజే ప్రధాన కార్యదర్శి శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలో ప్రథమ బహుమతికి ఎం.రమేశ్(ఈనాడు–హైదరాబాద్), ద్వితీయ బహుమతికి పి.శ్రీధర్(ఆంధ్రజ్యోతి–జగిత్యాల), తృతీయ బహుమతికి దశరథ్ రాజువా (సాక్షి–కొత్తగూడెం) ఎంపికయ్యారు.

ప్రశ్నించే గొంతును నొక్కుతున్న ప్రభుత్వం



మన తెలంగాణ/హైదరాబాద్: వివిధ సెక్షన్ల పేరుతో టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కుతోందని, సభలకు, సమావేశాలపై ఆంక్షలు విధిస్తోందని పలువురు వక్తలు విమర్శించారు. తెలంగాణ న్యాయవాదుల జెఎసి ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో "సభలు, సమావేశాలను జరుపుకునే హక్కు ప్రభుత్వ ఆంక్షలు " అనే అంశంపై శనివారం సదస్సు జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, చాడ వెంకట రెడ్డి (సిపిఐ) మనోహర్ రెడ్డి (బిజెపి), ఎస్.ఎ.సంపత్‌కుమార్ (కాంగ్రెస్), కె.గోవర్ధన్, (సిపిఐ ఎం.ఎల్‌న్యూడెమోక్రసి), ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ పి.ఎల్. విశేశ్వర్ రావు, జెఎసి ప్రతినిధులు ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, న్యాయవాది రచనారెడ్డి, సామాజిక కార్యకర్త సజియాతో పాటు వివిధ ప్రజా సంఘాలు, న్యాయవాదులు పాల్గొనగా సమావేశానికి న్యాయవాది జెఎసి ప్రతినిధి గోపాల్‌శర్మ అధ్యక్షత వహించారు. తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ ప్రభుత్వం సెక్షన్లు 144,38,151 చట్టాలను దుర్వినియోగం చేస్తుందన్నారు. అమరుల స్ఫూర్తి యాత్రలో జెఎసి నేతల తలలను పగలగొట్టేందుకే టిఆర్ఎస్ కార్యకర్తలు వచ్చారని విమర్శించారు. నేరెళ్ల సభకు అనుమతిఇస్తే కొంపలు ఏమైనా మునుగుతాయా ..? అని ప్రశ్నించారు.పోలీసు వ్యవస్థను రాజకీయ నాయకత్వం పూర్తిగా దుర్వినియోగం చేస్తుందన్నారు. ప్రజాస్వామిక చట్టాలను ప్రభుత్వం అప్రజాస్వామికంగా దుర్వినియోగంగా చేస్తుందన్నారు. విచిత్రమైన ఆంక్షల పేరుతో ప్రభుత్వం అనేక నిర్భందాలను విధిస్తోందన్నారు. ఏ పార్టీకి ఆ పార్టీ ప్రజా క్షేత్రంలో, న్యాయస్థానాల్లో వివిధ సెక్షన్ల దుర్వినియోగంపై పోరాటం చేయాలన్నారు. టిజెఎసి అవసరమైనప్పుడు ఉమ్మడి పోరాటానికి పిలుపునిస్తుందని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కోదండరామ్‌ను అడ్డుకునే హక్కు టిఆర్ఎస్ కార్యకర్తలకు ఎక్కడిదని ప్రశ్నించారు. పోలీసులు తెలంగాణ ప్రభుత్వానికే పోలీసుల అని, అంతే తప్ప టిఆర్ఎస్‌కు మాత్రమే కాదని ఆయన అన్నారు. చట్టాలను ఉల్లంఘిస్తే వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. గత ప్రభుత్వాల హయంలో అధికార పార్టీకి వత్తాసు పలికిన వారు ఏదో ఒక సమయంలో అందుకు శిక్ష అనుభవించక తప్పలేదని ఆయన గుర్తు చేశారు. కోదండరామ్ సభకు రక్షణ ఇవ్వలేని పోలీసులు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. బంగారు తెలంగాణ కాదని, ఇది ఆంక్షల తెలంగాణ అని విమర్శించారు.కాంగ్రెస్ ఎంఎల్‌ఎ సంపత్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వస్తే సభలు, సమావేశాలను నిర్వహించుకోలేని పరిస్థితులు వస్తాయని తెలంగాణవాదులు ఊహించలేదన్నారు. అసెంబ్లీలో మంత్రులు సిఎం కెసిఆర్‌ను ముందు ప్రజా సమస్యలను ప్రస్తావించే పరిస్థితులో లేరన్నారు.అసెంబ్లీలో ఏదైనా అడగాలనుకున్నప్పటికీ టిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఆ స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. పలుసార్లు టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తాము అడగలేకపోతున్నాం అన్నా.... మీరైనా దీనిపై అడగండి అని కోరుతున్నారని సంపత్ చెప్పారు. మంత్రులది అదే పరిస్థితి అని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న కోదండరామ్ ఇంటిపై దాడి చేయడం అన్యాయమన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో నేరెళ్ల ఘటనను చర్చకు తీసుకెళ్లి అతలాకుతలం చేస్తామన్నారు. సిపిఐ(ఎంఎల్ న్యూడెమోక్రసీ) నాయకులు కె.గోవర్ధన్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలోనూ కోదండరామ్ ఇంటి తలుపులు పగలగొట్టి, సిసి కెమెరాలను ధ్వంసం చేసి అదుపులోకి తీసుకోలేదన్నారు. బిజెపి రాష్ట్ర నాయకులు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, పోలీసులు టిఆర్ఎస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని అన్నారు. హైకోర్టు న్యాయవాది రచనా రెడ్డి మాట్లాడుతూ, కెసిఆర్ అభద్రతా భావంలో ఉన్నారని, ఆ అభద్రతలో నుండి అణచివేత ద్వారా అధికారాన్ని శాశ్వతం చేసుకోవాలనుకునే తప్పుడు ఆలోచనలోకి వెళ్లారన్నారు. ప్రతి పెద్ద విషయాన్ని చిన్న విషయంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. భారతదేశంలో, తెలంగాణలో ప్రతి పౌరునికి ఒక చోటు నుండి మరో చోటుకు వెళ్లే హక్కు ఉందన్నారు. పౌరుల రాకపోకలపై ఆంక్షలు పెట్టడం అత్యంత దారుణమన్నారు.

ధర్నా చౌక్ పరిరక్షణకు రేపు జంతర్‌మంతర్ వద్ద ధర్నా



మన తెలంగాణ / హైదరాబాద్ : ధర్నా చౌక్ కోసం ఈనెల 21 ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు సంఘీభావంగా పలు రాజకీయ పార్టీల జాతీయ నాయకులు హాజరుకానున్నట్లు ధర్నా చౌక్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ చాడ వెంకటరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీ, సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరిలతో సహా ఎన్‌సిపి, బిజెడి, ఆర్‌జెడి, జెడి(యు) తదితర పార్టీల నాయకులను ధర్నాకు ఆహ్వానించినట్లు తెలిపారు. ఢిల్లీలో ధర్నా ఏర్పాట్లపై చర్చించేందుకు ధర్నా చౌక్ పరిరక్షణ కమిటీ నాయకులు మగ్దూంభవన్‌లో శనివారం సమావేశమయ్యారు. చాడవెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ కోకన్వీనర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు, తెలంగాణ జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్, చెరుపల్లి సీతారాములు(సిపిఐ(ఎం)), మల్లేపల్లి ఆదిరెడ్డి(సిపిఐ), నలమాస కృష్ణ(టిపిఎఫ్), కె.గోవర్ధన్(న్యూడెమోక్రసీ), రమాదేవి, హన్మేశ్ (ఎంఎల్ న్యూడెమోక్రసీ), సజయ(సామాజిక కార్య కర్త), తేజ(ఎస్‌యుసిఐ(సి)), కె.రవిచందర్(టిపిఎఫ్), మాదు సత్యంగౌడ్ (టిజెఎసి), తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్రం కోసం జంతర్‌మంతర్ వద్ద ధర్నాలు చేశామని, ఇప్పుడు స్వంత రాష్ట్రంలో ధర్నా కోసం అక్కడే ధర్నా చేయాల్సి వస్తున్నదని చాడ వెంకట రెడ్డి అన్నారు. ధర్నా చౌక్ విషయంలో ఎన్ని ఉద్యమాలు చేసినా ఇప్పటికీ కెసిఆర్ ప్రభుత్వానికి కనువిప్పు కలగడం లేదన్నారు. దేశావ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ధర్నా చేసేందుకు ప్రదేశాలు ఉన్నాయని, కాని తెలంగాణలో మాత్రం హైదరాబాద్‌లో కాకుండా ఔటర్ రింగ్ రోడ్డు అవతల ధర్నాలు చేసుకోమనే దుస్థితి వచ్చిందన్నారు. ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేసుకుంటా మని దరఖాస్తు చేసుకుంటే పోలీసులు కనీసం స్వీకరించడం లేదని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వ నిర్వాకాన్ని దేశ ప్రజల దృష్టికి తీసుకెళ్ళే ఉద్దేశంతోనే సోమవారం నాడు ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తున్నామ న్నారు. ఈ విషయంపై అవసరమైతే కేంద్ర హోం మంత్రిని కూడా కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. జంతర్‌మంతర్ వద్ద ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ధర్నా నిర్వహిస్తామని పి.ఎల్.విశ్వేశ్వరరా వు తెలిపారు. ధర్నా చౌక్ కోసం ఆరు నెలలుగా పోరాటం చేయాల్సిను దుస్థితికి రావడం ఘోరమన్నారు. కోదండరామ్ మాట్లాడుతూ జంతర్‌మంతర్ వద్ద జరిగే ధర్నాను అందరూ విజవంతం చేయాలని, ఢిల్లీలో తెలుగు ప్రజలు కూడా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఒకవైపు అన్నిట్లో నెంబర్ వన్ అని చెప్పుకుంటున్న సిఎం, మంత్రులు మరోవైపు ఎమర్జెన్సీ లాంటి పరిస్థితులు కల్పిస్తున్నారని గోవర్ధన్ విమర్శించారు.

డిగ్రీ సీట్ల కేటాయింపులో అవకతవకలు

- కారకులపై చర్యలకు డిమాండ్

మనతెలంగాణ/హైదరాబాద్ : డిగ్రీ మూడవ విడత కేటాయింపుల్లో అవకతవ కలు చోటు చేసుకోవడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పిజి కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు రమణారెడ్డి, గౌరీ సతీష్‌లు, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ టి.పాపిరెడ్డికి శనివా రం వినతిపత్రం సమర్పించారు. డిగ్రీ ఖాళీగా మిగిలిన సీట్లను ఫీజు రీయింబ ర్స్‌మెంట్స్ వర్తించే విధంగా భర్తీ చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల నుంచి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సిజిజి)ని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. దోస్త్‌లో రిజిస్ట్రేషన్లలో ఒటిపి, వేలిముద్రలు మ్యాచ్ కాకపోవడం వంటి సమస్యలు తలెత్తాయని, కాబట్టి మరోసారి కొత్తగా ఎన్‌రోల్‌మెంట్‌కు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన టిప్పర్ ఇద్దరు యువకుల మృతి




మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: వేగంగా దూసుకు వచ్చిన టిప్పర్, బైక్‌ను ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందిన విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచే సుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలం దపనపూర్ గ్రామానికి చెందిన పల్లెపు మహిపాల్ (26), కుమ్మరి నరేష్ (25)లు ఎపి 09 బిహెచ్ 8720 బైక్‌పై శనివారం సాయత్రం ఆరు గంటలకు కోకపేట యా జంక్షన్ మీదుగా వెళ్తుండగా వెనకాల నుంచి వచ్చిన టిప్పర్ ఎపి 12 యు 9599ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మహిపాల్, నరేష్‌లకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సవాళ్లు వద్దు రాజీనామా చేయ్!




మన తెలంగాణ/హైదరాబాద్ : మంత్రి జూపల్లి కృష్ణారావుకు సవాలు చేయడం కాదని, గెలిచే సత్తా ఉందనకుంటే కాంగ్రెస్ ఎంఎల్‌ఏ వంశీచంద్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని టిఆర్ ఎస్ ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు సవాలు చేశారు. పాలమూరు జిల్లాకు ప్రథమ శతృవు అని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ వంశీ చంద్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. టిఆర్‌ఎస్‌ఎల్‌పిలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో టిఆర్ ఎ స్ ఎంఎల్‌సి కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంఎల్‌ఎ గువ్వల బాల్‌రాజ్, చిట్టెం రామ్మోహన్‌రెడ్డిలు మాట్లాడారు. అత్తెసరు ఓట్లతో ఎంఎల్‌ఏగా గెలిచిన వంశీచంద్ మంత్రిపై విమర్శలు చేస్తారా? అని కసిరెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు అభివృద్ధికి కావాల్సిన సూచనలు చేస్తే స్వీకరిస్తామని, ప్రాజెక్టులకు అడ్డుపడితే ఊరుకోమన్నారు. తాను తన ఎంఎల్‌సి పదవికి రాజీనామా చేస్తానని, వంశీ తన ఎంఎల్‌ఏ స్థానానికి రాజీనామా చేస్తే ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో చూద్దామన్నారు. ఎంఎల్‌ఎ చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో వంశీ ఓ బచ్చా అని వ్యాఖ్యానించారు. తనతో రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని వంశీ చేసిన సవాలుపై స్పందిస్తూ తాను 11వేల మెజారిటీతో గెలిచిన తర్వాత ప్రజల ఆలోచనల మేరకు నడుచుకున్నానని చెప్పారు.

ఫిరాయింపుదారులే రాజీనామా చేయాలి



తనను, పాలమూరు జిల్లా ఎంఎల్‌ఏలను రాజీనామా చేయాలని టిఆర్ఎస్ నాయకులు అనడం మిలీనియం జోక్ అని కాంగ్రెస్ ఎంఎల్‌ఏ వంశీ చంద్‌రెడ్డి ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. తామెందుకు రాజీనామా చేయాలో చెప్పాలని, తామేమైనా పార్టీలు ఫిరాయించామా? అబద్ధాలు చెప్పామా? అని ప్రశ్నించారు. టిఆర్ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత ఉందో లేదో తేలాలంటే ఆ పార్టీలోకి ఫిరాయించిన వారితో రాజీనామా చేయించి గెలిపించాలని, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రాజీనామా చేసి గెలిస్తే తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని సవాలు విసిరారు. సాగునీటి ప్రాజెక్టులపై బహిరంగ చర్చకు రావాలని మంత్రి జూపల్లికి సవాలు చేస్తే తోకముడిచారని, ప్రాజెక్టులపై అవగాహన లేని టిఆర్ఎస్ నాయకులతో అర్థంపర్థం లేని మాటలు మాట్లాడిస్తున్నారని విమర్శించారు. తాను 21వ తేదీ వరకు హైదరాబాద్‌లోనే ఉంటానని, మంత్రి జూపల్లితో చర్చకు ఎక్కడైనా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. తాను రాజకీయాలలో బచ్చానేనని తనకు కుట్రలు చేయడం, ఫిరాయించడం తెలియవన్నారు.



"విజయాలు సాధించడమే పనిగా పెట్టుకోవడం గొప్పదనం కాదు. విలువల సాధనలో ఎక్కడ నిలిచామన్నదే మహనీయ మూర్తిమత్వానికి నిదర్శనం."
– అల్బర్ట్‌ఐన్‌స్టీన్, సాపేక్ష సిద్ధాంతకర్త

బిజెపి డైరెక్షన్‌లో 'రెండాకులు'

సంపాదకీయం

తమిళనాడు ముఖ్యమంత్రి కుమారి జయలలిత మరణానంతరం పాలక ఎఐఎడిఎంకెలో తలెత్తిన గందరగోళానికి తెరదించే విలీన ప్రయత్నాలు చరమఘట్టానికి చేరాయి. ముఖ్యమంత్రి ఎడప్పడి కె.పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం గ్రూపులను ఐక్యం చేసేందుకు బిజెపి జాతీయ నాయకత్వం కొన్ని నెలలుగా సాగిస్తున్న తెరవెనుక రాజకీయం ఫలప్రదం కానుంది. ముందుగా రెండు గ్రూపులను విలీనం చేయటం, ఆ తదుపరి ఎఐఎడిఎంకెను ఎన్‌డిఎలో, మంత్రివర్గంలో చేర్చుకోవటం, తద్వారా తమిళనాడులో సొంతబలం లేకపోయినా మిత్రపక్షం అండతో కేంద్రంలో బలగాన్ని, బలాన్ని పటిష్టవంతం చేసుకోవటం బిజెపి వ్యూహం. ప్రతిపక్ష డిఎంకె కాంగ్రెస్ కూటమిలో ఉన్నందున, ఎఐఎడిఎంకెని ఎన్‌డిఎలోకి తెచ్చుకోవటానికి బిజెపి చేసిన ప్రయత్నాలు జయలలిత జీవించి ఉండగా ఫలించలేదు.

తిరుగుబాటుదారు ఒ.పన్నీర్ సెల్వం వెంట ఉన్నది 9 మంది ఎమ్మెల్యేలే. విలీనానికి ఆ గ్రూపు డిమాండ్‌లకు ముఖ్యమంత్రి గ్రూపు తలొగ్గటానికి ప్రధాన కారణం ఆ ప్రయత్నం వెనుక కేంద్రప్రభుత్వం ఉండటమే. కొద్దినెలల క్రితం ఆరంభమై అర్థాంతరంగా నిలిచిపోయిన విలీన ప్రయత్నాలు, ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ప్రమాణ స్వీకారానికై ఢిల్లీ వచ్చిన ముఖ్యమంత్రి పళనిస్వామి, పన్నీర్‌సెల్వం ప్రధానితో చర్చలు జరిపిన అనంతరం ఊపు అందుకున్నాయి. పన్నీర్ సెల్వం మూడు కోర్కెలను ముఖ్యమంత్రి చాలా మేరకు నెరవేర్చారు. జయలలితకు చికిత్స, మరణంపై సిబిఐ విచారణ డిమాండ్‌కు బదులు రిటైర్డ్ హైకోర్టు జడ్జీతో విచారణ, పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి శశికళను పార్టీనుంచి బహిష్కరించాలన్న డిమాండ్‌కు బదులు, ఆమె జైలుకెళుతూ ఉపప్రధాన కార్యదర్శిగా నియమించిన దినకరన్‌ను పార్టీనుంచి తొలగించటం, పోయిస్ గార్డెన్‌లోని జయలలిత నివాస గృహం 'వేదనిలయం'ను ఆమె స్మారక మందిరంగా మార్చటం–ముఖ్యమంత్రి అంగీకరించిన అంశాలు. అయితే పన్నీర్ సెల్వం గ్రూపులోని కొద్దిమంది సీనియర్లు సిబిఐ దర్యాప్తుకు పట్టుబడుతున్నందున విలీనం ప్రక్రియకు బ్రేక్ పడినట్లు కనిపిస్తున్నప్పటికీ, సెల్వం గ్రూపుకు మంత్రిపదవుల సంఖ్య, పార్టీ పదవులపై ఏర్పడ్డ ప్రతిష్టంభనతో శుక్రవారం జరగాల్సిన విలీన ప్రకటన జాప్యమైంది.

జయలలిత అవినీతి కేసుల్లో శాసనసభ్యత్వానికి అనర్హత పొందినపుడు ఆమె వీరవిధేయునిగా ముఖ్యమంత్రి బాధ్యతల్లో నియమించబడిన పన్నీర్ సెల్వం, ఆమె మరణించిన డిసెంబర్ 6 అర్థరాత్రి బిజెపి కేంద్ర నాయకుల సలహాపై తిరిగి ముఖ్యమంత్రి అయినారు. అయితే కొద్దివారాల్లోనే ఆ పదవిని చేబట్టి పార్టీపై, ప్రభుత్వంపై పూర్తిపట్టు సాధించాలనుకున్న శశికళ ఆదేశంపై అతను రాజీనామా సమర్పించాడు. అప్పటికే ఆమె పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా నియమితురాలైనారు. అయితే జయలలిత అవినీతి కేసులో సహముద్దాయిగా జైలుశిక్షకు గురైన శశికళ ఇ.కె.పళనిస్వామిని ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. తన సోదరుని కుమారుడు దినకరన్‌ను పార్టీ ఉప ప్రధాన కార్యదర్శిగా నియమించింది. పార్టీపై శశికళ ప్రభావాన్ని పూర్తిగా తొలగించటం ధ్యేయంగా పన్నీర్ సెల్వం పావులు కదిపారు. బిజెపి కేంద్రనాయకత్వం మొదటినుంచీ ఆయన వెనుక ఉంది. అయితే ఎమ్మెల్యేల బలం పళనిస్వామి గ్రూపులో ఉన్నందున పార్టీని ఐక్యం చేయటమే తమకు ప్రయోజనకరమని భావించిన బిజెపి ఆ దిశగా రెండు గ్రూపులతో చర్చిస్తూ వారిని సన్నిహితం చేసింది. విలీనం జరిగితే, ఎన్నికల కమిషన్ స్తంభింపచేసిన పార్టీ ఎన్నికల గుర్తు 'రెండాకులు' తిరిగి వస్తుంది. అయితే శశికళ సలహాతో పనిచేస్తున్న దినకరన్ ఈ విలీనం అవకాశవాదం, అశాశ్వతం అంటున్నారు. ఏదిఏమైనా, ఎఐఎడిఎంకెకు జయలలితలాంటి జనాకర్షక నాయకుడు లేడు. డిఎంకెలో నాయకత్వ మార్పిడి జరిగి స్టాలిన్ నాయకత్వంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 98సీట్లు గెలుచుకుంది. మరొక్క కుదుపు కుదిపితే అధికారం చేతికి వస్తుందన్న ఆశల్లో ఉంది. అందువల్ల తమిళ రాజకీయాలు 2019 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల తీర్పు వరకు ఆసక్తికరంగానే కొనసాగుతాయి.

గోరక్ష గ్రామీణులకు శిక్ష!

చూపు

పాడి పశువులను ఆరాధించే సాంప్రదాయం నుంచి వాటిని శత్రువులుగా ద్వేషించే దశకు ఉత్తరప్రదేశ్ రైతులు చేరుకొన్నారు. ప్రస్తుతం అక్కడ ఎద్దుల స్థానే ట్రాక్టర్లు దర్శనమిస్తున్నాయి. ఆ రాష్ట్రంలో ఉధృతంగా భారతీయ జనతా పార్టీ (బిజెపి)'గో రక్షణ' పేరుతో సాగిస్తున్న దౌర్జన్య కాండ, ప్రభుత్వం పాడి పశువుల క్రయ విక్రయాలపై విధించిన కఠిన నియమాలే ఈ పరిస్థితికి కారణం. యుపి ప్రభుత్వం అక్రమ కబేళాలపై నిషేధం విధించినప్పటి నుంచి, ఆవుల క్రయ విక్రయాలను నియంత్రిస్తూ కేంద్రప్రభుత్వం బిల్లు ఆమోదించినప్పటి నుంచి గోండా జిల్లాలో ఆవుల వాణిజ్యం పూర్తిగా నిలిచిపోయింది. సాంప్రదాయక పశువుల సంతలు ప్రస్తుతం జరగడంలేదు. మార్కెట్ లేని స్థితిలో తమకు ఉపయోగం లేని పశువులను వీధుల్లోకి రైతులు వదిలివేయక తప్పడం లేదు. ఉత్తరప్రదేశ్ గ్రామాల్లో వీధి పశువులు పెద్ద సమస్యగా మారింది.

వీధి పశువులు పంటలను పాడు చేసిన ఘటనలు కూడా సంభవిస్తున్నాయి. గోండా జిల్లాలోని బైసాన్ పూర్వ గ్రామంలో చాలామంది రైతులు తమ పనికిరాని పశువులను వీధుల్లోకి తోలేశారు. గత కొన్ని నెలలుగా ఆ సమీప గ్రామాల్లో కూడా 2,50,300 పశువులను వదిలేశారు. ఆ పశువులు మనుషులపై దాడి చేయడమేకాక పొలాల్లో పడి పంట ధ్వంసం చేస్తున్నాయి. ఇటీవల బైసాన్ పూర్వ గ్రామంలో ఒక వృద్ధ రైతును వీధి ఎద్దు ఒకటి తీవ్రంగా గాయపరిచింది. ఆయన ప్రస్తుతం ఆసుపత్రిలో ప్రాణాపాయంలో ఉన్నారు. బ్రతకడం కష్టం అని వైద్యులు అంటున్నారు. ఆ గ్రామంలో ప్రతి ఒక్కరి పంట ధ్వంసం అయింది. అందుకు వీధి పశువులే కారణం. ఈ సమస్య ప్రభుత్వాల నిర్హేతుక వైఖరులవల్ల కొత్తగా ఏర్పడినది కావడంతో రైతులకు పాలుపోవడం లేదు. పనికిరాని పశువులను ఎలా వదుల్చుకోవాలో వారికి అర్థంకావడం లేదు.

మరో గ్రామస్థుడు శివసేవక్ సింగ్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. తాను ఇంతవరకు 14 బీగాల పొలంలో పంట నష్టపోయినట్లు విచారం వ్యక్తం చేశాడు. తమ గ్రామం సైవాన్‌లో ఎవరి పొలమూ భద్రంగా లేదని, అన్నింటా వీధి పశువులు చాలా వరకు పంట ధ్వంసం చేశాయని సింగ్ చెప్పాడు. అవన్నీ వట్టిపోయిన పాడి పశువులని కూడా తెలిపాడు. వాటిని గ్రామస్థులు బయటకు తోలేయడంతో అడ్డూఆపూ లేకుండా ప్రవర్తిస్తున్నాయని చెప్పుకొచ్చాడు. ఆ ప్రాంతంలో అవి వినాశం సృష్టిస్తున్నట్లు వివరించాడు. అంతేకాకుండా ఆ పశువులు తన రోజువారీ పనికి కూడా అడ్డువస్తున్నట్లు సింగ్ చెప్పాడు. అతను పనిచేసే స్కూలుకు ప్రొద్దుట చేరుకోగానే వరండాలో కనీసం 50 దాకా వీధి పశువులు బైఠాయించి ఖరాబు చేస్తున్నాయని వాపోయాడు. విద్యార్థులు తమ తరగతులకు పోకుండా ముందు శుభ్రం చేశాకే పుస్తకం చేతబడుతున్నారని కూడా సింగ్ వివరించాడు.

ప్రస్తుత సీజన్‌లో తన ఒకటిన్నర బీగా భూమిలో పంటను పశువులు మూడుసార్లు దాడి చేసి తినేశాయని ఆ స్కూలులో సావిత్రి అనే వంటమనిషి చెప్పారు. ఆమె బంధువులు చాలా మందికి కూడా అలాగే జరిగిందని తెలిపారు. సమీపంలోని గదాపూర్వ గ్రామంలో రామ్ బీహారీ పాథక్ అనే వ్యక్తిని ఒక ఎద్దు అతని పొలంలో పొడిచింది. అతడు వెంటనే ఇంటికి వెళ్లి బరిశ తీసుకొని వచ్చి దానిపై దాడి చేశాడు. అయితే అది మరింత ఉగ్రంగా అతని పైకి లంఘించింది. ఇంతలో అక్కడ జనం పోగయ్యారు. అందరూ కలిసి ఆ ఎద్దును తరిమేశారు. తాను కేవలం దేవుడి దయవల్ల బతికి ఉన్నానని పాథక్ చెప్పాడు. అసలు పశువుల క్రయ విక్రయాలను ఎందుకు నిషేధించారని ప్రశ్నించాడు.



వట్టిపోయిన ఆవులను వదుల్చుకోవడం ఎలా?

పొలం పనులకుగాని, పాలు పిండడానికిగాని పనికి రాకుండా వట్టిపోయిన వాటిని ఏమి చేయాలని అతడు అడుగుతున్నాడు. ఇంతకు ముందు వాటిని కబేళాలకు తోలేవారు. ఇప్పుడు ఆంక్షల వల్ల ఆ వీలులేకపోవడంతో అవి వీధి పశువులుగా మారి, పొలాలను ధ్వంసం చేస్తున్నాయి. చుట్టు ప్రక్కల హార్మోనియంతో సంచరిస్తూ భజన పాటలు పాడే హిందూ భక్తుడు రామ్ బీహారి ప్రభుత్వ ఆంక్షల బిల్లును తీవ్రంగా విమర్శిస్తున్నాడు. 'గో రక్షణ అన్నది పశువులను రైతుల శత్రువులుగా మార్చింది' అని అతడు వ్యాఖ్యానించాడు. చట్టం పశువులనైనా రక్షిస్తోందా? అది కేవలం ప్రహసనం తప్ప మరేమీ కాదు. పైగా ఆ ఆంక్షలు రైతులను సర్వనాశనం చేస్తాయి. గ్రామంలో పొలాలన్నీ పంట ధ్వంసం అయి రైతులకు కన్నీళ్లు మిగిల్చాయి' అని ఆ హిందూ భక్తుడు ఆవేశంతో విమర్శించాడు.

ఈ సమస్య గురించి ఆ చుట్టు ప్రక్కల గ్రామాల్లో ప్రజలు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ఒక ఎద్దు అనేక మందిని గాయపరిచిన ఘటన పెద్ద చర్చనీయాంశం అయింది. అది ఇతర పశువులవలె రోడ్డు ప్రక్కన ఇంత గడ్డిమేసే రకం కాదు. వీధిలో పోతున్న ఎవరినీ అది వదలడం లేదు. ఇంత బీభత్సం జరుగుతున్నా వాటి జోలికి వెళ్లడానికి గ్రామస్తులు భయపడుతున్నారు. ప్రభుత్వం తెచ్చిన విధి నిషేధాలే వారిని ఏమీ చేయలేని పరిస్థితిలోకి నెట్టాయి. ఆ పశువులను కబేళాలకు తరలించే ఆనవాయితీ గురించి ఇప్పుడు ఎవరూ మాట్లాడడం లేదు. ఆవు చావుకు కారణం అయిన వ్యక్తి గ్రామ బహిష్కృతుడవుతాడు. అతడు తన వంట తనే చేసుకోవాలి. సమాజంతో సంబంధాలన్నీ తెంచుకోవాలి. నెల తర్వాత 'భగవత్ కథ' విని తీరాలి. తర్వాత ఆవును దానం చేయాలి. గ్రామస్థులకు 'సంతర్పణ' ఏర్పాటు చేశాకే ఊరిలోకి రానిస్తారు.

'గో రక్షణ' పై తిట్ల వర్షం

ఈ నేపథ్యంలో రైతులకు విధ్వంసం తెచ్చే 'గో రక్షణ' దేనికోసం అనే ప్రశ్న ఉదయిస్తోంది. ఈ ప్రశ్న వేస్తున్న వారిలో హిందువులు కూడా ఉండడం విశేషం. ఇప్పటి వరకు వీధి పశువుల సమస్య పట్టణాలు, నగరాలకే పరిమితం కానీ ఇప్పుడు గ్రామాలు కూడా వాటి బారినపడి విలపిస్తున్నాయి. చివరకు ప్రభుత్వ గో రక్షణ ఉద్యమాన్ని దుమ్మెత్తిపోసేలా పరిస్థితి తయారయింది. కొంతమంది రైతులు తమ పొలాలకు ఇనుప కంచె వేస్తున్నారు. అసలే రైతులు ఆదాయం పడిపోయి విచారిస్తుంటే ఈ అదనపు ఖర్చు వారిని మరింత కుంగదీస్తోంది. ఆదుకోవలసిన రైతును అష్టకష్టాలపాలు చేస్తున్న గో రక్షణ ఉద్యమాన్ని జనం నిందిస్తున్నారు.

✻ కృష్ణ కాంత్

దేశంలో రోహింగ్యాల దుస్థితి

ట్రంప్ అడుగుజాడల్లో మోడీ ప్రభుత్వం

దేశం నుంచి రోహింగ్యా శరణార్థులను తిప్పి పంపాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహారశైలిని తలపిస్తున్నది. ముస్లిమ్‌లు అంతా టెర్రరిస్టులే అని భ్రమపడుతూ తమ దేశంలోకి వారి రాకను అరికట్టడానికి ఆంక్షల ఉత్తర్వులను ట్రంప్ జారీ చేసిన చందంగానే ఉంది ఇది. అక్రమ వలసదారులకు, శరణార్థులకూ గల వ్యత్యాసాన్ని గుర్తించకుండా వారిని వెనక్కు పంపాలని నిర్ణయించడం అమానుషం అని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. రోహింగ్యా శరాణార్థులు మయన్మార్‌లో తీవ్ర అణచివేతను తప్పించుకోడానికి మన శరణు కోరి వచ్చినవారు. అక్రమంగా వలసవచ్చిన వారుగా వారిపై ముద్రవేసి తిప్పిపంపాలని కేంద్రం చూడడం హిందూ ఓటు బ్యాంకును సంతృప్తిపరచడానికే అని కూడా వ్యాఖ్యలు వినవస్తున్నాయి.

2016 పౌరసత్వ సవరణ చట్టం గురించి ఇక్కడ చెప్పుకోవాలి. పాకిస్థాన్, అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్ వంటి మైనారిటీ మతస్థులు ఆధిక్యంలో ఉండే దేశాల శరణార్థులపట్ల వడబోత పాటించాలని ఆ సవరణ నిర్దేశిస్తోంది. ఇది వలసలపై ట్రంప్ యంత్రాంగం ఉత్తర్వులను తలపిస్తున్నది. అనేక ముస్లిమ్ దేశాలనుంచి అమెరికాలోకి వలసలను నిషేధిస్తున్న ఉత్తర్వులు ట్రంప్‌వి. అంతేకాకుండా శరణార్థుల క్లెయిములపై ఆ ఉత్తర్వులు పరిమితులు విధిస్తున్నాయి కూడా. శరణార్థులను, ఆశ్రయం కోరేవారిని వడబోతకు గురిచేయడమే రెండు చోట్లా ప్రభుత్వాల అసలు ఉద్దేశం. ఆ విధంగా ముస్లిమేతర కాందిశీకులనే దేశంలోకి అనుమతించాలన్నది లక్ష్యం.

ఫలితంగా తమ దేశాలలో తీవ్ర హింసాకాండను ఎదుర్కొంటున్న సిరియన్లు, రోహింగ్యా ముస్లిమ్‌ల వంటి వారికి తలుపులు మూసేస్తారు. ఈనెల 9న రాజ్యసభ ఎంపి రాజీవ్ గౌడ రోహింగ్యా ముస్లిముల గురించి కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి కిరెన్ రిజ్జూను ప్రశ్నలు అడిగారు. అవి మన దేశంలో రోహింగ్యాల స్థితిగతుల గురించిన ప్రశ్నలు. వాటికి రిజ్జూ జవాబిస్తూ అక్రమంగా వలస వచ్చిన 40,000 మంది రోహింగ్యాలను వెనక్కి తిప్పి పంపే వ్యూహాన్ని వివరించారు. తన ప్రకటనలో చాలా జాగ్రత్తగా 'శరణార్థులు' పదాన్ని వాడకుండా దాటవేశారు.

సంతకం చేయలేదన్న సాకు చూపి..

వలస వచ్చిన విదేశీయులను గుర్తించి పంపేయడానికి టాస్క్ ఫోర్సులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ఐక్యరాజ్య సమితి మహాసభ శరణార్థుల ఒప్పందంపై భారత్ సంతకం చేయలేదు కనుక రోహింగ్యాలకు అది మంజూరు చేసిన శరణార్థుల హోదాను కల్పించనక్కర లేదని కూడా మంత్రి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఏ రకంగా చూసినా రోహింగ్యాలు దక్షిణాసియాలో ఎంతో అణచివేతను ఎదుర్కొంటున్నారు. మయన్మార్‌లో అథమ జీవితం గడుపుతున్నారు. వారు తమకంటూ ఓ దేశం లేకుండా ఉన్నారు.

వారిని మైనారిటీ తెగవారుగా గుర్తించడానికి మయన్మార్ నిరాకరిస్తోంది. అంతర్జాతీయ 'క్రైమ్ ఇనిషియేటివ్' సంస్థ 2015లో విడుదలచేసిన ఓ నివేదిక మయన్మార్ ప్రభుత్వం రోహింగ్యాలపట్ల అనుసరిస్తున్న వేధింపు చర్యలను 'సామూహిక మారణకాండ'గా పేర్కొంది. వారి అంచనాల ప్రకారం 2015లో 1,38,000మంది రోహింగ్యాలు ఆవాసం కోల్పోయారు. వారిని మయన్మార్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం వెలివేతకు, హింసాకాండకు, సామూహిక మారణకాండకు గురి చేసింది. చివరకు భారీ ఎత్తున రోహింగ్యాల హత్యాకాండకు ఆ ప్రభుత్వ వైఖరి దారి తీసింది. అందుచేత రోహింగ్యా శరణార్థులను వారి దేశానికి తిప్పి పంపే ఆలోచన మానవతావాదాన్ని మంటగలపడం కిందకే వస్తుంది. అణచివేతకు, మారణకాండకు గురవుతున్న దేశానికే వారిని పంపివేయడం ఏ రకంగానూ సమర్థనీయం కాదు.

అంతర్జాతీయ శాసనాలకు విరుద్ధం

ఐక్యరాజ్య సమితి ఒప్పందం పై సంతకం చేయలేదన్న సాకుతో అమానవీయ వైఖరిని అవలంబించడం దారుణం. ఆ వైఖరి అంతర్జాతీయ శాసనాలు నిర్దేశిస్తున్న హక్కులకు కూడా విరుద్ధమైనది. అనేక సందర్భాల్లో శరణార్థుల 'డిపోర్టేషన్'ను సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులు నిలిపివేశాయి. ముస్లింలు ఆధిక్యంలో వుండే దేశాల నుంచి మతపరమైన మైనారిటీ వారు కాందిశీకులుగా వస్తే వారిని బలవంతంగా వెనక్కు పంపించివేయడం కూడదని మన పౌరసత్వ సవరణ చట్టం కూడా నిర్దేశిస్తోంది. రోహింగ్యా ల సంక్షోభం పట్ల మన దేశం చాలావరకు మౌనం పాటించింది. ఈ ప్రాంతంలో ఆర్థిక, భూభౌతిక లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని ఆ వైఖరిని అవలంబించినట్లు వ్యాఖ్యలు కూడా వినిపించాయి. దేశంలో రోహింగ్యా శరణార్థులు తిరుగుబాటు కార్యాచరణ సాగిస్తున్న దాఖలాలు కూడా ఏమీ లేవు.

వారు శాంతికి విఘాతంగా ఉంటే దేశ భద్రతకు ప్రమాదకరంగా పరిణమించారని అనుకోవచ్చు. వారు మన దేశంలో స్థానికంగా తీవ్ర శత్రు భావాలను ఎదుర్కొంటున్నారు కూడా. మన హోం మంత్రిత్వ శాఖ పేర్కొన్నట్లు వారు ఎంతమాత్రం భద్రతా ప్రమాదం కాదు. రోహింగ్యా ముస్లింలను వెంటనే వెనక్కు పంపేయకపోతే వారిని గుర్తించి చంపేందుకు జమ్ము వాణిజ్య పరిశ్రమల చాంబర్ గత ఏప్రిల్‌లో హెచ్చరిక జారీ చేసింది. ఈ రకంగా శరణార్థులుగా కూడా రోహింగ్యాలకు తీరని వేదన తప్పడం లేదు. కాబట్టి వారిపట్ల మానవతా దృష్టిని మనం అవలంబించి తీరాలి.

అంతర్జాతీయంగా ప్రస్తుతం ఉద్రిక్తతలు పెరగడంతో శరణార్థుల సమస్య తీవ్రత సంతరించుకుంది. సిరియా కల్లోలం తర్వాత మధ్యధరా సముద్రంలో శరణార్థుల మునక ప్రమాదాలు అనేకం చోటు చేసుకున్నాయి. అందుచేత శరణార్థుల పట్ల దయాదృష్టితో మెలగాలని ఐక్యరాజ్యసమితి కూడా తీర్మానించింది. ఈ నేపథ్యంలో భారత్ రోహింగ్యాలపట్ల కఠిన వైఖరి విడనాడి మానవతావాదంతో వారిపట్ల మెలగాలని, డిపోర్టేషన్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మేధావులు కోరుతున్నారు.

✻ దర్శన మిత్ర



ఐక్యరాజ్య సమితి ఒప్పందం పై సంతకం చేయలేదన్న సాకుతో అమానవీయ వైఖరిని అవలంబించడం దారుణం. ఆ వైఖరి అంతర్జాతీయ శాసనాలు నిర్దేశిస్తున్న హక్కులకు కూడా విరుద్ధమైనది. అనేక సందర్భాల్లో శరణార్థుల 'డిపోర్టేషన్'ను సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులు నిలిపివేశాయి. ముస్లింలు ఆధిక్యంలో వుండే దేశాల నుంచి మతపరమైన మైనారిటీ వారు కాందిశీకులుగా వస్తే వారిని బలవంతంగా వెనక్కు పంపించివేయడం కూడదని మన పౌరసత్వ సవరణ చట్టం కూడా నిర్దేశిస్తోంది. రోహింగ్యాల సంక్షోభంపట్ల మన దేశం చాలావరకు మౌనం పాటించింది. ఈ ప్రాంతంలో ఆర్థిక, భూభౌతిక లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని ఆ వైఖరిని అవలంబించినట్లు వ్యాఖ్యలు కూడా వినిపించాయి. దేశంలో రోహింగ్యా శరణార్థులు తిరుగుబాటు కార్యాచరణ సాగిస్తున్న దాఖలాలు కూడా ఏమీ లేవు. వారు శాంతికి విఘాతంగా ఉంటే దేశ భద్రతకు ప్రమాదకరంగా పరిణమించారని అనుకోవచ్చు. వారు మన దేశంలో స్థానికంగా తీవ్ర శత్రు భావాలను ఎదుర్కొంటున్నారు కూడా. మన హోంమంత్రిత్వ శాఖ పేర్కొన్నట్లు వారు ఎంతమాత్రం భద్రతా ప్రమాదం కాదు.

ఎడిటర్‌కు లేఖలు

సిపియస్ విధానాన్ని రద్దు చేయాలి

2014సెప్టెంబర్ ఒకటి తర్వాత జి.వోనెం.653 ద్వారా అమలు అవుతున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎస్) విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విధానంవల్ల ఉద్యోగి పదవీ విరమణ అనంతరం పెన్షన్ గ్రాట్యుటీని పొందలేరు. అదే పాత పెన్షన్ (ఓపీఎస్) విధానంలో ఉద్యోగ విరమణ అనంతరం గ్రాట్యుటీ తోబాటు పూర్తి పెన్షన్‌ను సర్వీస్ చివరి నెల జీతంతో, సగం పెన్షన్‌గా ఉద్యోగికి వస్తుంది. ఒకవేళ ఉద్యోగి మరణిస్తే అతడిపై ఆధారపడిన కుటుంబీకులకు ప్రతీనెల ఫించన్ చెల్లిస్తారు. కానీ సిపిఎస్ విధానంలో ఉద్యోగికి ప్రయోజనాలు శూన్యం. ప్రతినెల 10శాతం ఆ ఉద్యోగి ఖాతాలో జమవుతుంది. ఆ మొత్తానికి ప్రభుత్వం అంతే మొత్తాన్ని కలిపి సిపిఎస్ ఉద్యోగి ఖాతాలో జమచేస్తుంది. ఉద్యోగ విరమణ తర్వాత అతడి ఖాతాలో జమ అయిన మొత్తం నుండి 60 శాతం వరకు నగదుగా చెల్లించి మిగతా 40శాతంను ఇన్సూరెన్స్ ఆధారిత పథకాలలో పెట్టుబడిపెట్టి వచ్చిన లాభంతో కలిపి ఆ ఉద్యోగికి 70వ సంవత్సరం వరకు చెల్లిస్తుంది. ఆ తర్వాత జీతం నుంచి ఎలాంటి పెన్షన్ రాదు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలనీ దేశవ్యాప్తంగా ఉద్యోగ సంఘాలు ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నాయి. వీరి ఉద్యమానికి అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు పలుకుతున్నాయి. 2014 సంవత్సరం తర్వాత మన రాష్ట్రంలో లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు నియమింపబడినారు. వీరందరికీ సిపిఎస్ వర్తిస్తుంది.

సిపిఎస్ విధానంలో ఉద్యోగ విరమణ తర్వాత పిఆర్‌సిలు వర్తించవు. డిఎ పెరుగుదల వర్తించదు. ప్రతీ దశలో పన్ను చెల్లింపులు ఉంటాయి. ఉద్యోగ విరమణ తర్వాత బ్యాంకు రుణాలు ఇవ్వరు. గ్రాట్యుటీ ఉండదు. కమ్యూటేషన్, అదనపు పెన్షన్ వర్తించదు. అదే ఓపీఎస్ ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు వర్తిస్తాయి.

కేంద్రప్రభుత్వం తక్షణమే సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి అన్ని సౌకర్యాలు కల్పించాలి. పాత పెన్షన్ విధానాన్ని అందరు ఉద్యోగులకు వర్తింపచేయాలి. తెలంగాణ ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వంపై కూడా ఒత్తిడి తేవాలి. సిపిఎస్ విధానం వద్దు – ఓపీఎస్ విధానం ముద్దు అనే నినాదాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు విస్తృత ప్రచారం చేయాలి. రాష్ట్ర ఎంఎల్‌ఎలు, ఎంపిలు, మంత్రులపై ఒత్తిడి పెంచాలి. ఢిల్లీ కేంద్రంగా దీక్షలు చేపట్టాలి. ఉద్యోగులను అయోమయానికి గురిచేసే సిపిఎస్ అంతం – మనందరి పంతం కావాలి.

– కామిడి సతీష్‌రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా
9848445134

బోరు గుంతలా? చిన్నారులకు నరక కూపాలా?

ఈ మధ్య తరచుగా టివిలో, న్యూస్ పేపర్లో బోర్‌వెల్ గుంతలో చిన్నారులు పడిపోయారని చూస్తున్నాము. దీనికి ఇంత వరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి క్రియాశీలక పటుత్వ చర్యలు, జాగ్రత్తలు తీసుకున్న దాఖలాలు కనిపించటం లేదు. ఎక్కడైనా ఇటువంటి సంఘటన జరిగిన వెంటనే ఆ బోర్‌కి సమాన గుంతలు తవ్వించటం, ఆ ప్రోగ్రాంను లైవ్‌గా టివిల్లో కవర్ చేయటం చూస్తున్నాము. బోరు బావి వేయించుకొనే వారు ముందుగా పంచాయతీ ఆఫీసులోను, ఆ బోర్ బావి పరిధిలోని పోలీస్ స్టేషన్ లోను వ్రాతపుర్వకంగా అఫిడవిట్ హామీ పత్రం ఇవ్వాలి, తను వేయించబోయే బోర్ బావికి, తక్షణమే హ్యాండ్ పంపు గానీ, మోటార్ గాని అమర్చుతానని, ఒక వేళ ఏ కారణంగా నైనా ఆలస్యం అయ్యే తరుణంలో అది అమర్చేవరకు, అక్కడ ఒక కాపలాదారుని నిర్విరామంగా 24 గంటలూ ఉంచుతానని, తను అమర్చే మోటార్ వైర్లు ఏ జంతువులకు, పిల్లలకి అందుబాటులో ఉండకుండా ఉండేటట్లు అమర్చుతానని అఫిడవిట్ ధృవపరచాలి, ఇదే అఫిడవిట్‌లో బోర్ మిషన్ యజమాని కూడా తన కంపెని అడ్రస్ స్టాంప్‌తో సంతకం తప్పకుండా చెయ్యాలి.

అటువంటి పత్రం లేకుండా ఏ వర్క్ షాప్/మెకానిక్ ఆ మోటార్ లేక హ్యాండ్ పంప్ రిపేర్ చేస్తే అతను కూడా బాధ్యుడినిగా చేయాలి. ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా ఏ ప్రమాదాలు జరిగినా అందుకు ఇద్దరినీ బాధ్యులుగా చేసి క్రిమినల్ శిక్షకి అర్హులుగా భావించి ఇరువురికి శిక్ష విధించాలి.

నిద్రావస్థలో ఉన్న ప్రభుత్వాలని ఇప్పటికే ప్రింట్, దృశ్య మీడియా ప్రభుత్వాలని హెచ్చరించినా అనుకున్న సంపూర్ణ చలనం రావట్లేదు. చివరికి హై కోర్ట్, సుప్రీం కోర్టులు ఆదేశిస్తే కానీ మొద్దు నిద్ర నుండి మేల్కొనవేమో?

– చామర్తి వెంకట రామకృష్ణ

పరకాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి!

వరంగల్(రూరల్) జిల్లా పరకాలకు నైజాం వ్యతిరేక పోరాటంలో వందలాదిమందిని బలి యిచ్చిన, పోరాట వారసత్వం ఉంది. అప్పట్లో పరకాల రెవెన్యూ డివిజన్‌గానూ, మున్సిపాలిటీగానూ అత్యంత సమర్థవంతంగా నిర్వహించిన చరిత్ర కూడా ఉంది. ఇప్పటికీ ఇక్కడ జరిగే ఆదివారం సంతలో 120 గ్రామాల ప్రజలు పాల్గొని వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు సాగిస్తుంటారు. ఇక్కడి పిజి, బిఇడి, డిఇడి, పాలిటెక్నిక్, ఇతర డిగ్రీ, జూనియర్ కళాశాలల వంటివి పరకాలోనే ఉన్నాయి.

నిత్యం అనేక ప్రాంతాల నుండి విద్యార్థులు ఇక్కడకే ఉన్నత విద్యాభ్యాసం కోసం వస్తుం టారు. అనేక మెరుగైన వైద్యశాలలు, వ్యవసాయ మార్కెట్, ఆర్టీసీ బస్‌డిపో, న్యాయస్థానం, రిజిస్ట్రేషన్ కార్యాలయం, యస్‌టి వో వంటి ప్రధాన కార్యాలయాలు కూడా ఇక్కడ ఉన్నాయి. వరంగల్, భూపాలపల్లి, హుజూరాబాద్, జమ్మికుంటవంటి నగరాలకు కూడలిగా పరకాల ఉంది. అట్లాంటి పరకాలలో రెవెన్యూ డివిజన్ ను తిరిగి ఏర్పాటు చేయ వలసిన అవసరం ఉంది. పరకాల, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి, రేగొండ, శాయంపేట, దామెర, ఆత్మకూరు మండ లాల ప్రజలకు అందుబాటులో ఉన్న పరకాలలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత వాసులు గౌరవ ముఖ్యమంత్రి గారికి అఖిలపక్ష పోరాట కమిటీ పక్షాన, దుప్పటి సాంబయ్య, ఏకు సారయ్య, ఇల్లందుల రాములు, నక్క చిరంజీవి, పల్లేరు కళాధర్ తదితరులు విన్నవిస్తున్నారు.

– కొలుగూరి రాజేశ్వరరావు, పిట్ట వీరస్వామి
అఖిలపక్ష పోరాట కమిటీ నాయకులు, పరకాల

ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం

మన తెలంగాణ

మన

www.manatelangana.news

మనపేజీ మనందరిపేజీ

హైదరాబాద్ | ఆదివారం | 20 ఆగస్టు | 2017

తల్లి గర్భంలో నుండే శిశువు నేర్చుకోవడం ప్రారంభిస్తుంది. అనేక స్పందనలను తెలియజేస్తుంది. జన్మించిన క్షణం నుండి ఆకలికి కేక వేస్తూ, పెద్దలు సూచించే సూచనలకు స్పందిస్తూ, నేను స్వయంగా నేర్చుకుంటున్నాను చూడండని పెద్దల ప్రపంచాన్ని వెక్కిరిస్తుంది. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఎంతో ఆసక్తిగా తిలకించి, ఆలకించి తనదైన నేర్పును సంపాదిస్తుంది. ఎన్నోసార్లు పెద్దలమైన మనం వారి స్వేచ్ఛాపూరిత వాతావరణాన్ని అడ్డగిస్తాము.



తప్పటడుగులు వేస్తూ, పడుతూ, లేస్తూ నడక నేర్చుకునే శిశువును మనము వారిస్తుంటాము. అంటే శిశువును స్వతంత్రంగా నేర్చుకోకుండా పెద్దలమైన మనం కుటుంబం నుండి ఆంక్షలు విధిస్తాము. ఎందుకంటే మనం జీవిస్తున్న సమాజం లక్షణం ఆధిపత్యంతో ఆవరించినది కాబట్టి బలహీనులు అయిన వాళ్లు నేర్చుకోవడం, బలవంతులు కావడం మనకు ఇష్టం ఉండదు కాబట్టి. అందుకే ప్రకృతి నుండి, సమాజం నుండి పరిసరాల నుండి నేర్చుకునే శిశువును మనం కట్టడి జేసి నిర్దిష్ట పాఠ్యాంశాలతో బంధించి, వాటికి పరీక్షలు పెట్టి మార్కుల పేరుతో, గ్రేడుల పేరుతో, అపారమైన శిశువు తెలివి తేటలను మన అదుపు ఆజ్ఞలలో ఉంచడానికి ప్రయత్నిస్తున్నాము అందులో భాగమే ''డిటెన్షన్ విధానం''.

విద్యాహక్కుకు విఘాతం

ఇటీవల కేంద్ర ప్రభుత్వం తిరిగి డిటెన్షన్ విధానాన్ని తీసుకురావడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యా హక్కు చట్టం – 2009 స్ఫూర్తికి విరుద్ధంగా చట్టాన్ని మార్చడానికి కృషి చేస్తున్నది. ఈ సవరణ ప్రకారం బడి పిల్లలకు 5వ తరగతి, 8వ తరగతిలో పరీక్షలను నిర్వహించి పై తరగతులకు పంపుతారు. ఇది పూర్తిగా పిల్లల స్వేచ్ఛకు విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడవడమే!... గత కొన్ని సంవత్సరాల గణాంకాలు 1వ తరగతిలో చేరిన బాలికలు, 10వ తరగతికి చేరడంలో విఫలమవుతున్న వారు ప్రధానంగా, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలే అని అన్ని విధాల నిరూపించాయి. అనేక సామాజిక అంతరాల నుండి వస్తున్న ఈ వర్గాల పిల్లలు వెనుకబడి ఉండడం సహజం కాబట్టి. ఆ వర్గాల పిల్లలకు అండగా ఉండడానికి నాన్ డిటెన్షన్ విధానం తోడ్పడుతుందనే ఉన్నత భావనతో విద్యా హక్కు చట్టంలో దానిని చేర్చారు.

విద్యారంగంలో మార్పుల గురించి జరిగిన అనేక పరిశోధనల, పరిశీలనల, అధ్యయనాల ఫలితం 'నాన్ డిటెన్షన్ విధానం'. అనేక సంవత్సరాలు, మేధావులు, విద్యావంతులు, స్వచ్ఛంద కార్యకర్తలు నిర్వహించిన వర్క్ షాపులు, రిపోర్టుల అనంతరం దీనిని విద్యా హక్కు చట్టంలో పొందుపరచడం జరిగింది. విద్యా హక్కు చట్టం 2009లో సెక్షన్ 16ఈ విధంగా పేర్కొంటున్నది. ''అదే తరగతిలో మళ్లీ కొనసాగించడం, బడి నుంచి తీసివేయం నిషేధం'' బడిలో ప్రవేశం పొందిన బాలలను ప్రాథమిక విద్య పూర్తి అయ్యే వరకు ఏ తరగతి లోనైనా మళ్లీ కొనసాగించ కూడదు. బడి నుంచి తీసి వెయ్య కూడదు.''

సెక్షన్ 17 కూడా దీనికి సంబంధించిన స్పష్టమైన అంశాలను పేర్కొన్నది. విద్యార్థి స్వేచ్ఛగా నేర్చు కోవాలి తప్ప బలవంతంగా శిక్షలతో కాదు.

సెక్షన్ 17 (1) ఏ బాలుడు / బాలికను కూడా శారీరక శిక్షకు, మానసిక వేధింపులకు గురి చెయ్యకూడదు. పై సబ్ సెక్షన్ (1) లోని అంశాలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారు ఆ వ్యక్తికి వర్తించే ఉద్యోగ నియమాల ఆధారంగా క్రమ శిక్షణ చర్యకు గురవుతారు. పై రెండు సెక్షన్లు విద్యా విధానంలో నేర్చుకోవడం అనేది ఎంతో ఉల్లాసంగా, ఆహ్లాదకరంగా, స్వేచ్ఛగా ఆడుతూ, పాడుతూ జరగాలని తెలియజేస్తున్నాయి. ఎంతో మంది విద్యావేత్తలు, జాన్ హోల్ట్, గిజుభాయి, రవీంద్ర నాథ్ టాగూర్ లాంటి వాళ్లు పిల్లలు ఎలా నేర్చుకుంటారు అనే అంశాలపై విస్తృతమైన రచనలు చేశారు.

పిల్లలు ఎలా నేర్చుకుంటారు?

తల్లి గర్భంలో నుండే శిశువు నేర్చుకోవడం ప్రారంభిస్తుంది. అనేక స్పందనలను తెలియజేస్తుంది. జన్మించిన క్షణం నుండి ఆకలికి కేక వేస్తూ, పెద్దలు సూచించే సూచనలకు స్పందిస్తూ, నేను స్వయంగా నేర్చుకుంటున్నాను చూడండని పెద్దల ప్రపంచాన్ని వెక్కిరిస్తుంది. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఎంతో ఆసక్తిగా తిలకించి, ఆలకించి తనదైన నేర్పును సంపాదిస్తుంది. ఎన్నోసార్లు పెద్దలమైన మనం వారి స్వేచ్ఛాపూరిత వాతావరణాన్ని అడ్డగిస్తాము. తప్పటడుగులు వేస్తూ, పడుతూ, లేస్తూ నడక నేర్చుకునే శిశువును మనము వారిస్తుంటాము. అంటే శిశువును స్వతంత్రంగా నేర్చుకోకుండా పెద్దలమైన మనం కుటుంబం నుండి ఆంక్షలు విధిస్తాము. ఎందుకంటే మనం జీవిస్తున్న సమాజం లక్షణం ఆధిపత్యంతో ఆవరించినది కాబట్టి బలహీనులు అయిన వాళ్లు నేర్చుకోవడం, బలవంతులు కావడం మనకు ఇష్టం ఉండదు కాబట్టి. అందుకే ప్రకృతి నుండి, సమాజం నుండి పరిసరాల నుండి నేర్చుకునే శిశువును మనం కట్టడి జేసి నిర్దిష్ట పాఠ్యాంశాలతో బంధించి, వాటికి పరీక్షలు పెట్టి మార్కుల పేరుతో, గ్రేడుల పేరుతో, అపారమైన శిశువు తెలివి తేటలను మన అదుపు ఆజ్ఞలలో ఉంచడానికి ప్రయత్నిస్తున్నాము అందులో భాగమే ''డిటెన్షన్ విధానం''. విద్య వ్యాపారంగా మారిన తర్వాత, సమాజంలో నిలదొక్కుకోవాలంటే పిల్లలు మార్కులు సంపాదించాలి. మార్కులే సర్వస్వమైనప్పుడు విధిలేక తల్లిదండ్రులు కూడా బలవంతంగా ఆ చట్రంలో బంధితులై మార్కుల పరీక్షలకు ఒప్పుకుంటున్నారు.

డిటెన్షన్ విధానం వల్ల జరిగే నష్టమేమిటి?

ఇటీవల కేంద్ర ప్రభుత్వం తిరిగి డిటెన్షన్ విధానాన్ని తీసుకురావడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యా హక్కు చట్టం – 2009 స్ఫూర్తికి విరుద్ధంగా చట్టాన్ని మార్చడానికి కృషి చేస్తున్నది. ఈ సవరణ ప్రకారం బడి పిల్లలకు 5వ తరగతి, 8వ తరగతిలో పరీక్షలను నిర్వహించి పై తరగతులకు పంపుతారు. ఇది పూర్తిగా పిల్లల స్వేచ్ఛకు విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడవడమే!

విద్యా హకు చట్టం రూపొందించినపుడే ఈ విధానంపై అనేక చర్చలు జరిగాయి. ఎన్నో ఏళ్లుగా పిల్లలు ఎందుకు నేర్చుకోవడం లేదు? ఏ వర్గం పిల్లలు బడికి దూరం అవుతున్నారు? ఆ వర్గాలలో మొదటి తరం బాలలు కూడా కనీసం ప్రాథమిక విద్యను పూర్తి చేయలేక పోతున్నారని శాస్త్రీయంగా ఆలోచన చేసిన అనంతరమే ఈ నాన్ డిటెన్షన్ విధానాన్ని చట్టంలో పొందుపరిచారు. అందరము ఈ నిర్ణయాన్ని స్వాగతించాము. అంతే కాకుండా పూర్తిగా విద్యార్థిని గాలికి వదిలేయడం కాకుండా ప్రత్యామ్నాయంగా కంట్యూనియస్

తరగతి నిర్బంధం – పేదల త్వరగతిని అడ్డుకోవడమే



కాంప్రెహెన్సివ్ ఎవాలియేషన్'' సూచించారు. ఈ విధానం ద్వారా విద్యార్థులు అన్ని రంగాలలో తమ ప్రతిభను మెరుగు పరుచుకోవడమే కాకుండా, ప్రతి విద్యార్థిలో నిగూఢమై దాగి ఉన్న ప్రతిభను, నైపుణ్యాలను వెలికి తీయడం, పరీక్షల, మార్కుల సుడిగుండం నుండి కాపాడడం సాధ్యమవుతుంది. పర్యవసానంగా విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య చక్కటి అవగాహన ఏర్పడి టీచర్ సెంటర్‌గా ఉన్న బోధనా పద్ధతి విద్యార్థి కేంద్రంగా మారుతుంది. తద్వారా జ్ఞానాన్ని చుట్టూ ఉన్న ప్రపంచం నుండి విద్యార్థులు స్వేచ్ఛగా నేర్చుకుంటారు. గత కొన్ని సంవత్సరాల గణాంకాలు 1వ తరగతిలో చేరిన బాలికలు, 10వ తరగతికి చేరడంలో విఫలమవుతున్న వారు ప్రధానంగా, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలే అని అన్ని విధాల నిరూపించాయి. అనేక సామాజిక అంతరాల నుండి వస్తున్న ఈ వర్గాల పిల్లలు వెనుకబడి ఉండడం సహజం కాబట్టి. ఆ వర్గాల పిల్లలకు అండగా ఉండడానికి నాన్ డిటెన్షన్ విధానం తోడ్పడుతుందనే ఉన్నత భావనతో విద్యా హక్కు చట్టంలో దానిని చేర్చారు.

డిటెన్షన్ ద్వారా క్వాలిటీ మెరుగు పడుతుందా?

డిటెన్షన్ విధానం విద్యార్థుల ప్రతిభను మెరుగుపరుస్తుందని ప్రభుత్వం సమర్థించుకుంటున్నది. దీనిని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు కూడా సమర్థిస్తున్నారని వాదిస్తున్నది. అయితే, గుణాత్మక విద్య అంటే ఏమిటి? మన విద్యా లక్ష్యాలను వదిలి వేసి, కేవలం డిగ్రీలు అందించి ఇతర దేశాలకు కావలసిన ఉద్యోగులుగా చేయడమా? లేక తన చుట్టూ ఉన్న సమాజం నుండి పొందిన జ్ఞానాన్ని తిరిగి ఆ సమాజానికి అందజేయడమా? అనేది మౌలిక ప్రశ్న! పిల్లలు సరిగ్గా నేర్చుకోవడం లేదని ఎన్నో కమిషన్లు, కమిటీలు, రిపోర్టులు నిరూపించాయి. ప్రభుత్వాలు కూడా సంతృప్తిగా లేక ఆ నిందను పాఠశాలలపై, ఉపాధ్యాయులపై మోపడానికి కృషి చేస్తున్నది.

ఎందుకు డిటెన్షన్‌పైనే కేంద్రీకరణ?

విద్యా హక్కు చట్టంలో పొందుపరిచిన అంశాలు – బడి బయటి పిల్లలను బడికి చేర్చడం, ఉపాధ్యాయ భర్తీలు, ఉపాధ్యాయ శిక్షణ, కనీస వసతులు కల్పన, బాలల హక్కుల రక్షణ లాంటి అనేక అంశాలు ఉండగా కేంద్ర ప్రభుత్వం కేవలం డిటెన్షన్ విధానంపైననే ఎందుకు దృష్టి కేంద్రీకరిస్తున్నది? ఈ మధ్య కాలంలో ''నూతన విద్యా విధానం'' పేరిట విద్యా రంగాన్ని కేవలం నైపుణ్యాలకు దించి విద్యా లక్ష్యాలను ప్రభుత్వం నీరుగార్చింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులను విద్యకు దూరం చేసి, కేవలం నైపుణ్య విద్య పేరిట డిటెన్షన్ పేరుతో పై తరగతులకు వెళ్లకుండా చేసి, వ్యాపార వర్గాల వారికి, గుత్త పెట్టుబడిదారులకు వేతన కూలీలను తయారు చేయడమే ప్రధాన ఉద్దేశం. అంతిమంగా వెనుకబడిన వర్గాల పిల్లలు పై చదువులకు దూరం చేసి, వారందరూ చిన్నాచితక ఉద్యోగాలు చేసుకునే వారిగా మార్చడమే దీని ఉద్దేశం. ఈ విధానాన్ని కొన్ని రాష్ట్రాలు స్వాగతిస్తే, కొన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తన వ్యతిరేకతను తెలియజేసింది. అయితే, విద్యావంతులలో ఒక వర్గం, కొంత మంది ఉపాధ్యాయు విధానం వలన క్వాలిటీ పెరుగుతుందని ఆశిస్తున్నారు. కానీ ఇక్కడ గమనించవలసిన ప్రధానాంశం అట్టడుగు వర్గాల పిల్లలకు దక్కుతున్న హక్కును కేవలం పరీక్షల పేరుతో విఫలం చేసి, వారు చదువుకు పనికి రాని వాళ్ళుగా చూపించడం అన్యాయం. ప్రభుత్వాలు తమ చేతకాని తనాన్ని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్య అగాథాన్ని పెంచడానికి జరిగే కుట్రలో భాగమే. ఈ తిరోగమన విధానం.

ప్రభుత్వం ఈ చర్యలను వెంటనే నిలిపివేసి విద్యారంగ పటిష్టత వైపు దృష్టి పెట్టాలి. విద్యా రంగానికి కావలసిన నిధులను సమకూర్చాలి. దేశంలో లక్షలాదిగా, రాష్ట్రంలో వేలాదిగా ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలి. ఆకలితో బడికి వచ్చే పిల్లలు ఏం నేర్చుకుంటారు? వారందరికీ పౌష్టికాహారం అందించాలి. ఉపాధ్యాయులకు నిపుణ శిక్షణను అందించాలి. టీచర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూషన్స్‌లను ప్రభుత్వాలే నిర్వహించాలి. ప్రతి పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను పటిష్ట పరచాలి! ప్రైవేటు విద్యా రంగంపై నియంత్రణ ఏర్పాటు చేయాలి!

ఈ చర్యలు చేపట్టిన తర్వాతనే విద్యా రంగంలో సంస్కరణలకు ప్రయత్నించాలి! అన్ని ఏర్పాట్లు చేసిన అనంతరం స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉపాధ్యాయులు పిల్లలు కలిసి జ్ఞాన సముపార్జనకు కృషి చేస్తారు. పిల్లలకు భారంగా మారుతున్న డిటెన్షన్ విధానం ఏ విధంగా కూడా సమర్థనీయం కాదు. ఎలాంటి సంస్కరణలైనా, మార్పులైనా, ఇప్పుడిప్పుడే బడిలో చేరుతున్న బడుగు వర్గాల, జాతుల పిల్లల చదువు కొనసాగేందుకు తోడ్పడేలా ఉండాలి! కానీ బడి మానివేసే విధంగా ఉండరాదు. అలాంటి విధానాలు బాలల హక్కులను హరిస్తాయి.



చిక్కు మురళీమోహన్
'సాధన'
98490 97586

సరదాగా ఒకరోజు జైలు జీవితం

ఖైదీగా ఒకరోజు జీవితం గడపాలనుకునేవారు రూ.500 చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలి. జైలు లోపలికి వెళ్లడానికి ముందు సెల్‌ఫోన్ ఇతర వస్తువులన్నీ అధికారులకు అప్పగించాలి. జైలు అధికారులు వారికి ఖైదీ దుస్తులు (ప్రిజనర్ కిట్) ఇచ్చి ఖైదీ నంబరు కేటాయిస్తారు. ఖైదీలకు వడ్డించే భోజనమే పెడతారు.

జైలులో ఖైదీ జీవన స్థితిగతులు ఎలా వుంటాయి? స్వయంగా అనుభవించాలనుకుంటున్నారా? హైదరాబాద్ నగరానికి సమీపంలోని సంగారెడ్డి జిల్లా జైలులో ఒకరోజు ఖైదీ జీవితాన్ని గడపవచ్చు. సంగారెడ్డిలోని పాత జైలులో ఒకరోజు ఖైదీ జీవితాన్ని గడిపేందుకు ఏర్పాట్లు చేశారు. 1796లో ఒక ఎకరా 12 గుంటల స్థలంలో సైనిక గుర్రాలను కట్టేందుకు ఈ కట్టడాన్ని నిర్మించారు. 1977లో ఈ భవనాన్ని ప్రభుత్వం జైళ్ల శాఖకు బదలాయించింది. అప్పటి నుంచి సంగారెడ్డిలో జిల్లా జైలుగా ఉపయోగపడింది. 218 సంవత్సరాల క్రితం కట్టడం కావడం, రోజురోజుకు నేరస్థుల సంఖ్య పెరగడం జైళ్ల శాఖలో సంస్కరణలు అమలులోకి రావడం వల్ల ప్రభుత్వం జిల్లా జైలును కంది మండలంలో 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కొత్త భవనానికి తరలించారు. దీంతో పాత జైలు వృథాగా వుండిపోయింది. 218 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరకుండా భవిష్యత్ తరాలకు విజ్ఞానాన్ని అందించే కేంద్రంగా చేయాలన్న ఉద్దేశం కలిగింది. జైళ్ల శాఖ డిజి వినయ్‌కుమార్ సింగ్ ఈ ప్రాంగణాన్ని తెలంగాణ చరిత్రకు అద్దం పట్టే విధంగా మ్యూజియంగా మార్చడానికి నిశ్చయించారు. జైలులో మ్యూజియంను గత సంవత్సరం ఆగస్టు నెలలో ఏర్పాటు చేశారు. అలాగే ఈ కారాగారాన్ని డమ్మీ జైలుగా మార్చారు. ఎవరైనా ఖైదీగా ఒకరోజు జీవితం గడపడానికి ఇష్టపడే వారు ముందుగా రూ.500 చెల్లించి తమ పేరు నమోదు చేయించుకోవాలి. జైలు లోపలికి వెళ్లడానికి ముందు తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఇతర వస్తువులన్నీ అధికారులకు అప్పగించాల్సి వుంటుంది. తర్వాత జైలు అధికారులు వారికి ఖైదీ దుస్తులు (ప్రిజనర్ కిట్) అందజేయడంతో పాటు ఖైదీ నంబరు కూడా కేటాయిస్తారు. ఖైదీలకు ఏ విధమైన భోజనం పెడతారో ఆ భోజనాన్నే వీరికి కూడా అందజేస్తారు. ఖైదీలు జైలులో ఏ విధంగా అయితే పనులు చేస్తారో ఆ పనులన్నీ వారితో చేయిస్తారు. ఒక వేళ ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకొని జైలులోకి వెళ్లిన తర్వాత 24 గంటల పాటు ఖైదీగా జైలు జీవితం గడపడానికి ఇష్టపడకపోతే అదనంగా రూ.500 జరిమానాగా చెల్లించి బయటకు వెళ్లిపోవాల్సి వుంటుంది.



ఒకరోజు జైలు జీవితాన్ని గడిపేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్నారు. ఇప్పటివరకు మొత్తం 21 మంది గడిపి వెళ్లారు. ముంబయ్, చెన్నయ్, అహ్మదాబాద్, చండీఘడ్, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, పాండిచ్చేరితో పాటు హైదరాబాద్, విశాఖపట్నం, నిజామాబాద్, బాన్సువాడ తదితర ప్రాంతాల నుంచి వచ్చారు. జైలు జీవితాన్ని గడపేందుకు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవడానికి 9494632178 సెల్ నంబర్‌కు ఫోన్ చేయాల్సి వుంటుంది.



వెంకటేశ్వర్,
జైలు డిప్యూటీ సూపరింటెండెంట్

– మనుబ్రహ్మ మధుసూదన్‌చారి
మన తెలంగాణ ప్రతినిధి–, సంగారెడ్డి
9441065395

వాతావరణ పరిస్థితులకు తగ్గుట్టుగా పశుగ్రాస విత్తనోత్పత్తి : పార్థసారధి

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో విత్తనాభివృద్ధికి అనుకూలంగా ఉన్న నేలలు, వాతావరణ పరిస్థితులను ఉపయోగించుకొని నాణ్యమైన పశుగ్రాస విత్తన ఉత్పత్తి చేపట్టాలని వ్యవసాయ కార్యదర్శి సి. పార్థసారథి సూచించారు. ప్రైవేటు రంగంలో ధృవీకరణ విత్తనోత్పత్తి చేసి పాడి, గొర్రె, మేకల రైతులకు నాణ్యమైన పశుగ్రాస విత్తనం సరఫరా చేయవచ్చన్నారు. ఇందుకోసం సంబంధిత విభాగాల అధికారులతో ఒక కమిటీ వేసారు. పశుగ్రాస విత్తనోత్పత్తిపై పార్థసారధి పశుసంవర్ధక, విత్తన ధృవీకరణ సంస్థ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా 21 శాతం విత్తనోత్పతిలో వృద్ధి సాధించాలన్నారు. పశుగ్రాస విత్తనోత్పత్తి ఖర్చు తక్కువగా ఉంటుందని, సన్న చిన్నకారు రైతులకు ఎక్కువగా లాభసాటిగా ఉండనుందన్నారు. రాష్ట్ర విత్తన, సేంద్రీయ ధృవీకరణ అథారిటి డైరెక్టర్ డాక్టర్ కే.కేశవులు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనంతో అధిక పశుగ్రాస దిగుబడులు సాధించి పాడి, గొర్రె మేకల సంపద సృష్టించవచ్చునన్నారు. జొన్న, మొక్కజొన్న, సజ్జ, అలసంద లాంటి 11 రకాల పంటలలో 70 కి పైగా రకాల పశుగ్రాస విత్తన ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. రాష్ట్రంలో 2.6 కోట్ల పశుసంపద ఉండగా 2 శాతం మాత్రమే నాణ్యమైన పశుగ్రాస విత్తన సరఫరా జరుగుతుందన్నారు. నాణ్యమైన పశుగ్రాస సరఫరాలో 66 శాతం లోటుందన్నారు.





నేడు భారీ వర్షసూచన

● **ఖమ్మం, వరంగల్ జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం**

మన తెలంగాణ/హైదరాబాద్: అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో ఆదివారం నాడు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం తెలంగాణపై చురుకుగా ఉన్నాయి. వరంగల్, ఖమ్మం జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. ఉత్తర కోస్తాంధ్ర నుంచి దక్షిణ ఒడిషా తీరప్రాంతం, పశ్చిమమధ్య బంగాళాఖాతం వరకు అల్పపీడన ద్రోణి ఆవరించివుంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడింది. దక్షిణ తమిళనాడు నుంచి కోస్తాంధ్ర, రాయలసీమ వరకు ఆవర్తన ద్రోణి ఆవరించింది. ఇదిలా ఉండగా గత 24 గంటల్లో వరంగల్ జిల్లా ఏటూరు నాగారంలో 9, ఖమ్మం జిల్లా కోయిడలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ములకలపల్లిలో 6, సత్తుపల్లి, గోవిందరావుపేట, వెంకటాపూర్, మణుగూరు, నల్లబెల్లిలో 5, అశ్వారావుపేట, బోనకల్, పినపాక, బూర్గంపాడు, అశ్వారావుపేట్, ములుగు, భూపాలపల్లి, భద్రాచలం, దుమ్ముగూడెం, కొణిజెర్ల, ఖానాపూర్, తల్లాడలో 4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అశ్వాపురం, జూలూరుపాడు, మధిర, గుండాల, చంద్రుగొండ, బయ్యారం, కూసుమంచి, దామరగిద్ధ, కొత్తగూడెం, గూడూరు, శాయంపేట, పాల్వంచ, ఉట్నూరు, ఎంకూరు, కొత్తగూడెం, ఇల్లందు, చెన్నారావుపేట, ఖమ్మంలో 3, పరకాల, ఆత్మకూరు, ఆసిఫాబాద్, నర్సంపేట, జగిత్యాల, మహబూబాబాద్, నర్మెట్ట, కాళేశ్వరం, కోస్గి, జగిత్యాల, మల్యాల, దోమ, చింతకంలో 2, పెగడపల్లి, జనగాం, పర్వతగిరి, మొగుల్లపల్లి, మెట్‌పల్లి, లక్సెట్టిపేట, హన్మకొండ, టేకులపల్లి, గంగాధర, గార్ల, బెజ్జంకి, రామగుండం, ఖాన్‌పూర్, సూర్యాపేట, మద్దూరు, జూలపల్లి, చెన్నూరు, తిమ్మాపూర్, పాలకుర్తి, మహబూబ్‌నగర్, సిరిసిల్ల, నారాయణపేట్, దోర్నకల్, మంచిర్యాల్, మాగనూర్, హసన్‌పర్తి, ధర్మపురి, కొడంగల్, దుబ్బాక, మిర్యాలగూడ, గండీడ్, జడ్చర్ల, ధర్మాసాగర్, గణ్‌పూర్, తాడూరు, మహేశ్వరం, గోల్కొండ, మక్తల్ తదితర ప్రాంతాల్లో 1 సెంటీమీటర్ వర్షపాతం నమోదైంది.

స్కైవేకి మోక్షం

(మొదటిపేజీ తరువాయి)

కొద్ది ముందే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ ప్రారంభం కానుంది. 1.46 కి.మీ పొడవులో దీనిని నిర్మిస్తారు. రామంతాపూర్ దూర్‌దర్శన్ కేంద్రం దాటాక డీ మార్ట్ వరకు ఈ స్కైవేను నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ ఎలివేటర్ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 244 కోట్లు కాగలదని అధికారులు అంచనా వేశారు. రాజధాని హైదరాబాద్ నడిబొడ్డు కావడంతో ఇళ్ల తొలగింపు, లేదా భూసేకరణకు జిహెచ్ఎంసి రూ.133 కోట్ల వరకు భరించనుందని, ఆపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరించవచ్చని అధికార వర్గాలు వెల్లడించాయి. ఒకవేళ కేంద్రం నిధులు ఇవ్వడానికి ముందుకు రాక పోయినా రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్ నుండి నిధులను కేటాయించేందుకు అంగీకారం తెలుపనుందని కూడా అధికారులు వెల్లడించారు. ఎన్‌హెచ్‌ఏఐ నుండి అనుమతులు రాగానే స్కై వేల కోసం టెండర్లు పిలుస్తామని, రెండేళ్ల కాల వ్యవధిలోనూ పనులు ముగిసేలా చూస్తామని అధికార వర్గాలు తెలిపాయి. అంబర్ పేట ఎలివేటర్ కారిడార్ పనులు పూర్తి అయిన వెను వెంటనే ఉప్పల్ జంక్షన్ వద్ద కూడా ఇలాంటి స్కైవే నిర్మాణ పనులను ప్రభుత్వం చేపట్టనుందని వారు వెల్లడించారు.

గడువు పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

సేవా కేంద్రాల్లో రిటర్నుల దాఖలు ప్రక్రియ కోసం ఒక డెమో కార్యక్రమాన్ని కూడా అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమం నేటితో ముగుస్తుంది. రిటర్నుల దాఖలు విషయంలో పన్ను చెల్లింపుదారులకు వారు సహకరిస్తారు. ఈ ఏడాది జులై 1 నుండి వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి)ని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేసిన సంగతి తెలిసిందే.

ఈ నెల 25 వరకు గడువు : విపరీతమైన రద్దీ కారణంగా జిఎస్‌టిఎన్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో జిఎస్‌టి విధానం కింద రిటర్నుల దాఖలుతో పాటు పన్నుల చెల్లింపుకు తుది గడువును మరో ఐదు రోజుల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం శనివారం నిర్ణయం తీసుకుంది. తాజా వెసులుబాటుతో పన్ను చెల్లింపుదారులు ఈ నెల 25 వరకు రిటర్నులు దాఖలు చేసుకోవచ్చు. జిఎస్‌టి వెబ్‌సైట్ సాంకేతిక సమస్యను పరిష్కరించామని, టాక్స్ ఫైలింగ్ మళ్లీ మొదలైందని జిఎస్‌టిఎన్ ఛైర్మన్ నవీన్ కుమార్ వెల్లడించారు. కాగా, తొలుత జులై నెలకు సంబంధించిన ఈ మొట్టమొదటి జిఎస్‌టి రిటర్నుల దాఖలుకు తుది గడువును ఆగస్టు 20గా ప్రకటించారు. 'జులై నెలకు సంబంధించిన జిఎస్‌టి రిటర్నులకు తుది గడువును ఈ నెల 25 వరకు పొడిగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాధికారులతో ఏర్పాటైన జిఎస్‌టి అమలు కమిటీ నిర్ణయించింది' అని ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. జమ్ము–కశ్మీర్‌తో పాటు కొన్ని వరద తాకిడి రాష్ట్రాలు తుది గడువు పొడిగింపును కోరాయి. కాగా, ట్రాన్స్ 1 ఫారం ద్వారా పాత పన్నులను చెల్లించిన వారికి జిఎస్‌టి రిటర్నుల దాఖలుకు తుది గడువు ఈ నెల 28.

వ్యవసాయ విధాన సారథి అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

అవృద్ధికి కృషి చేసేవారికి భారత ఆహార వ్యవసాయ మండలి 2008 నుంచి అవార్డును అందజేస్తుంది. లక్షలాది మంది వ్యవసాయదారుల జీవితాల్లో మార్పు కోసం విభిన్న పథకాలతో కృషి చేస్తున్నందుకు సిఎం కెసిఆర్‌కు అవార్డు అందజేస్తున్నామని వ్యవసాయ, ఆహార మండలి ప్రకటించింది.

గవర్నర్, మంత్రుల హర్షం: భారత వ్యవసాయ, ఆహార మండలి పురస్కారం ముఖ్యమంత్రి కెసిఆర్‌కు దక్కడంపై గవర్నర్ ఇఎస్‌ఎల్ నరసింహన్ హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ అభివృద్ధిపై, వినూత్న సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సిఎం చేస్తున్న కృషికి గుర్తింపుగా అవార్డు దక్కిందని ప్రశంసించారు. సిఎం కెసిఆర్‌కు ప్రతిష్టాత్మక వ్యవసాయ పురస్కారం లభించడంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. 2008 నుంచి భారత ఆహార మండలి అవార్డులు ప్రధానం చేస్తోందని, తొలిసారిగా రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌కు అవార్డు దక్కడం, ఆయన కృషికి, కష్టానికి లభించిన గుర్తింపు అని తుమ్మల ప్రశంసించారు. రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయం, అనుబంధ రంగాలకే సగం కేటాయించిన ముఖ్యమంత్రి కెసిఆర్‌కు రైతులు, వారి సమస్యలపై పూర్తి అవగాహన ఉందని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

జల్లులు కాదు... భారీ వర్షాలు కావాలె

చేప పిల్లల పంపిణీకి చెరువులు నిండే వాన కోసం ఎదురుచూస్తున్న మత్స్యశాఖ



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర మత్స్యశాఖ భారీ వర్షాల కోసం ఎదురు చూస్తోంది. జూన్‌లో తొలకరి జల్లులు మురిపించగా, జూలైలో ఆ మాత్రం కూడా లేవు. ఇప్పటి వరకు కురిసిన వానలు, ప్రస్తుతం కురుస్తున్నవి సాధారణ స్థాయిలోనే ఉండటంతో రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు తగిన స్థాయిలో నిండడం లేదు. దీంతో గత ఏడాది కంటే ఈసారి ఒక నెల ముందే చేప పిల్లలను పంపిణీ చేసేందుకు మత్స్యశాఖ దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వంద శాతం సబ్సిడీపై 70 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేసేందుకు అవసరమైన టెండర్ల ప్రక్రియ కూడా ముగిసింది. టెండర్లు దక్కించుకున్న వారు చేప పిల్లలు పంపిణీ చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నారని, మార్గదర్శకాలు కూడా సిద్ధం చేశామని మత్స్యశాఖ కమిషనర్ డాక్టర్ టి. సువర్ణ మన తెలంగాణకు తెలిపారు. నీటి వనరులు తగిన స్థాయిలో నిండుకోకపోవడంతోనే చేప పిల్లల పంపిణీ ప్రక్రియ కాస్త ఆలస్యమవుతోందని చెప్పారు.

చెరువులు నిండకపోతే కష్టమే

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 77 రిజర్వాయర్లు, 4647 చెరువులు, 19645 గ్రామ ట్యాంకులలో వేసేందుకు 70 కోట్ల సబ్సిడీ చేప పిల్లలను పంపిణీ చేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు రూ. 55 కోట్ల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఒకవేళ అతి భారీ వర్షాలు కురవకపోతే ఈ ఏడాది పంపిణీ చేయనున్న చేప పిల్లల సంఖ్య తగ్గనుంది. చాలా వరకు చెరువులు, కుంటల్లో వాటి విస్తీర్ణం మేర కాకుండా తక్కువగా నీటి నిల్వ ఉందని తెలిసింది. ఎగువ రాష్ట్రాలలోనూ తగిన స్థాయిలో వానలు లేకపోవడంతో రిజర్వాయర్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ముున్ముందు కూడా ఇలాగే ఉంటే అనుకున్నంత సంఖ్యలో చేప పిల్లలు పంపిణీ చేయడం కష్టమే.

నీటి సామర్థ్యానికి తగిన సైజులో చేప పిల్లలు

ఈసారి నీటి సామర్థ్యానికి తగిన సైజులో చేప పిల్లలను పంపిణీ చేసేలా మత్స్యశాఖ మార్గదర్శకాలు రూపొందించింది. ఇందులో శాశ్వాత నీటి వనరుల్లో ఒక హెక్టరు చొప్పున 1000 హెక్టార్ల వరకు నీటి విస్తీర్ణం ఉన్న నీటి వనరులలో 2 వేలు చేప పిల్లలను, 1000 నుంచి 5 వేల హెక్టార్ల వరకు ఒక వెయ్యి చేప పిల్లలు, 5 వేల హెక్టర్లు ఆపైన అయితే 500 వరకు 80100 మి.మీ పరిమాణం కలిగిన చేప పిల్లలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఏడాదిలోపు నీరు ఉండే (సీజనల్) నీటి వనరుల్లో 3540 మి.మీల సైజులో పంపిణీ చేయనన్నారు. గత ఏడాది బొచ్చె, రాగండి, ఎర్రమోసు చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేయగా, ఈసారి ప్రత్యేకంగా 25 శాతం బంగారు తీగ చేప పిల్లలను కూడా పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇతర చేపలతో పోలిస్తే బంగారు తీగకు మార్కెట్‌లో డిమాండ్‌తో పాటు కాస్త రేటు ఎక్కువ కావడం అలాగే దీని పునరుత్పాదకత కూడా ఏడాదికి మూడుసార్లు ఉండటమే ఇందుకు కారణంగా తెలిసింది. గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ మీద రూ. 21.21 కోట్లతో 27.78 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేసింది. ఇందులో మాత్రమే ఉన్నాయి. ఇవి కూడా చిన్న సైజు 3540 మి.మీ సైజువి మాత్రమే. అయితే కొన్ని చెరువులు, కుంటలలో నీరు తొందరగా ఇంకిపోతుండటంతో చేపల ఎదగకపోవడం, ఊపిరాడక చనిపోవడం వంటివి చోటుచేసుకున్నాయి. దీంతో ఈసారి 3540 మి.మీ సైజులో దాదాపు 53 కోట్లు, 80100 మి.మీ సైజులో 17 కోట్ల చేప పిల్లలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ ఏడాది చేప పిల్లల పంపిణీలో సొసైటీ సభ్యులను కూడా భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. టెండరులో తెలిపిన ప్రమాణాలకు అనుగుణంగా చురుగ్గా ఆరోగ్యవంతంగా ఉండే వాటినే నీటి వనరుల్లో వదలాలని, నాణ్యత లేని చేప పిల్లలను వెంటనే తిరస్కరించాలని, నీటిలో వదిలిన తరువాత ఫిర్యాదుల స్వీకరించవద్దని జిల్లా కలెక్టర్లు, మత్స్య శాఖ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు.

14 బోగీలు బోల్తా

(మొదటిపేజీ తరువాయి)

చిక్కుపడ్డ వారిని వెలికితీసేందుకు అధికారులు సహాయ బృందాలతో రంగంలోకి దిగారు. ప్రమాదం గురించి రైల్వే అధికార ప్రతినిధి అనిల్ సక్సేనా ప్రకటన వెలువరించారు. రైలు పట్టాలు తప్పిన బోగీలు దారి వెంట ఉన్న ఇళ్లలోకి కూడా దూసుకుపోయినట్లు తెలిసింది. దీనితో ఇళ్లలోని వారు కూడా గాయపడ్డారు.ఘటనాస్థలికి 30కి పైగా అంబులెన్స్‌లు చేరుకున్నాయి. పట్టాలు తప్పడానికి కారణాలు వెల్లడికాలేదు. అయితే బోగీలన్నీ కుప్పయిపోయి మేడలుగా మారి ఉండటంతో ఎంత మంది చనిపోయి ఉంటారనేది వెంటనే అంతుచిక్కలేదు. ఘటనాస్థలిలో విషాదం నెలకొంది. ఘటనపై రైల్వే మంత్రి సురేష్ ప్రభు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. తాను కూడా వ్యక్తిగతంగా సహాయక చర్యలను పర్యవేక్షిస్తానని తెలిపారు. పట్టాలు తప్పిన ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ఈ ప్రమాదం గురించి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే సంఘటనా స్థలికి తరలివెళ్లాలని, సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఇద్దరు మంత్రులను ఆదేశించారు. . ఈ ప్రమాద ప్రాంతానికి రైల్వేల సహాయ మంత్రి మనోజ్ సిన్హా బయలుదేరి వెళ్లారు. రెండు జాతీయ విపత్తు నివారణ దళాలు చేరుకున్నాయి. ఘటనకు దారితీసిన కారణాలను వెలికితీసేందుకు సుశిక్షత జాగిలాలను కూడా పంపించారు. దేశరాజధాని ఢిల్లీకి సుమారు వందకిలోమీటర్ల దూరంలో ఈ విపత్తు చోటుచేసుకుంది. ఒడిషాలోని పూరీ నుంచి అత్యధికంగా ప్రయాణికులు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు వెళ్లుతుండగా ఈ ఘటన జరగడంతో మరింత ఆందోళన రేకెత్తింది. ప్రమాదంపై వివరాలు తెలుసుకునేందుకు హెల్ప్ లైన్లు ఏర్పాటు చేశారు. 5101 నెంబర్లకు, 9760534054 నెంబర్లలో దేనికైనా ఫోన్ చేసి సమాచారం తీసుకోవచ్చునని అధికారులు తెలిపారు.

సడెన్ బ్రేక్‌తోనే రైలు ప్రమాదం ?

లక్నో : డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడం వల్లనే కళింగ ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పిందని వెల్లడైంది. శనివారం సాయంత్రం ఉత్తరప్రదేశ్‌లో ఈ రైలు బోగీలు పట్టాలు తప్పిన ఘటనపై రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అరవింద్ కుమార్ స్పందించారు. పట్టాలపై ఏవో మరమ్మత్తు పనులు సంకేతాలు ఏవీ లేకుండానే జరుగుతున్నట్లు గమనించిన డ్రైవర్ వెంటనే బ్రేక్‌లు వేశారని, దీనితో బోగీలు పట్టాలు తప్పాయని కుమార్ తెలిపారు. పూరీ నుంచి హరిద్వార్‌కు వెళ్లుతున్న ఈ రైలు ముజఫర్‌నగర్ జిల్లాలో పట్టాలు తప్పింది. పనులు జరుగుతున్నట్లుగా ఎలాంటి సంకేతాలు లేకుండా పట్టాలపై రైలు వస్తున్న సమయంలోనే మరమ్మతు పనులు చేపట్టడం వెనుక ఏదో కుట్ర ఉందని ప్రమాద స్థలి ఖతౌలీ నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యే విక్రమ్ సింగ్ సైనీ ఆరోపించారు. దీనిపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. రైలు ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే మంత్రిత్వశాఖ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అవసరమైన సహాయక చర్యలు చేపడుతుందని తెలిపారు

ఇంట్లో పేలుడు

(మొదటిపేజీ తరువాయి)

కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు, క్లూస్ టీం అధికారులు సందర్శించి పరిశీలించారు. మృతుడు ఇటీవలే ఇస్లాం మతంలో చేరడంతో భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఘటనా స్థలంలో మతానికి సంబంధించిన పుస్తకాలు కూడా లభ్యమయ్యాయి. గణేష్ ఉత్సవాలు ప్రారంభం కాబోతున్న తరుణంలో ఈ పేలుడు చోటుచేసుకోవడంపై పోలీసుల వర్గాలు ఉలిక్కి పడ్డాయి. దీంతో సైబరాబాద్, రాచకొండ, నగర పోలీసు కమిషనరేట్ల పోలీసులను అప్రమత్తం చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్ గ్రామానికి చెందిన తిప్పగల్ల యాదయ్య కుమారుడు తిప్పగల్ల పరుశురామ్ అలియాస్ పాషా (27), శైలజ (21) దంపతులు. గతంలో పరుశురామ్ భీమ్ ఇంటర్‌నెట్ సంస్థలో మూడేళ్ల పాటు ఉద్యోగం చేశాడు. రెండేళ్ల క్రితం ఉద్యోగం మానేసిన పరుశురామ్ జులాయిగా తిరుగుతున్నాడు. కొద్ది రోజుల క్రితం ఇస్లాం మతంలో చేరాడు. దీంతో అతని భార్య ఇంట్లో గొడవ పెట్టుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. శనివారం ఉదయం 8.30 గంటలకు పరుశురామ్ ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. అదే సమయంలో భారీ పేలుడు సంభవించింది. పేలుడు శబ్దం విన్న పక్కింటికి చెందిన ఉదయ్ అనే యువకుడు పరుగెత్తుకెళ్లి చూసేసరికి పరుశురామ్ అపస్మారక స్థితిలో కాలిపోయి పడిఉన్నాడు. ఇంట్లో దట్టమైన పొగలు ఆవరించి ఉన్నాయి. సమాచారం అందుకున్న ఎసిపి రవీందర్‌రెడ్డి, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌గౌడ్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకునే సరికే పరుశురామ్ చనిపోయాడు. ఘటనా స్థలంలో అరలీటర్ కిరోసిన్ బాటిల్, ఎలక్ట్రానిక్ ప్రెషర్ కుక్కర్, ఓ మతానికి చెందిన సాహిత్యం, పరుశురాం రాసుకున్న డైరిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలు కీలక ఆధారాలను సేకరించినట్లు సమాచారం. పరుశురామ్ బిఎన్‌రెడ్డినగర్‌లోని న్యూచైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తిచేసుకుని అరుణోదయ డిగ్రీ కళాశాలలో చదువు పూర్తి చేయకుండానే మానేశాడు.

ఉగ్ర కోణంలో దర్యాప్తు: పరుశురామ్ ఇంట్లో చోటుచేసుకున్న పేలుడును ఉగ్ర కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని అధికారులు అంటున్నారు.పేలుడు ఎలా జరిగింది, ఘటనా స్థలంలో లభించిన ప్రెషర్ కుక్కర్ లభ్యం కావడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పేలుడు పదార్థాలు తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలుడు జరిగి ఉంటుందనే అనుమానాలు కలుగుతున్నాయి.జూన్ 26న టోలిచౌకిలో సుబ్రమణ్యం అనే యువకుడు కూడా ఉగ్ర సంస్థలో చేరేందుకు ప్రయత్నించాడు. అప్పటికే పలువురు ఉగ్రవాదులతో కలిసి బాంబులు తయారు చేయడం నేర్చుకున్నాడు. ఇంతలోనే నగర పోలీసులు అరెస్టు చేయడంతో పెద్ద ముప్పు తప్పింది. సుబ్రమణ్యం కూడా పరుశురామ్ మాదిరిగానే మతాన్ని మార్చుకుని ఒమర్‌గా పేరు మార్చుకున్నాడు. ఇస్లాం మతం స్వీకరించడంతో అతన్ని కూడా కాకినాడలోని ఇంట్లో నుంచి వెళ్లగొట్టడంతో టోలిచౌకిలో వచ్చి స్థిరపడ్డాడు. ఇతను పట్టుబడిన ఉదంతం మరువకముందే అచ్చం అదే మాదిరిగా పరుశురామ్ ఘటన చోటుచేసుకోవడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి.





కేసుల చిక్కుల్లో ప్రాజెక్టులు

(మొదటిపేజీ తరువాయి)

మార్పు రావాలన్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టు వ్యయం రూ.400 కోట్లు కాగా, పరిహారం చెల్లింపుల కోసం రూ.1400 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చిందన్నారు. జలసౌధలో ప్రభుత్వ ప్లీడర్లు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో మంత్రి హరీశ్‌రావు శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు.వివిధ ప్రాజెక్టులలో ఉన్న కోర్టు కేసులను మంత్రి సమీక్షించారు. సకాలంలో ప్రాజెక్టులు పూర్తికావాలని, కేసులు అడ్డంకి కాకూడదని, న్యాయపరమైన చిక్కులు త్వరగా పరిష్కరించాలని కోరారు. కోర్టు తీర్పులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాకుండా బలంగా వాదించాలని, అన్ని కేసుల్లో ప్రభుత్వమే గెలవాలని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆయా కేసులలో కౌంటర్ అఫిడవిట్లను సకాలంలో దాఖలు చేయకపోవడం, సమర్థంగా వాదించకపోవడం వంటి కారణాలతో కోర్టులు కొన్ని సందర్భాలలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉత్తర్వులు ఇస్తున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. సాగునీటి ప్రాజెక్టుల ప్రాముఖ్యం, రైతాంగం ప్రయోజనాలు, వ్యవసాయ రంగంలో సంక్షోభానికి చరమగీతం పాడేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కోర్టులలో బలంగా వాదించాలని కోరారు. ఇరిగేషన్, న్యాయ, రెవెన్యూ శాఖలు, ఇతర ప్రభుత్వ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని హరీశ్‌రావు కోరారు. ఆయా శాఖలు, అధికారుల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చూడాలని, దేవాదుల, ఎఎంఆర్‌పి, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులలో పలు చోట్ల పది, ఇరవై ఎకరాల భూసేకరణ సమస్యలు కోర్టు కేసులలో చిక్కుకున్న కారణంగా వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించలేకపోతున్నట్లు హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్ధాలుగా ఈ కేసులు అపరిష్కృతంగా ఉంటున్నాయన్నారు. ప్రాజెక్టులను అడ్డుకోవడానికి కొందరు వ్యక్తులు, కొన్ని శక్తులు అటు గ్రీన్ ట్రిబ్యునల్‌లో, హైకోర్టులో తప్పుడు కేసులు వేస్తున్నాయని తెలిపారు. కొన్ని స్టే ఉత్తర్వుల కారణంగా ప్రాజెక్టులు, కాలువల నిర్మాణపు పనులు పెండింగ్‌లో పడుతున్నాయని హరీశ్‌రావు తెలిపారు. స్టే ఇచ్చిన వెంటనే వాటిని 'వెకేట్' చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. దీని వల్ల వేల కోట్ల భారం ప్రాజెక్టులపై పడుతోందని చెప్పారు. ప్రభుత్వ ప్లీడర్లు, ఇరిగేషన్ అధికార యంత్రాంగం, రెవెన్యూ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రో యాక్టివ్‌గా పనిచేయాలని మంత్రి కోరారు. జిల్లాల వారీగా, ప్రాజెక్టుల వారీగా భూసేకరణ, ఇతర అంశాలపై కోర్టులలో ఉన్న కేసుల జాబితాలను సిద్ధం చేయాలని ఆ కేసుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు ఆదేశించారు. ఇరిగేషన్, రెవెన్యూ, ప్రభుత్వ ప్లీడర్ల మధ్య సమన్వయ లోపం వల్ల కేసుల పరిష్కారంలో జాప్యం జరుపుతున్నట్లు కొందరు జిల్లా జిపిలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కోర్టు కేసుల చిక్కుముడుల పరిష్కారానికి ప్రత్యేకంగా ఇరిగేషన్ శాఖలో ఒక లీగల్ విభాగాన్ని నెలకొల్పామని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఇకపై లీగల్ టీంతో పాటు జిల్లాల ప్రభుత్వ న్యాయవాదులు, ఇరిగేషన్ అధికారులతో వెంటనే వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలని మంత్రి కోరారు. ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్‌కె జోషి, ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, ఇఎన్‌సి మురళీధర్‌రావు, ఈఎన్‌సి (అడ్మిన్) నాగేందర్‌రావు, కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్ ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రభుత్వ ప్లీడర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇరిగేషన్ లీగల్ టీంకు చెందిన మల్లేపల్లి నూతన్ వివిధ సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించిన కోర్టు కేసులు, వాటి పరిస్థితిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

పత్తికి పన్ను భీతి

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయిస్తున్నాయి. ఈ క్రమంలో ఈసారి మన దేశం నుంచి పత్తి ఎగుమతులు పెరుగతాయా, కనీసం గత ఏడాది క్వింటాలు పత్తికి వచ్చిన ధర ఈసారి వస్తుందా ? అంటే పరిస్థితులు అలా లేవని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ సంవత్సరం అంతర్జాతీయంగా పత్తి సాగు పెరగడం, పైగా మనదేశంలో కాటన్‌పై 5 శాతం జిఎస్‌టి ఉండనుంది. దీంతో కాటన్ సంబంధిత వాటి ధరలు పెరుగుతాయని, తద్వారా కాటన్ వినియోగం తగ్గనుందని చెబుతున్నారు. వీటన్నింటి పర్యవసానం ధరపై ప్రభావం చూపుందంటున్నారు. అంతర్జాతీయంగా ఈసారి 10 శాతం పత్తి ఉత్పత్తి పెరగనున్నట్లు అంచనా. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు 802 లక్షల ఎకరాల పత్తి పంటను సాగు చేశారు. గత 3 సంవత్సరాలతో చూస్తే ఈ ఏడాదే అత్యధికంగా సాగు చేయడం గమనార్హం. దీంతో దాదాపు 117.3 మిలియన్ టన్నుల పత్తి ఉత్పత్తి రానున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ అంచనా వేసింది. చైనా, పాకిస్తాన్, అమెరికా దేశాల్లో సాగు పెరిగింది. మనదేశంలో ఇప్పటి వరకు 2.89 కోట్ల ఎకరాలలో పత్తి పంటను సాగు చేశారు. గత ఏడాదితో చూస్తే 18.26 శాతం సాగు అధికంగా నమోదైంది. మన తెలంగాణలో ఇప్పటి వరకు 43.91 లక్షల ఎకరాలలో సాగైనట్లు వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. అమెరికా వ్యవసాయ శాఖ ప్రకారం బంగ్లాదేశ్ ప్రపంచంలోనే అత్యధికంగా పత్తి దిగుమతి చేసుకోనుంది. ఈదేశం ఈ ఏడాదిలో 15.2 లక్షల టన్నుల పత్తిని దిగుమతి చేసుకోనున్నట్లు అంచనా. దాని తరువాత దిగుమతిలో రెండో స్థానంలో వియత్నాం ఉండనుందని వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్త ఒకరు మన తెలంగాణకు తెలిపారు.

ఎగుమతులు కష్టమే : అంతర్జాతీయంగా పత్తి అధికంగా ఉత్పత్తి అవుతోంది మన దేశంలోనే. ఆ తరువాత చైనా, అమెరికాలోని ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీలు ఇస్తుండటంతో ఆ దేశాల్లోనూ ఉత్పత్తి అధికంగా ఉంది. పాకిస్తాన్, అమెరికా, భారత్‌లు పత్తిని అధికంగా ఎగుమతి చేస్తున్నాయి. అమెరికాతో చూస్తే మన పత్తికి కాస్త ధర తక్కువగా ఉండేది.దీంతో మన దేశం నుంచి చైనా అధికంగా పత్తి దిగుమతి చేసుకునేది. అయితే చైనాలో కాటన్ వినియోగం తగ్గడంతో పాటు పత్తి సాగు పెరిగి, అక్కడా పత్తి నిల్వలు పెరగడంతో గత మూడేళ్లగా దిగుమతులు నిలిపివేసింది. ఇది దేశంలోని పత్తి ధరలపై తీవ్ర ప్రభావం చూపింది. ఈసారి చైనా దిగుమతులు చేసుకునే స్థితిలో లేనట్లు అంతర్జాతీయ మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అమెరికాలో కూడా ఎక్కువగా నాన్ కాటన్ బట్టలవైపే మొగ్గుచూపుతుండడతో అక్కడా ఇతర దేశాలకే ఎగుమతి చేస్తున్నారు. ఈసారి అమెరికాలో 12 శాతం ఉత్పత్తి పెరగనున్నట్లు అంచనా. చైనా కాకుండా ఇతర దేశాలలో 96 లక్షల టన్నుల పాత నిల్వలు పేరుకుపోయాయి. ఈ క్రమంలో గత ఏడాది ధరలు మన రైతులు ఆశిస్తే భంగపాటు తప్పదని వ్యవసాయ నిపుణులు చెబతున్నారు.

జిఎస్‌టి ఎఫెక్ట్ కూడా : పత్తి వినియోగం మనదేశంలో అధికంగానే ఉంది. జిఎస్‌టి ముందుకు వరకు పత్తికి ఎటువంటి పన్ను లేదు. అయితే జిఎస్‌టిలో కాటన్‌ను 5 శాతం పన్ను స్లాబ్‌లో ఉంచారు. దీంతో రైతు దగ్గర పంట కొనుగోలు చేసేప్పుడు ఎటువంటి పన్ను లేకపోయినప్పటికీ, వ్యాపారులు, జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లుల వారు తమపై పన్ను పడుతుందన్న కారణంతో పత్తి ధరలను తగ్గించే అవకాశం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జిఎస్‌టి భారంతో కాటన్ వినియోగం కూడా తగ్గుతుందంటున్నారు. గత ఏడాది గరిష్టంగా క్వింటాలు పత్తికి రూ. 7 వేల వరకు ధర వచ్చింది.

ఇతర దేశాలలో ఇలా : ఇతర దేశాలలో పత్తి పంటకు ధరలు తగ్గినా రైతులు నష్టపోవడం లేదు. ఇందుకు అక్కడి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలే కారణం. పత్తికి మార్కెట్‌లో ధర లేకుంటే గోడౌన్లలో నిల్వ చేసుకునే సదుపాయాన్ని అమెరికా కల్పిస్తోంది. అలాగే అనేక సబ్సిడీలు కూడా అందిస్తున్నాయి. రైతుకు నష్టం కలిగే విధంగా ఉంటే వెంటనే సెనెట్స్‌లో చర్చలు జరిపి విధానపరమైన మార్పులకు నిర్ణయాలు తీసుకుంటారు. మన దేశంలో, రాష్ట్రంలో మాత్రం అక్కడికి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఇక్కడ ధరలను వ్యాపారులు ప్రభావితం చేస్తున్నారు. వాటిని ఆరికట్టేందుకు ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. అసలు ధర లేనపుడు పంట నిల్వచేసుకునేందు సరైన సదుపాయాలను కూడా కల్పించడం లేదు. అధికారులతో సమావేశాలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సిన సమయంలో కాలయాపన చేస్తూ, రైతు దగ్గర నుంచి పంట ఉత్పత్తి వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే నష్టాలు వాటిల్లిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇదే విషయాన్ని ఆంధ్రా యూనివర్సిటీ అగ్రో రిసెర్చ్ సెంటర్ తన నివేదికలో తేల్చి చెప్పింది. 2015లో పత్తిసాగుతోనే అత్యధిక రైతులు తెలంగాణలో బలవన్మరణానికి పాల్పడినట్లు తన అధ్యయనంలో తెలిపింది. మరీ ఇప్పటికైనా మన ప్రభుత్వాలు ముందు దృష్టితో చర్యలు తీసుకుంటేనే ఈసారి పత్తి రైతుకు ఉపయోగపడనున్నాయి. ఇందుకు అధిక సంఖ్యలో పత్తి చేతికి వచ్చే సరికే సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర ఇప్పించాల్సి ఉంటుంది. దళారీ వ్యవస్థను రూపుమాపి, వ్యాపారుల లాబీయింగ్‌ను అడ్డుకోవాలి.

పత్తిపై జిఎస్‌టి ప్రభావం : దొంతి నర్సింహారెడ్డి

గతంలో పత్తికి సంబంధించి ఎటువంటి పన్ను లేదు. ఇప్పుడు 5 శాతం జిఎస్‌టి ఉంది. దీంతో పత్తితో తయారయ్యే వాటి ధర పెరగనుంది. దీని ఫలితంగా వినయోగం తగ్గుతుంది. జిఎస్‌టి వంకతో వ్యాపారులు కూడా రైతుల దగ్గర ధర తగ్గించే తీసుకుంటారు. ఎగుమతులు అనుకూలించే అవకాశం లేనందున పత్తి ధరలు పడిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు ముందుగానే చర్యలు తీసుకుంటే సమస్యలు రావు.

వివిధ రాష్ట్రాలలో హెక్టర్లు లక్షల్లో, ఉత్పత్తి బేల్స్ లక్షల్లో
(ఒక బేల్‌కు 170 కిలోలు)

	2015-16		2016-17	
రాష్ట్రం	విస్తీర్ణం	ఉత్పత్తి	విస్తీర్ణం	ఉత్పత్తి
పంజాబ్	3.39	7.50	2.56	9.00
హర్యానా	6.06	15.00	4.98	20.00
రాజస్థాన్	4.48	15.00	4.42	18.00
గుజరాత్	27.19	94.00	24.00	95.00
మహారాష్ట్ర	38.27	75.00	38.06	89.00
మధ్యప్రదేశ్	5.47	18.00	5.99	21.00
తెలంగాణ	17.78	59.50	12.50	48.00
ఎపి	6.66	24.00	4.49	19.00
కర్నాటక	6.33	20.00	4.64	21.00
తమిళనాడు	1.42	5.00	1.50	6.00
ఒరిస్సా	1.25	3.00	1.36	3.00
మొత్తం	118.77	338.00	105.00	351.00



తెలంగాణ రాష్ట్రానికి సింగరేణి సంస్థ వెలుగుల దివ్వె

మన తెలంగాణ/రామగిరి: తెలంగాణ రాష్ట్రానికి సింగరేణి సంస్థ వెలుగుల దివ్వెలని డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం రామగుండం డివిజన్ –3 పరిధిలోని ఓపెన్ కాస్ట్2ను డిప్యూటీ స్పీకర్ పద్మా దేవే ందర్‌రెడ్డి సందర్శించి ఆర్జీ3 డివిజన్ అధికారులతో కలసి ఓసిపి2 వ్యూ పాయింట్ నుంచి ఉపరితల గనిని తిలకించి ఓసిపి2 గని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సింగరేణి సంస్థ తెలంగాణ రాష్ట్రానికి విద్యుత్ అందిస్తూ తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా నిలిచిందన్నారు.ఎంతో కష్టపడి ఎన్నో వ్యయప్రయాసలకు తట్టుకొని రాష్ట్ర సాధన కోసం నిరవధిక సమ్మె చేసి తెలంగాణ రాష్ట్ర సాధనకు బాటలు వేసింది సింగరేణి కార్మికులేనని ఆమె కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలో మరికొన్ని నూతన బొగ్గు బావుల తవ్వకాలను ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతుందన్నారు. కోల్‌సిటీలో నిరుద్యోగ సమస్యను నివారించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. దీంతో పాటు సింగరేణి యాజమాన్యం యువతకు ఉపాధి కల్పనకు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిబిజికెఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, టిఆర్‌ఎస్ నాయకులు గంటా వెంకటరమణారెడ్డి, ఆర్జీ3 జియం రాజేందర్‌రెడ్డి, ఎస్ఓటు జిఎం పంజాల శ్రీనివాస్‌గౌడ్,గని మేనేజర్ రాజశేఖర్, ఆఫీసర్ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని భారీ వర్షాలు



వరద ఉధృతి వద్ద రైతు



పస్రా సమీపంలో జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు



గూడెంలో పాతవంతెన వద్ద గోదావరి పరవళ్లు

▸▸ నిండుతున్న చెరువులు, కుంటలు ▸▸ రైతులకు ఊరట

మన తెలంగాణ/ ఖమ్మం, దండేపల్లి, గోవింద రావుపేట : గత రెండు రోజులుగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. భద్రాచలం వద్ద గల గోదావరితో పాటు చర్ల పరిధిలోని తాలిపేరు, వైరా రిజర్వాయర్, పాలేరు జలాశయం, పాల్వంచ కిన్నెరసాని, అశ్వారావుపేటలోని పెద్దవాగుతో పాటు ఖమ్మంలోని మున్నేరు, బయ్యారం పెద్దచెరువు ద్వారా ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాలకు నీరు చేరింది.

గూడెం గోదావరిలో పెరిగిన నీటి మట్టం

దండేపల్లి మండలం గూడెం గ్రామ సమీపంలోని గోదావరినదిలో శనివారం నీటి మట్టం పెరిగింది. వరదనీరు గోదావరి నదిలో చేరడం వలన నీటి ప్రవాహం పెరి గింది. పాత వంతెనకు ఆనుకొని నీటి ప్రవాహం ఉంది. ప్రస్తుతం గోదావరినది వరద ప్రవాహంతో నిండు కుండలా కనిపిస్తున్నది.

పొంగిన దయ్యాలవాగు, చల్వొరైవాగు

రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో వరద ఉధృతి పెరిగింది. గుండ్ల వాగు ప్రాజెక్టు మత్తడి పడుతోంది. వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గుండ్ల వాగు మత్తడి ఆరు అంగుళాలకు పైగా మత్తడి పోస్తోంది. దయ్యాలవాగు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తోంది. 163 జాతీయ రహదారి రాఘవపట్నం గ్రామ మధ్యను మద్దులొరై ప్రవా హం ఎక్కువ కావడంతో రాఘవపట్నం గ్రామానికి కూడా రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం నుంచి సల్లొరైవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో హన్మకొండ ఏటూరునాగారం జాతీయ రహదారి 163పై సల్లొరైవాగు రోడ్డుపై నుంచి పస్రా వద్ద ప్రవహిస్తుండడంతో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దాదాపుగా మూడు,నాలుగు గంటలపాటు వాహనాలు పూర్తిగా నిలిచిపోయాయి.

పెరుగుతున్న లక్నవరం నీటిమట్టం : భారీ వర్షాలకు లక్నవరం సరస్సులోకి వరద నీరు చేరుతోంది. మూడు రోజుల క్రితం 24 అడుగుల నీటి మట్టం ఉన్న లక్నవరం ప్రస్తుతం 28 అడుగులకు చేరింది.

కొట్టుకుపోయిన కాజ్‌వే

భారీ వర్షాలకు ఏజెన్సీలో వాగులు, వంకలు పొంగిప్రవహిస్తున్నాయి.శనివారం ఏటూరునాగారం మండలంలో కురిసిన భారీ వర్షానికి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని జీడివాగు ఉధృతంగా ప్రవహించడంతో గోగుపల్లి లింగాపురం మధ్యన ఉన్న కలవర్టు పూర్తిగా తెగిపోయింది. దీనితోగోగుపల్లి గ్రామానికి బయటి ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. వాహన రాకపోకలు పూర్తి గా నిలిచిపోయాయి.కంతనపల్లి వాగు పొంగడంతో 15 గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి.

అయోమయంలో ఆయకట్టు రైతాంగం

మన తెలంగాణ/ నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ ఆయకట్టు రైతాంగ పరిస్థితి మరింత అయోమయంగా మారింది. వర్షాకాలం ప్రారంభమై 3 నెలలైనా జలాశయం ఎగువ నుండి ఎటువంటి వరద నీరు వచ్చి చేరలేదు. దీనితో సాగర్ ఆయకట్టు రైతుల ఖరీఫ్ పంట సాగుకు నీరు అందటం కష్టంగా మారింది. కృష్ణాపరివాహక ప్రాంతము నుండి జలాశయాలకు వరద ప్రవాహం లేక పోవడం శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులు నీరులేక అడుగంటాయి. ప్రాజెక్టుల చరిత్రలో 6వ సారి ఖరీఫ్ సీజనకు నీరు అందించలేది దుస్థితి నెలకోంది. 2000, 2002, 2003 సంవత్సరాలలో సాగర్ ఆయకట్టు ప్రవాహక ప్రాంతాలలో కరువు చాయలు తాండవించాయి. అలాగే2015, 2016 2017లలో ఖరీఫ్ సీజనకు నీటికొరత ఎర్పడింది. ఖరీఫ్ పంటల సాగుకోసం ఆయకట్టు రైతాంగం జూన్, జులైలలోనే నారుమడ్లు వేసుకొని సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు.ఇప్పటివరకు ఎగువ నూండి వరద నీరు జలాశయాలకే రాకపో వడంతో సాగర్ జలాశయం వెలవెలపోతోంది. రైతులలో రొజురోజుకు ఆశలు సన్నగిస్తున్నాయి. ప్రస్తుతం సాగర్ నీటి మట్టం 500.30 అడుగులు ఉంది సాగర్ జలాశ యం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా కనీస నీటి మట్టం 510 అడుగులు.2002లో సాగర్ నీటిమట్టం 510.40 అడుగుల వద్ద ఉంది. అప్పుడు సాగర్ కాల్వలకు నీటిని విడుదల చేశారు. అయితే అప్పట్లో ఎగువ నుండి వరద నీరు జలాశయంకు రాకపోవడంతో కాల్వల నీటి విడుదలను మధ్యంతరంగా నిలిపి వేశారు. ఈ ఏడాది సాగర్ జలాశయంకు ఎగువ నుండి వరద నీరు రాకపోవడంతో నీటి నిల్వలు కనీస స్థాయికన్న తక్కువగా ఉన్నాయి. అందువల్ల ఈ తరుణంలో ఆయకట్టుకు నీరు విడుదల చేసే విషయంలో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేని స్థితి నెలకొంది.

కృష్ణాపరివాహక ప్రాంతమైన ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులలోనీరు వచ్చినా ఆప్రాజెక్టుల ఆయకట్టు అవసరాల కోసమే ఉపయోగించడంతో దిగువ జలాశయాలకు నీటిని విడుదల చేసే స్థితి లేదు.

ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

▸▸ మంత్రి కెటిఆర్



మన తెలంగాణ/ఇబ్రహీంపట్నం : తెలంగాణలో నూతన పరిశ్రమల స్థాపనకు టిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఐటి, పరిశ్రమలు,మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు.శనివారం రంగా రెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల, నాదర్గుల్ గ్రామాల శివారు ప్రాంతంలో అంతరిక్ష,రక్షణ రంగ విడిభాగాల తయారీ కేంద్రం (న్యూకాహాన్ ఏరోస్పేస్)ను రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్,రాష్ట్ర హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐటి మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో హైద్రాబాద్ పరిసర ప్రాంతంలో ఆదిభట్ల గ్రామం సమీపంలో నూతన పరిశ్రమలు స్థాపించటానికి పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారని అన్నారు.హైదరాబాద్ ప్రాంతంలో శంషాబాదు,ఆదిభట్ల ప్రాంతంలో ఇప్పటికే రెండు ఏరోస్పేస్ పరిశ్రమలు ఉండగా అదనంగా మరొక ఏరోస్పేస్ ఈ ప్రాంతంలో రానుందని అన్నారు. తెలంగాణలో నూతన పరిశ్రమలు ఏర్పాటు అయితే రాష్ట్రంలోని 2.3 లక్షల మంది నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు.ఆదిభట్ల, నాదర్గుల్ గ్రామాల సరిహద్దు ప్రాంతంలో న్యూకాన్ ఏరోస్పేస్ పరిశ్రమ స్థాపన కోసం ప్రభుత్వమే ఐదు ఎకరాల భూమిని కేటాయించిందని అన్నారు. హోం శాఖమంత్రి నాయిని నర్సింహా రెడ్డి పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా స్థాపించే పరిశ్రమలలో నాణ్యమైన పరికరాలను ఉత్పత్తి చేస్తే పరిశ్రమలకు దేశ స్థాయిలో మంచి గుర్తింపు ఉంటుందని అన్నారు. పరిశ్రమలలో చట్టాలను సక్రమంగా పాటించాలని అన్నారు. మాజీ కేంద్ర రక్షణ శాఖ మంత్రి పల్లం రాజు,డిజీ మిస్సైల్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్ అండ్ సైంటిఫిక్ అడ్వజర్ జి సతీష్ రెడ్డి,ఎల్‌పిఎస్‌సి డైరెక్టర్ ఎస్.సోమనాథ్, బిడిఎల్ కంపె నీ సిఎండీ వి.ఉదయ భాస్కర్, ఆర్‌సిఐ డైరెక్టర్ బిఎచ్‌విఎస్ నారాయణ మూర్తి, డిఆర్‌డిఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రమౌళి, న్యూ కాన్ ఏరోస్పేస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ జలాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశల పల్లకీలో నిరుద్యోగ యువత

మన తెలంగాణ/కొడంగల్ : నిరుద్యోగ యువత ప్రభుత్వంపై మరో పోరాటానికి సిద్ధమవుతున్న తరుణంలో ముఖ్యమంత్రి కెసిఆర్ పాత జిల్లాల ప్రతిపాధికన ఉద్యోగ ప్రకటనలు చేస్తున్నట్లు టిటిడిపి కార్యనిర్వహక అధ్యక్షులు, శాసన సభ్యులు రేవంత్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో అయన మాట్లాడారు. తెలంగాణ కోసం అహర్నిశలు పోరాడినట్లు చెప్పుకునే ముఖ్యమంత్రికి రాష్ట్రపతి ఉతర్వులు, జోనల్ పద్ధతి గురుంచి గర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. జోనల్ వ్యవస్థ గురించి ప్రభుత్వానికి ప్రతిపక్షాలు గొంతు చించుకుని చెప్పిన వినకుండా తిరిగి పాలనకు ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయని ప్రజలకు తప్పుడు సందేశాలు పంపినట్లు ఆరోపించారు. అంతకు మందు పట్టణ శివారులో చేపడుతున్న మిషన్ భగిరథ పనులను అయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, నర్సింగ్ బాన్‌సింగ్, రాజేందర్, రాజేష్‌రెడ్డి, యూసుఫ్, ప్రశాంత్, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో మరుగుదొడ్డి లేదని భర్తకు విడాకులు

జైపూర్: రాజస్థాన్‌లోని భిల్వారా జిల్లాలో మరుగుదొడ్డి లేక మానసిక క్షోభకు గురవుతున్న మహిళకు ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసింది. మరుగుదొడ్డి లేకపోవడంతో మానసిక క్షోభను అనుభవిస్తున్న తాను క్రూరత్వానికి గురవుతున్నానని, భర్త నుంచి విడాకులు ఇప్పించాలని ఫ్యామిలీ కోర్టులో ఆమె ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఫ్యామిలీ కోర్టు జడ్జి రాజేంద్ర కుమార్ శర్మ శుక్రవారం తీర్పునిస్తూ బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం సమాజానికి అవమానకరమని, మహిళలను మానసిక క్షోభకు గురిచేయ డమేనన్నారు. 2011లో వివాహం చేసుకున్న ఆమె 2015లో విడాకులకు దరఖాస్తు చేసుకున్నారని న్యాయవాది రాజేశ్ శర్మ తెలిపారు. మరుగుదొడ్డి నిర్మించకుండా మానసిక క్షోభకు గురిచేయడాన్ని క్రూరత్వంగా భావించిన జడ్జి ఆమెకు విడాకులు మంజూరు చేశారు.

'సాహో'లో జాకీష్రాఫ్

బాహుబలి తర్వాత ప్రభాస్ నటిస్తున్న 'సాహో' షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో తెరకెక్కిస్తున్నారు. దీంతో స్టార్ హోదా కలిగిన నటీనటులను ఈ సినిమాకు ఎంపిక చేస్తున్నారు చిత్ర యూనిట్ సభ్యులు. ఇప్పటికే ప్రభాస్ సరసన బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్‌ను హీరోయిన్‌గా తీసుకోగా... ప్రముఖ బాలీవుడ్ నటుడిని విలన్ పాత్రకు ఎంపిక చేశాడు దర్శకుడు సుజిత్. ఆయనే జాకీష్రాఫ్. ఈ పాపులర్ నటుడు గతంలో కొన్ని తెలుగు సినిమాల్లో కూడా నటించి ఆకట్టుకున్నాడు. అయితే ఇటీవల దర్శకుడు సుజిత్ 'సాహో' సినిమా కథను జాకీష్రాఫ్‌కు చెప్పగా అతనికి నచ్చి వెంటనే ఈ సినిమాకు ఓకే అన్నాడు. 'బాహుబలి'తో ఇంటర్నేషనల్ స్టార్ అయిన ప్రభాస్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నందుకు చాలా సంతోషంగా ఉందటూ ఈ సందర్భంగా జాకీష్రాఫ్ చెప్పాడు. అయితే ఈ సినిమాలో ఇప్పటికే ఇద్దరు పాపులర్ విలన్‌లు నటిస్తున్నారు. నీల్ నితిన్ ముఖేష్, చుంకే పాండేల్ ప్రతినాయకులుగా ఇందులో దర్శనమిస్తున్నారు. వారికి జాకీష్రాఫ్ కూడా తోడవడంతో సినిమాకు బాలీవుడ్‌లో కూడా భారీ స్థాయిలో క్రేజ్ రావడం ఖాయంగా కనిపిస్తోంది. దాదాపు 150 కోట్లతో యువి క్రియేషన్స్ 'సాహో' చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది.





నాని, సాయి పల్లవి

అద్భుతమైన కథ... సమపాళ్లలో కమర్షియల్ ఎలిమెంట్స్

నాని, దిల్‌రాజు కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ఎంసిఎ'. శ్రీమతి అనిత సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ 50 శాతం పూర్తయింది. ఈ సినిమాలో తొలిసారిగా నానీతో సాయి పల్లవి జోడీకట్టింది. శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ ''మా బ్యానర్‌లో నాని హీరోగా వచ్చిన 'నేను లోకల్' సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు మా హిట్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'ఎంసిఎ'. శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం మా బ్యానర్‌లో మరో హిట్ చిత్రంగా నిలుస్తుంది. అద్భుతమైన కథ, సమపాళ్లలో కమర్షియల్ ఎలిమెంట్స్‌తో వేణు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తున్నాడు. సాయి పల్లవి నానీకి జోడీగా నటిస్తుండగా... ఒకప్పటి హీరోయిన్ భూమిక ఇందులో కీలక పాత్రలో నటిస్తోంది. 50 శాతం సినిమా షూటింగ్ పూర్తయింది. మరోపక్క పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను కూడా మొదలుపెట్టాం. డబ్బింగ్ ప్రారంభమైంది. ఈ సినిమాను డిసెంబర్ 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నాం''అని అన్నారు. విజయ్, సీనియర్ నరేష్, ఆమని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః సమీర్ రెడ్డి, డైలాగ్స్ః మామిడాల తిరుపతి, శ్రీకాంత్ విస్సా, ఆర్ట్ః రామాంజనేయులు.

సెప్టెంబర్ 8న 'ఒక్కడు మిగిలాడు'

పద్మజ ఫిలింస్ ఇండియా ప్రై.లి. బ్యానర్‌పై ఎల్‌టిటిఇ మిలిటెంట్ చీఫ్ ప్రభాకరన్ పాత్రలో మంచు మనోజ్ నటించిన చిత్రం 'ఒక్కడు మిగిలాడు'. అజయ్ ఆండ్రూస్ నూతక్కి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని ఎస్.ఎన్.రెడ్డి, లక్ష్మీ కాంత్‌లు సంయుక్తంగా నిర్మించారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు దర్శకనిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్స్‌లో విడుదల చేశారు. మంచు లక్ష్మి ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. కార్యక్రమంలో దర్శకుడు అజయ్ ఆండ్రూస్ మాట్లాడుతూ ''ఇప్పటివరకు తెలుగులో ఎన్నడూ రానివిధంగా ఈ సినిమాను రూపొందించాము. ఒక దేశం, రాష్ట్రం, కుటుంబంలో పెద్ద వ్యక్తి ఫెయిల్ అయితే దాని ప్రభావం ఆ సమాజం లేదా కుటుంబంపై ఎలా ఉంటుందనేదే ఈ కథ. ఈ 21వ శతాబ్దంలో జరిగిన వివిధ మారణహోమాల కారణంగా చనిపోయిన వారి సంఖ్య ఇరవై శతాబ్దాలుగా చనిపోయిన వారి సంఖ్య కంటే చాలా ఎక్కువ. ఇవన్నీ చూస్తుంటే మనం ఎటు వెళ్తున్నామనిపిస్తుంది. శరణార్థుల సంఖ్య పెరిగిపోతోంది. ప్రపంచంలో ఇప్పటివరకు 16 లక్షల మంది శరణార్థులు ఉన్నారు. ఆస్ట్రేలియా జనాభా కంటే ఇది ఎక్కువ. ఈ శతాబ్దంలో మనిషి ఆకలి కోసం, మనుగడ కోసం పోరాడుతూనే ఉన్నాడు. ఓ నాయకుడు పోరాడుతున్నప్పుడు ఎలాంటి ఫలితాన్ని చూపుతుందనేదే ఈ సినిమా. సామాన్యులు అణగదొక్కబడిన ప్రతిసారి వారి నుండి ఓ నాయకుడు పుడతాడు. అతను ఏ మార్గం ఎంచుకుంటాడనేది పరిస్థితిని బట్టి ఉంటుంది. అలాంటి కథే 'ఒక్కడు మిగిలాడు'. ఈ సినిమా కోసం మనోజ్ చాలా కష్టపడ్డాడు. పాత్ర కోసం 20 కిలోలు పెరిగాడు... 10 కిలోలు తగ్గాడు. సినిమాను సెప్టెంబర్ 8న విడుదల చేస్తున్నాం''అని అన్నారు. మంచు లక్ష్మి మాట్లాడుతూ ''మంచు మనోజు ఒక నటుడిగా నాకెంతో ఇన్‌స్పిరేషన్ ఇస్తుంటాడు. తను కొత్తగా ఏదో ఒకటి చేస్తూనే ఉంటాడు. తను ఇండస్ట్రీకి ఓ వరం అని భావిస్తున్నాను. దర్శకుడు అజయ్ ఈ సినిమాను అద్భుతంగా రూపొందించాడు''అని తెలిపారు. మంచు మనోజ్ మాట్లాడుతూ ''సినిమాలో రెండు పాత్రలను నేను చేయగలను అని నమ్మి నాకు ఈ అవకాశమిచ్చిన దర్శకుడు అజయ్, నిర్మాతలకు థాంక్స్. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాను. తప్పకుండా సినిమా మంచి విజయాన్ని సాధిస్తుందన్న నమ్మకం నాకుంది''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ శివ నందిగామతో పాటు చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



మంచు లక్ష్మి, మంచు మనోజ్, అజయ్ ఆండ్రూస్, ఎస్.ఎన్.రెడ్డి, లక్ష్మీ కాంత్ తదితరులు

యూత్‌కు నచ్చే 'సరసుడు'

శింబు, నయనతార, ఆండ్రియా, ఆదాశర్మ హీరోహీరోయిన్లుగా పాండిరాజ్ దర్శకత్వంలో టి.రాజేందర్ నిర్మించిన చిత్రం 'సరసుడు'. శింబు సినీ ఆర్ట్స్, జేసన్ రాజ్ ఫిలింస్ బ్యానర్‌లపై ఈ చిత్రం తెరకెక్కింది. ఈ చిత్రం తమిళంలో రిలీజై 27 కోట్లకు పైగా కలెక్ట్ చేసి శింబు కెరీర్‌లోనే నెంబర్‌వన్ హిట్‌గా నిలిచింది. శింబు, నయనతార ప్రేమించుకొని బ్రేకప్ అయిన చాలా కాలం తర్వాత మళ్లీ వీళ్లిద్దరికి కథ నచ్చి చేసిన చిత్రమిది. వాళ్లిద్దరి మధ్య వచ్చే రొమాంటిక్ సీన్స్ అన్నీ చాలా రియలిస్టిక్‌గా ఉంటాయి. యూత్‌కు బాగా కనెక్ట్ అయ్యేవిధంగా ఈ చిత్రం ఉంటుంది. శింబు సోదరుడు టి.ఆర్.కురళరసన్ సంగీతమందించిన ఈ చిత్రం ఆడియో సూపర్ హిట్ అయింది. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసుకున్న ఈ చిత్రం తెలుగులో సెప్టెంబర్ 8న అత్యధిక థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ సందర్భంగా హీరో శింబు మాట్లాడుతూ ''నేను చేసిన మన్మథ, వల్లభ చిత్రాలకంటే 'సరసుడు' బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుందని ఎంతో నమ్మకంగా ఉన్నాను. యూత్‌కు, ఫ్యామిలీస్‌కు బాగా కనెక్ట్ అయ్యే సబ్జెక్ట్ ఇది. అద్భుతమైన లవ్ స్టోరీతో దర్శకుడు పాండిరాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. నయనతార, ఆండ్రియా, ఆదాశర్మల పర్‌ఫార్మెన్స్ ఎంతో బాగుంటుంది''అని అన్నారు. నిర్మాత టి.రాజేందర్ మాట్లాడుతూ ''తమిళ్, తెలుగులో ఈ చిత్రాన్ని నిర్మించాం. తమిళంలో రిలీజై ఈ చిత్రం 27 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. పెద్ద నోట్ల రద్దు వల్ల తెలుగులో సినిమా విడుదల ఆలస్యమైంది. ఇప్పుడు మంచి డేట్ చూసుకొని సెప్టెంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నాం. సాఫ్ట్‌వేర్ బ్యాక్‌డ్రాప్‌లో రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసేవిధంగా ఉంటుంది''అని తెలిపారు.



శింబు, నయనతార

దర్శకుల స్టయిల్‌కు అనుగుణంగానే ట్యూన్స్

రానా హీరోగా కాజల్, కేథరిన్ హీరోహీరోయిన్లుగా తేజ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. అనూప్ రూబెన్స్ సంగీతమందించిన ఈ చిత్రాన్ని డి.సురేష్‌బాబు, ఎం.వి.కిరణ్ రెడ్డి, సి.భరత్ చౌదరి కలిసి నిర్మించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. సినిమా విజయంలో మ్యూజికల్ హిట్‌గా నిలిచిన పాటలు కూడా ఎంతగానో తోడ్పడ్డాయి. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్‌తో ఇంటర్వ్యూ విశేషాలు...



అనూప్ రూబెన్స్

డిఫరెంట్ మ్యూజిక్...

పొలిటికల్ థ్రిల్లర్ సినిమా 'నేనే రాజు నేనే మంత్రి'. ఇటువంటి చిత్రానికి నేను తొలిసారి సంగీతాన్ని అందించాను. చిత్ర దర్శకుడు తేజతో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నాను. ఆయన అభిరుచి మేరకు ఈ చిత్రానికి డిఫరెంట్‌గా మ్యూజిక్‌ను అందించాను.

ఆ రెండు పాటలు అలా తీసుకున్నవే...

తేజతో చాలా రోజుల క్రితమే 'సావిత్రి' అనే సినిమా చేయాల్సి ఉంది. కానీ అది కుదరలేదు. ఆ సినిమా కోసం చేసిన ఆరు పాటల్లో రెండు పాటలను ఈ సినిమా కథకు సరిపోవడంతో ఇందులో వాడుకున్నాం. జోగేంద్ర..., దేవుడితో.. అనే పాటలను అలా తీసుకున్నవే. సినిమా విజయంలో పాటలు కూడా తోడ్పడం ఎంతో ఆనందంగా ఉంది.

రానా డౌన్ టు ఎర్త్ పర్సన్...

టాలెంటెడ్ డైరెక్టర్ తేజ. ఆయన నుంచి నేను చాలా విషయాలు నేర్చుకున్నాను. రానాతో తొలిసారిగా పనిచేశాను. ఆయన డౌన్ టు ఎర్త్ పర్సన్. హీరో అన్న ఫీలింగ్ ఆయనలో అస్సలు కనిపించదు. రానా నుంచి కూడా కొత్త విషయాలు తెలుసుకున్నాను.

ఛాలెంజింగ్‌గా అనిపించింది...

సినిమా కథలో భాగంగానే పాటలు ఉంటాయి. దానికి తగ్గట్టుగానే సంగీతాన్ని అందించాను. అదేవిధంగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు ఎక్కువ స్కోప్ ఉన్న చిత్రమిది. సినిమాలో మొత్తం ఏడు పాటలుంటాయి. కానీ సినిమా చూస్తున్నప్పుడు ఎక్కువ పాటలున్నట్లు అనిపించదు. ఇలాంటి పాటలు చేయడం ఛాలెంజింగ్‌గా అనిపించింది.

అఖిల్‌తో పాట పాడించాను...

పూరి జగన్నాథ్ దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా రూపొందుతున్న 'పైసా వసూల్' చిత్రానికి సంగీతాన్ని అందించాను. ఈ చిత్రంలో బాలయ్యతో ఓ పాట కూడా పాడించాను. ఆయన చాలా బాగా పాడారు. బాలకృష్ణతో పాట పాడించాలని పూరి, నేను కలిసి అనుకున్నాం. అఖిల్ సినిమాకు కూడా సంగీతాన్ని అందిస్తున్నా. ఇందులో అఖిల్‌తో కూడా ఓ పాట పాడించడం జరిగింది. ఈ సాంగ్‌ను త్వరలో విడుదల చేస్తాం.

కొత్తదనాన్ని కోరుకుంటున్నారు...

సీనియర్ దర్శకుడితోనైనా, కొత్త దర్శకుడితోనైనా కలిసి పనిచేయడం ఛాలెంజింగ్‌గానే ఉంటుంది. ప్రతి ఒక్కరిలో ఏదో కొత్తదనం ఉంటుంది. ఒక్కో డైరెక్టర్‌కు ఓ స్టయిల్ ఉంటుంది. వారి స్టయిల్‌కు అనుగుణంగా పాటలకు ట్యూన్స్ అందించాల్సి ఉంటుంది. ఇప్పుడు వస్తున్న యంగ్ డైరెక్టర్లు అందరూ కొత్తదనాన్ని కోరుకుంటున్నారు. దీంతో నవ్యమైన సంగీతాన్ని అందించడానికి అవకాశం కలుగుతోంది.

'హేయ్.. పిల్లగాడ' లోగో విడుదల



'హేయ్ పిల్లగాడ' లోగోను విడుదల చేస్తున్న శేఖర్ కమ్ముల. చిత్రంలో డి.వి.కృష్ణస్వామితో పాటు చిత్ర బృందం.

'ఓకే బంగారం' సినిమాతో దుల్కర్ సల్మాన్, ఇటీవల విడుదలై సెన్సేషనల్ హిట్ అయిన 'ఫిదా'తో భానుమతిగా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన సాయి పల్లవి తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ తెలుగులో మహానటి సావిత్రి బయోపిక్‌లో నటిస్తున్నారు. సాయి పల్లవి 'ఎంసిఎ' చిత్రంలో నటిస్తోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన సినిమా 'కలి'. ఈ సినిమాను తెలుగులో లక్ష్మి చెన్న కేశవ ఫిలింస్ పతాకంపై 'హేయ్... పిల్లగాడ' అనే పేరుతో డిస్ట్రిబ్యూటర్ డి.వి.కృష్ణస్వామి విడుదల చేస్తున్నారు. సమీర్ తాహిర్ దర్శకుడు. ఈ సినిమా లోగోను దర్శకుడు శేఖర్ కమ్ముల విడుదల చేశారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ ''దుల్కర్ సల్మాన్, సాయి పల్లవి జంటగా నటించిన 'కలి' మలయాళం, తమిళంలో పెద్ద విజయాన్ని సాధించింది. ఈ సినిమాను తెలుగులో 'హేయ్... పిల్లగాడ' పేరుతో విడుదల చేస్తున్నారు. తెలుగులో ఈ సినిమా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను''అని తెలిపారు. నిర్మాత డి.వి.కృష్ణస్వామి మాట్లాడుతూ ''ఇదొక టిపికల్ లవ్ స్టోరీ. సెప్టెంబర్ 8న సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. యూత్‌కు బాగా కనెక్ట్ అవుతుంది ఈ చిత్రం''అని చెప్పారు. ఈ చిత్రానికి మాటలు: భాషా శ్రీ, సాహిత్యం: సురేంద్ర కృష్ణ, సంగీతం: గోపీసుందర్, సినిమాటోగ్రఫీ: గిరీష్ గంగాధరన్.

మిస్టర్ అండ్ మిస్ ఇండియా విజేతలకు సినిమా అవకాశాలు

ప్రముఖ ఫిల్మ్ అకాడమి గ్లిట్టర్స్ ఆధ్వర్యంలో మిస్టర్ అండ్ మిస్ ఇండియా 2017 పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలలో బెంగుళూర్, చెన్నై, ముంబయ్, ఢిల్లీ, అహ్మదాబాద్, లక్నో, చండిగడ్, లుథియానా, కోల్‌కతా నగరాల నుంచి వచ్చిన యువతీ యువకులకు ఆడిషన్స్ నిర్వహించి ఫైనల్స్‌కు 80 మందిని ఎంపిక చేస్తారు. హైదరాబాద్‌లో ఈనెల 21 నుంచి 25 వరకు నిర్వహించే ఫైనల్ పోటీలలో విజేతలను ఎంపికచేస్తారు. ఈ వివరాలను గ్లిట్టర్స్ అకాడమీ ఛైర్మన్ దీపక్ బలదేవ్, హీరో నాగ అన్వేష్, హ్యాపీడేస్ ఫేమ్ సోనియా, అక్షయ్‌లు హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. విజేతలకు అందజేసే షీల్డ్‌లను నాగఅన్వేష్, సోనియా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సినీ, టివి రంగాలకు నూతన టాలెంట్‌ను అందించాలనే ఆశయంతో గ్లిట్టర్స్ అకాడమీ నిర్వహిస్తున్న ఈ మిస్టర్ అండ్ మిస్ ఇండియా ఈవెంట్ సక్సెస్ కావాలని కోరుకుంటున్నానని అన్నారు. దీపక్ బలదేవ్ మాట్లాడుతూ ''ఆడిషన్స్‌లో ట్రెడిషనల్‌వేర్, వెస్ట్రన్ వేర్ పోటీలు జరుగుతాయి. ఈనెల 24న హైదరాబాద్ రావినారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగే ఫైనల్స్‌లో విజేతలుగా నిలిచిన అమ్మాయిలకు మా గ్లిట్టర్స్ ఫిలిం అకాడమీలో శిక్షణనిచ్చి హీరోయిన్‌లుగా అవకాశాలు కల్పిస్తాము''అని తెలిపారు.



అక్షయ్, సోనియా, నాగఅన్వేష్, దీపక్ బలదేవ్

సరికొత్త లవ్ స్టోరీ

చంద్రకాంత్, రాధికా మహరోత్ర హీరోహీరోయిన్లుగా పరిచయమవుతున్న చిత్రం 'ప్రేమ ఎంత మధురం... ప్రియురాలు అంత కఠినం'. ఈ చిత్రం ద్వారా గోవర్ధన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో తనికెళ్ల భరణి, తులసి, జెమిని సురేష్‌లు ముఖ్యమైన పాత్రల్లో నటించారు. ఈ చిత్రం సెప్టెంబర్ రెండో వారంలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర కథానాయిక రాధికా మహరోత్ర మాట్లాడుతూ ''రాజస్తాన్‌లోని జైపూర్‌లో పుట్టి పెరిగిన నేను కాలేజీ రోజుల్లోనే నాటకాల్లో నటించేదాన్ని. ఆవిధంగా నాకు సినిమాలపై ఆసక్తి కలిగింది. ఇక తెలుగులో నేను హీరోయిన్‌గా పరిచయమవుతున్న చిత్రం 'ప్రేమ ఎంత మధురం... ప్రియురాలు అంత కఠినం' సరికొత్త లవ్‌స్టోరీతో రూపుదిద్దుకుంది. సినిమాలో నా క్యారెక్టర్ పేరు మైథిలి. కష్టపడి పనిచేసే అమ్మాయిగా కనిపించే నాకు ఎన్నో కలలు ఉంటాయి. ఈ నేపథ్యంలో సినిమా రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా అద్భుతంగా రూపుదిద్దుకుంది. తొలి చిత్రంతోనే హీరోయిన్‌గా నాకు మంచి పేరు వస్తుందన్న నమ్మకముంది''అని అన్నారు.



రాధికా మహరోత్ర



ఐటి సంస్థల ఉద్యోగుల సైకిల్ ర్యాలీ

మన తెలంగాణ / హైదరాబాద్ : 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌కు చెందిన ఐటి సంస్థల ఉద్యోగులు ఫ్రీడం సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్‌ను కలుపుకొని వెళ్తూ హెచ్ఎండిఎ సైక్లింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయనుండడాన్ని హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ సర్వీస్ కంపెనీ జెన్ క్యూ మేనేజింగ్ డైరెక్టర్ మురళీ బొల్లు స్వాగతించారు. 30 కిమీ సైకిల్ రైడ్‌లో పాల్గొన్న ఆయన సైక్లింగ్ కల్చర్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు సైక్లింగ్ ట్రాక్‌లు మరింత దోహదపడతాయన్నారు.

హైదరాబాద్‌లో పీయర్సన్ ఇండియా పిటిఇ కేంద్రం

మన తెలంగాణ / హైదరాబాద్ : అగ్రగామి అభ్యాసన కంపెనీ పీయర్సన్ తాజాగా హైదరాబాద్ సహా పూణే, అమృత్‌సర్, లూధియానాల్లో పియర్సన్ టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ అకాడమిక్ కేంద్రాలను ప్రారంభించినట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. కంప్యూటర్ ఆధారిత లాంగ్వేజ్ టెస్ట్ (పిఈటి అకాడమి) పరీక్షను దేశ వ్యాప్తంగా 28 కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు పీయర్సన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ వికాస్ పేర్కొన్నారు. 2009 నుంచి పిటిఇ నిర్వహిస్తున్నామని, అభ్యర్థులు తమకు సౌలభ్యంగా ఉండే నగరాల్లో పిటిఈ టెస్ట్‌కు హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు పియర్సన్ ఆన్ పిటిఇ డాట్ కామ్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఇన్ఫీ బైబ్యాక్ ప్లాన్

- రూ. 13 వేల కోట్ల వాటా తిరిగి కొనుగోలు
- సిక్కా రాజీనామాతో కంపెనీ అనూహ్య నిర్ణయం
- ఒక్కో వాటాకు రూ. 1,150 నగదు చెల్లింపు



న్యూఢిల్లీ : ఇన్ఫోసిస్ సిఇఒ, ఎండి పదవులకు విశాల్ సిక్కా రాజీనామా నేపథ్యంలో కంపెనీలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మందకొడి మార్కెట్ పరిస్థితుల్లో కంపెనీ వాటా ధర ఆవిరైపోకుండానూ, వాటాదారులకు విశ్వాసం సన్నగిల్లకుండానూ సుమారు రూ.13 వేల కోట్ల వాటాలను తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేసే ప్రణాళికను ఇన్ఫోసిస్ బోర్డు శనివారం ఆమోదించింది. కంపెనీ వ్యవస్థాపకుల అపనిందలు, వ్యక్తిగత దూషణలు తట్టుకోలేకే రాజీనామా చేస్తున్నట్లు సిక్కా శుక్రవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. బైబ్యాక్ ప్లాన్ వల్ల వాటాదార్లకు ఒక్కో షేరుకు రూ.1,150 నగదును కంపెనీ చెల్లించనుంది. శుక్రవారం నాటి మార్కెట్ ట్రేడింగ్‌లో కంపెనీ షేరు ముగింపు ధర రూ.923.10కి 25 శాతం ప్రీమియంను చేర్చి ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించనున్నట్లు బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇన్ఫోసిస్ ఒక ప్రకటనలో తెలిపింది. వాటాలను తిరిగి కొనుగోలు చేయడం ఇన్ఫోసిస్‌కిదే తొలిసారి. గతంలో మరో స్వదేశీ ఐటి దిగ్గజం, ఇన్ఫోసిస్ ప్రత్యర్థి కంపెనీ 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్)' ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.16 వేల కోట్ల బైబ్యాక్ పాలసీకి ఉపక్రమించింది. కాగా, కంపెనీ తొలి వ్యవస్థాపకేతర సిఇఒ అయిన సిక్కాకి బోర్డు మద్దతు ఉందని, వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి 'తప్పుడు' ప్రచారం వల్లే ఆయన తన పదవి నుండి తప్పుకోవాల్సి వచ్చిందని ఇన్ఫోసిస్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించింది. ప్రస్తుత తన బైబ్యాక్ ఆఫర్ పరిమాణం జూన్ 30, 2017 నాటికి చెల్లించిన తన మొత్తం ఈక్విటీ కేపిటల్‌తో పాటు తన స్వేచ్ఛా నిల్వల్లో 20.51 శాతమని ఇన్ఫోసిస్ కంపెనీ తెలిపింది. టిసిఎస్ ఆఫర్ పరిమాణం అది చెల్లించిన 3 శాతం ఈక్విటీ కేపిటల్‌కి సమానం కాగా, ఈ ఏడాది ఆఖర్లో వాటాల తిరిగి కొనుగోలు కార్యక్రమాన్ని చేపట్టనున్న విప్రో విషయంలో ఈ పరిమాణం 7.06 శాతంగా ఉండనుంది. కాగా, అమెరికా పౌరులు ఎడిఎస్ (అమెరికన్ డిపాజిటరీ షేర్) ద్వారా కొనుగోలు చేసిన వాటాలు, ఈక్విటీ షేర్లను తిరిగి కొనుగోలు చేయడానికి ఆ దేశ మార్కెట్ రెగ్యులేటర్ అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమీషన్ (యుఎస్ సెక్) నుండి కొన్ని మినహాయింపులు పొందాల్సి ఉంటుందని ఇన్ఫోసిస్ తెలిపింది. ఇందుకు కారణం... వాటాల బైబ్యాక్ ఆఫర్ అమలుపరంగా భారత్, అమెరికా దేశాల చట్టాల మధ్య నెలకొన్న విరుద్ధ నియంత్రణా ఆవశ్యకతలేనని కంపెనీ పేర్కొంది. అయితే అవసరమైన మినహాయింపులను అమెరికా మార్కెట్ రెగ్యులేటర్ నుండి పొందామని ఇన్ఫీ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.13 వేల కోట్లను డివిడెండ్లు/లేదా వాటాల తిరిగి కొనుగోళ్ల ద్వారా తమ వాటాదారులకు చెల్లించనున్నట్లు ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇన్ఫోసిస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోవైపు బైబ్యాక్ ప్లాన్ పర్యవేక్షణకు కంపెనీ సహ ఛైర్మన్ రవి వెంకటేశన్, ఎగ్జిక్యూటివ్ వైస్‌ఛైర్మన్ విశాల్ సిక్కా, తాత్కాలిక సిఇఒ, ఎండి యుబి ప్రవీణ్ రావు సహా ఏడుగురు సభ్యులతో ఒక కమిటీని ఇన్ఫోసిస్ ఏర్పాటు చేసింది.

బై బ్యాక్ అంటే..?

ఒక కంపెనీ తన సొంత షేర్లను తానే కొనాలని నిర్ణయించుకున్నప్పుడు అమలయ్యే ప్రక్రి య 'షేర్ బై బ్యాక్'. ఇందులో వాటా పెట్టుబడిదారుల నుంచి మాత్రమే వారి షేర్లను కొంటా రు. ఈ ప్రక్రియలో ఒక వాటా పెట్టుబడిపై ఆ ఇన్వెస్టర్‌కు వచ్చే ఆదాయం పెరుగుతుంది. మిగులు నగదు వాటా పెట్టుబడిదారులకు బదులే అవుతుంది. మార్కెట్‌లో అనుకూలమైన పరిస్థితులు లేనప్పుడు షేర్ ధరను కూడా ఆ ప్రక్రియ పెంచుతుంది. ఇన్ఫీ 'షేర్ బై బ్యాక్' ప్రకటన చేయడం ఇదే తొలిసారి. దీనివల్ల కంపెనీ వాటాదారులకు కొంత ఊరట లభిస్తుంది. వారు శుక్రవారం తమ వద్దగల షేర్లపై పదిశాతం దాకా విలువ పడిపోవడాన్ని చవిచూశారు. కొంత మంది కంపెనీ మాజీ ఎగ్జిక్యూటివ్‌లు ఈ ప్రక్రియ కోసం డి మాండ్ చేస్తున్నారు. బోర్డు తాజాచర్యతో వారు కొంత సమాధాన పడతారు. వ్యవస్థాపకులకు, ప్రస్తుత యాజమాన్యానికి మధ్య ఈ ప్రక్రియ వారధిగా ఉపయోగపడుతుందన్నది వారి వాద న. ఇంతకుముందు ఇన్ఫోసిస్ ప్రత్యర్థి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ గత ఏప్రిల్‌లో రూ. 16,000 కోట్ల షేర్లు తిరిగి కొనుగోలు చేసింది.

ఇన్ఫీలో నియామకాల పరిస్థితేంటి?

విశాల్ సిక్కా నాటకీయ రీతిలో రాజీనామా చేయడంతో నియామకాల రూపంలో ఇన్ఫోసిస్‌కిపుడు కొత్త సమస్య వచ్చి పడింది. సిక్కా స్థానంలో ఆయన వారసుడి కోసం కంపెనీ వేట మొదలుపెడుతోంది. 2014లో కొత్త సిఇఒ కోసం అప్పట్లో కంపెనీ సాగించిన వేట కంటే ఇపుడు మార్కెట్‌లో మరింత క్లిష్టమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. మునుపెన్నడూ లేని రీతిలో 150 బిలియన్ అమెరికన్ డాలర్ల భారత ఐటి సేవల రంగం ప్రస్తుతం తీవ్రమైన అస్థిర పరిస్థితులను ఎదుర్కొంటోంది. బ్రెగ్జిట్ వల్ల ఇయు దేశాలతో వ్యాపారం మందగించడం, వీసా నిబంధనల్లో మార్పుల వల్ల అమెరికాలో నెలకొన్న పిరిస్థితుల వల్ల ఇన్ఫోసిస్ కొత్త సిఇఒకి సవాళ్లు స్వాగతం పలుకుతాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. కాగా, 2014లో కం పెనీ వ్యవస్థాపకుల బృందానికి సంబంధం లేని బయట వ్యక్తిగా సిక్కాని తొలిసారిగా సిఇఒగా ఎంపిక చేశారు. సిఇఒగా కంపెనీ అభివృద్ధికి ఆయన పలు విధాలుగా కృషి చే శారు. క్లౌడ్, ఆటోమేషన్, కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇం టెలిజెన్స్ లాంటి కొత్త కొత్త ప్రాజెక్టులను చేపట్టేలా కంపెనీని తీర్చిదిద్దారు. ఆగస్టు1, 2014న సిక్కా సిఇఒగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి గురువారం (ఆగస్టు 17, 2017) మధ్యకాలంలో వాటా విలువ 22 శాతం మేర పెరిగింది. సిక్కాని ప్రస్తుతం కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గానూ, ప్రవీణ్ రావుని తాత్కాలిక సిఇఒగానూ ఇన్ఫీ నియమించింది.

ప్రభుత్వ బ్యాంకుల్లో మూలధనం కొరత తీర్చే ప్యాకేజి

కేంద్రంతో కలిసి త్వరలో రూపొందించనున్న ఆర్‌బిఐ

ముంబయి : మొండి బకాయిల భారం తగ్గించుకోవడానికి భారీ కేటాయింపులు చేయడం వల్ల బలహీనపడిన ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంకులకు పెట్టుబడి ధనం కొరత తీర్చడానికి భారత రిజర్వు బ్యాంక్(ఆర్‌బిఐ), ప్రభుత్వం త్వరలో ప్యాకేజీ ప్రకటించనున్నాయి. ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ శనివారంనాడు ఇక్కడ ఈ విషయం తెలిపారు. మొండి బకాయి(ఎన్‌పిఎ)లు అవధులు మించిపోవడంతో బ్యాంకులు భారీ ఎత్తున ఖర్చులు తగ్గించుకోవలసి వస్తుందని ఆయన వివరించారు. ఎన్‌పిఎ స్థూల నిష్పత్తి 9.6శాతానికి చేరుకుందని, వసూలు కాని బకాయిల నిష్పత్తి గత మార్చి ఆఖరుకు 12శాతం చేరిందని కూడా ఆయన చెప్పారు. పైగా ఈ ఎన్‌పిఎల్లో భారీ రుణాల వాటా 86.5శాతం ఉందని చెప్పారు. అందువల్ల భారీ మొత్తాల్లో డబ్బులు ఇరుక్కుపోవడంతో చాలా బ్యాంకులకు మూలధనం కొరత ఏర్పడిందని వివరించారు. అందువల్ల తక్కువ పడిన మూలధనాల మేరకు భారీ కేటాయింపులు చేయవలసి వచ్చిందన్నారు. అందువల్ల కేంద్రం, ఆర్‌బిఐ కలిసి అటువంటి బ్యాంకులకు ప్యాకేజీని రూపొందించబోతున్నట్లు ఆయన తెలిపారు. వాణిజ్యం, పరిశ్రమల సమాఖ్య(సిఐఐ) నిర్వహణలో రుణాలు తిరిగి చెల్లించకపోవడం, దివాళా తీయడం సమస్యపై శిఖరాగ్ర సభలో ఆయన ఈ ఈ విషయం వెల్లడించారు. మార్కెట్ల నుంచి పెట్టుబడి సొమ్ము సమీకరించడం, వివిధ సంస్థల్లో ప్రభుత్వ పెట్టుబడులను తగ్గించడం, ప్రభుత్వం ద్వారా అదనపు మూలధనం మొత్తాన్ని సమీకరించడం, లాభసాటిగా లేని ఆస్తులను అమ్మివేయడం, సంస్థల విలీనం చర్యల ద్వారా ఈ ప్యాకేజీ రూపొందించాలని సంకల్పించినట్లు ఉర్జిత్ తెలిపారు. ఎన్‌పిఎల అంశం పరిష్కారానికి ప్రభుత్వం, ఆర్‌బిఐ కలిసి పకడ్బందీగా వ్యూహాన్ని రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని బ్యాంకుల ఎన్‌పిఎలు మొత్తం రూ. 8లక్షల కోట్లవరకు ఉన్నాయని ఇది మొత్తం బ్యాంకుల ఎన్‌పిఎల్లో 75శాతమని ఆయన వివరించారు. ఇందువల్లనే తక్షణం బ్యాంకుల మూలధనం సమకూర్చే ప్యాకేజి అవసరపడిందన్నారు.

మొండిబకాయిల పనిపట్టడానికే : జైట్లీ


నష్టాలతో నడుస్తున్న సంస్థల వ్యాపారాన్ని ముగించకుం డా ఆదుకోనడం ఎన్‌పిఎల పట్ల అనుసరించే వైఖరికి మూలం కానున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వివరించారు. మూలధనం కొరత ఏర్పడిన సంస్థలకు ఆయన హామీ ఇస్తూ కొత్త దివాళా చట్టం రుణ గ్రహీతలు, రుణ దాతల మధ్య సంబంధాన్ని తలకిందులు చేసిందని చెప్పా రు. అసలు లక్ష్యం నష్టాలతో నడిచే సంస్థల ఆస్తులు మాయమవడం కాదని, వాటిని ఆదుకోవడానికి కొత్త వాణిజ్యవేత్తలను సహాయం తీసుకుంటామని, అటువంటి వాణిజ్యవేత్తలు ముందుకు రాకున్నా ప్రస్తుత ప్రమోటర్లు వాటి ని గట్టెక్కిస్తారన్నారు. ఇక్కడ బకాయిలు పేరుకోవడం, దివాళా తీయడం సమస్యపై జరిగిన శిఖరాగ్ర సభలో జైట్లీ ప్రసంగించారు. రుణాల తీర్చలేకపోవడం, దివాళా తీయడంపై కొత్త సంకేతం హేతువును ఆయన వివరించారు. రుణ వసూళ్ల ట్రిబ్యూనళ్లు సమర్థంగా పనిచేయటంలేదు కనుక ఇది అవసరపడిందన్నారు. ఆర్థిక పరమైన ఆస్తుల సెక్యూరిటీకరణ, పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ నియమాల అమలుచట్టం కొత్తలో రెండు, మూడేళ్లపాటు ఎన్‌పిఎల సంఖ్యను భారీగా తగ్గించడంలో విజయవంత మైనట్లు చెప్పారు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27590	29508.02	-0.72%
ముంబై	28550	30534.76	1.31%
ఢిల్లీ	28100	30053.48	0.72%
కోల్‌కతా	28430	30406.42	0.74%
కేరళ	27100	28983.96	0%
బెంగళూరు	27300	29197.86	- 0.36%
హైదరాబాద్	27590	29508.02	- 0.61%
గల్ఫ్	1367.44	1462.50	0.15%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	శనివారం	శుక్రవారం	మార్పు (%)
చెన్నై	42600.00	42300.00	0.71
ముంబై	42600.00	42300.00	0.71
ఢిల్లీ	42600.00	42300.00	0.71
కోల్‌కత్తా	42600.00	42300.00	0.71
హైదరాబాద్	42600.00	42300.00	0.71



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	362
వరంగల్	357	చిత్తూరు	390
విజయవాడ	359	చెన్నై	397
గోదావరి	359	బెంగళూరు	382



సులభతర వాణిజ్య విధానానికే మొగ్గ

- సిఎస్ ఎస్‌పి సింగ్ సమీక్ష

మన తెలంగాణ / హైదరాబాద్ : సులభతర వాణిజ్య విధానంలో గత ఏడాది రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిన నేపథ్యంలో ఇదే పంథాను ఈ ఏడాది కొనసాగించేలా ముందుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా సంస్కరణల అమలు కోసం 14 ప్రభుత్వశాఖలతో చీఫ్ సెక్రటరీ ఎస్‌పి సింగ్ శనివారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి అజయ్ మిశ్రా, రెవిన్యూశాఖ ముఖ్య కార్యదర్శి బిఆర్ మీనా, ఆర్ అండ్ బి ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ, ఐటి, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ తదితర అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో సులభతర వాణిజ్య విధానంపై సిఎస్ పలు దిశానిర్దేశాలు చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్ (డిఐపిపి) సూచించిన 372 సంస్కరణలకు గాను ఇప్పటికే 315 పూర్తి అయ్యాయని, మిగిలిన 57 పూర్తి కావాల్సి ఉందని అధికారులు ఈ సందర్భంగా సిఎస్‌కు తెలిపారు. రెవిన్యూ, న్యాయశాఖలకు తమ శాఖలకు సంబంధించిన సంస్కరణలను ఇప్పటికే పూర్తి చేశాయని, ఈ శాఖలను స్ఫూర్తిగా తీసుకుని ఇతర శాఖలు ముందుకెళ్లాలన్నారు. ఈ నెలాఖరు కల్లా ఈవోడిబికి సంబంధించిన సంస్కరణలను పూర్తి చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సింగరేణి సంస్థ టర్నోవర్ రూ.17,853 కోట్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : సింగరేణి సంస్థ 2016–17 ఆర్థిక సంవత్సరంలో రూ.17,853 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. ఇందులో రూ.395.38 కోట్ల నికర లాభాలను ఆర్జించింది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శనివారం జరిగిన 541వ బోర్డు సమావేశంలో వార్షిక లెక్కలకు ఆమోదం తెలిపారు. నికర టర్నోవర్ రూ.13,981 కోట్లుగా నమోదైందని సింగరేణి సిఎండి శ్రీధర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ పన్నుల కింద కంపెనీ రూ.6,056 కోట్లు చెల్లించిందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.3,168 కోట్లు చెల్లించామని అన్నారు. పన్ను చెల్లింపుల అనంతరం నికర లాభాలు రూ.395.38 కోట్లుగా కంపెనీ ప్రకటించింది. కార్పోరేట్ సామాజిక బాధ్యత కింద రూ.30 కోట్లు వెచ్చించడానికి బోర్డు ఆమోదం తెలిపింది. ఇదేవిధంగా బోర్డు సమావేశంలో పలు కొత్త గనుల కోసం సంబంధించిన ఆర్థిక అంచనాలకు ఆమోదం తెలిపారు. ఇందారం ఖని ఓపెన్‌కాస్ట్ గని (శ్రీరాంపూర్), కెటికెఓసి2 (భూపాలపల్లి), శాంతిఖని లాంగ్‌వాల్ (మందమర్రి)లకు సవరించిన బడ్జెట్‌కు బోర్డు ఆమోదం తెలిపింది. బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశానికి సింగరేణి సిఎండి ఎన్.శ్రీధర్ అధ్యక్షత వహించగా, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, కేంద్ర బొగ్గు శాఖ డైరెక్టర్ జెఎస్ బింద్రా, సింగరేణి డైరెక్టర్లు బి.భాస్కర్ రావు, ఎస్.చంద్రశేఖర్, ఎస్.శంకర్, కంపెనీ కార్యదర్శి జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



టూ వీలర్ కొనుగోళ్లలో ఢిల్లీ, పుణె, ముంబై టాప్ : సర్వే

మన తెలంగాణ / హైదరాబాద్ : ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేయడంలో దేశ రాజధాని ఢిల్లీ, ముంబై, పూణే నగరాలు ముందంజలో ఉన్నాయని డ్రూమ్ సంస్థ నిర్వహించిన సర్వేలో తేలింది. ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే ఈ మూడు నగరాల్లో ద్విచక్ర వాహనాల విక్రయాలు 44 శాతం నమోదు అయినట్లు తమ సర్వేలో వెల్లడైందని డ్రూమ్ సిఈవో సందీప్ అగర్వాల్ తెలిపారు. బజాజ్, హోండా, యమహా ఈ జాబితాలో ఉన్నాయన్నారు.

ఆధార్‌తో బిఎస్ఎన్ఎల్ ఇన్‌స్టంట్ సిమ్ యాక్టివేషన్

మన తెలంగాణ / హైదరాబాద్ : వినియోగదారులు ఏ రాష్ట్రం వారు అయినా సరే ఆధార్ కార్డు నంబర్ ద్వారా బిఎస్ఎన్ఎల్ సంస్థ ఇన్‌స్టంట్ సిమ్ యాక్టివేషన్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. ఈ కెవైసి విధానంలో నూతన సిమ్ కార్డులను యాక్టివేట్ చేయనున్నట్లు బిఎస్ఎన్ఎల్ ఏపి తెలంగాణ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్. అనంతరాము ప్ర కటనలో తెలిపారు. ఈ విధానం వినియోగదారులకు మరింత ఉపకరించనుందని జిజిఎం అభిప్రాయ పడ్డారు.


మౌలిక వసతులు కల్పిస్తేనే 'రియల్' పరుగులు

- సిఎంఆర్ ఇన్‌ఫ్రా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ చల్లూరి మురళీధర్ రెడ్డి

మన తెలంగాణ/ హైదరాబాద్: హైదరాబాద్ చుట్టూ మరిన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తే రియల్ ఎస్టేట్ రంగం మరింత అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుందని సిఎంఆర్ ఇన్‌ఫ్రా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ చల్లూరి మురళీధర్ రెడ్డి అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్‌కు మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఔటర్‌రింగ్ రోడ్ నలుమూలల తగిన మౌలిక సదుపాయాలు ఏర్పడితే మరిన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొస్తాయని, తద్వారా రియల్ ఎస్టేట్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. లాభార్జనే లక్ష్యంగా కాకుండా వినియోగదారుల అభిరుచులు, అందమైన డిజైన్లతో తమ వెంచర్లను నిర్మిస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన వెంచర్లకు మంచి ఆదరణ లభించిందని, తమ సంస్థ పట్ల వినియోగదారుల్లో విశ్వసనీయత పెరిగిందని అన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో పరిస్థితులపై చల్లారి మురళీధర్ రెడ్డి 'మన తెలంగాణ''తో తన అభిప్రాయాలను పంచుకున్నారు. తమ వెంచర్లలో రూ. 30 లక్షల నుంచి రూ. 40 లక్షల విలువ చేసే గృహ నిర్మాణాలకు అత్యంత డిమాండ్ ఉన్నదని, ఇలాంటి ప్రాజెక్ట్‌లపైనే వినియోగదారులు ఆసక్తిచూపుతున్నారని వివరించారు. అన్ని వర్గాలవారి అభిరుచుల మేరకు అందమైన గృహాలను నిర్మిస్తున్నామన్నారు.

పెద్దనోట్లు, జిఎస్‌టి కొంత ఇబ్బందే..

ఇటీవల పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలుతో రియల్ ఎస్టేట్ రంగంపై కొంత మేరకు ప్రభావం పడిందని చల్లూరి మురళీధర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రియల్ రంగం అభివృద్ధి చెందినప్పటికీ పెద్దనోట్ల ప్రభావంతో కొంత ఇబ్బంది ఎదురైందని, తాజాగా జిఎస్‌టితో కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని, అయినా భవిష్యత్తులో రియల్ ఎస్టేట్ మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోనివివిధ మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే భూమి ధరలు, ప్లాట్ల ధరలు తక్కువగా ఉన్నాయని, అందుకే చాలా సంస్థలు, వ్యాపారవేత్తలు హైదరాబాద్‌పైనే ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడ వ్యాపార వాణిజ్య సముదాయ



స్థలాలకు చాలా డిమాండ్ ఉన్నదని, సంస్థలన్ని ఒకే ప్రాంతానికి పరిమితం కావడంతో కొన్ని ప్రాంతాల్లోనే వ్యాపార సముదాయ స్థలాలకు కొరత ఉందన్నారు.

రేరా పరిశీలించిన తర్వాతనే..

రియల్ ఎస్టేట్ నియంత్రణ చట్టాన్ని (రేరా) అమలులోనికి వచ్చిన నేపథ్యంలో అందులోని అంశాలను పరిశీలించిన తర్వాతనే తమ నూతన ప్రాజెక్టులను నిర్మిస్తామని చల్లూరి మురళీధర్ రెడ్డి అన్నారు. రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, రేరాలో అనేక నిబంధనలు ఉన్నాయని, వాటిని పూర్తిగా పరి శీలించి, నిబంధనల మేరకే తమ వెంచర్ల నిర్మాణం ఉంటుందన్నారు. హెచ్ఎండిఎ నిర్మాణ అనుమతులు మరింత సులభతరంగా ఉండాల్సిన అవసరం ఉన్నదన్నారు. నిబంధ నల మేరకు ప్రాజెక్టులు నిర్మిస్తున్నప్పటికీ కొన్ని సందర్భాలలో దస్త్రాల విషయంలో కొంత జాప్యం జరుగుతుందని, దీనిని కూడా నివారించేందుకు మరింత సులభతర పద్ధతులను అవలంభించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

'రీచ్ మీడోస్'కు మంచి స్పందన

ఇటీవల హైదరాబాద్‌లోని బొంగులూరు, ఆదిభట్ల వద్ద ప్రారంభించిన తమ వెంచర్‌కు మంచి స్పందన లభిస్తున్నదని చల్లూరి మురళీధర్ రెడ్డి తెలిపారు. టాటా కన్సల్టెన్సీ, హార్డ్‌వేర్‌పార్కు, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌కు దగ్గరలోనే ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్ట్‌లో ప్రారంభ ధర సుమారు రూ.47 లక్షలు ఉందన్నారు. హెచ్ఎండిఎ అనుమతులతో కూడిన పూర్తి వాస్తుతోనే గృహాలను నిర్మిస్తున్నామని, ప్లాట్లకు కూడా మంచి డిమాండ్ ఉందన్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నుంచి మొదలు అన్ని సదుపాయాలను కల్పించినట్లు ఆయన వివరించారు.

యోగి సర్కారు నిర్వాకంతోనే బాలల మరణాలు : రాహుల్



గోరఖ్‌పూర్ : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పిల్లల మరణాలు రాష్ట్ర ప్రభుత్వ నిర్వాక ఘోరాలు అని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రభుత్వ అసమర్థత, బాధ్యతారాహిత్యానికి ఈ మరణాలు తార్కాణాలు అని , వీటిని కప్పిపుచ్చుకోవడానికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ఎన్ని గారడీలు చేసినా ఫలితం ఉండదని స్పష్టం చేశారు. బాలలు, పసికందులు ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక విలవిలలాడుతూ మృతి చెందడం విషాదం అని, ఇది ప్రభుత్వం చేతకానితనంతో తలెత్తిన విషాదం అని రాహుల్ మండిపడ్డారు. పిల్లలు మృతి చెందిన స్థానిక బిఆర్‌డి మెడికల్ కాలేజీ ఆసుపత్రిని శనివారం రాహుల్ సందర్శించారు. తాను ఇప్పుడే కాకుండా ఇంతకు ముందు కూడా ఆసుపత్రిని, సంబంధిత వైద్య కళాశాలను సందర్శించానని పలు నిర్వహణాలోపాలు ఉన్నట్లు, నిధుల కొరత ఉన్నట్లు గుర్తించానని, దీనిని ప్రధాని మోడీకి మీడియా ద్వారా తెలియచేశానని అయితే కేంద్రం కానీ రాష్ట్రం కానీ ఈ అత్యవసర అంశంపై స్పందించలేదని ఇప్పుడు ఈ దారుణం చోటుచేసుకుందని వెల్లడించారు. ఆసుపత్రిలో ఆక్సిజన్ లేని పరికరాలు ఉండటంతో రోగులకు గాలి సంచులు ఇచ్చారని, వారు వీటిని గంటల తరబడి గాలికోసం పీల్చుకోవల్సి వచ్చిందని ఇది అక్కడి పరిస్థితికి ఉదాహరణ అని తేల్చిచెప్పారు. రోగులకు చికిత్స అందించాల్సింది పోయి అంబూ బ్యాగ్‌లు ఇస్తే పరిస్థితి ఏమిటని నిలదీశారు.

బాణసంచా పేలి ఐదుగురు మృతి

భువనేశ్వర్ : భువనేశ్వర్‌కు సమీపంలోని ఖుర్దా వద్ద అక్రమంగా బాణసంచా తయారు చేస్తున్న ఇంట్లో జరిగిన పేలుడులో ఐదుగురు మృత్యువాత పడ్డారు. ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. చనిపోయిన వారిలో ముగ్గురు మహిళలు కాగా, ఇద్దరు మైనర్ బాలికలు ఉన్నారు. ఇందులో నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు. జాంకియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని సికో గ్రామంలో సనాతన్ సేథీ తన ఇంట్లో అక్రమంగా బాణసంచా తయారు చేస్తుండగా ఈ పేలుడు సంభవించిందని పోలీసులు తెలిపారు. మృతులను బాబి సేథీ (40), డాలీ సేథీ (19), డ్యూటీ సేథీ (62)లుగా గుర్తించారు.

అసెంబ్లీ ఎన్నికల నేత శివరాజ్ సింగే



భోపాల్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కేంద్ర మంత్రి వర్గంలో చేరతారనే ఊహాగానాలకు బిజెపి అధ్యక్షుడు అమిత్ షా ముగింపు పలికారు. శుక్రవారం పత్రికా ఎడిటర్లతో జరిగిన ఇష్టాగోష్ఠిలో ఆయన మాట్లాడుతూ 2018లో జరగనున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలో శివరాజ్ సింగ్ చౌహాన్ నాయకత్వంలో పోటీ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. తాను కేంద్ర మంత్రి వర్గంలో చేరుతున్నట్లు వచ్చిన ఊహాగానాలను చౌహాన్ గతంలోనే తిరస్కరించా రు. తాను రాష్ట్రంలోనే ఉంటానని నాలుగోసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు చౌహాన్ తెలిపారు. కాగా, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడుగా మూడేళ్లు పూర్తి చేసుకున్న నందకుమార్ చౌహాన్ పదవీ కాలం పొడిగిం పుపై అమిత్ షా ఎటువంటి వ్యాఖ్య చేయలేదు.

బిజెపి(యు)గా మార్చుకోండి : కాంగ్రెస్

పాట్నా: ఎన్‌డిఎ కూటమిలో చేరేందుకు బీహార్ సీఎం నితీశ్ కుమార్ సారథ్యంలోని జెడియు జాతీయ కార్యనిర్వాహక కమిటీ నిర్ణయం తీసుకోవడంపై కాంగ్రెస్ పార్టీ విరుచుకుపడింది. ఎన్‌డిఎలో చేరాల్సిన అనివార్య పరిస్థితిని జెడియుకు బిజెపి కల్పించిందని మండిపడింది. బిజెపి ఇక నుంచి ఆ పార్టీ పేరును బిజెపి(యునైటెడ్)గా మార్చుకుంటే మంచిదని కాంగ్రెస్ సీనియర్ నేత టామ్ వడక్కన్ అన్నారు. నిజమైన జెడియు శరద్‌యాదవ్ చేతుల్లోనే ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

బక్రీద్‌కు ఒంటెల బలిపై నిషేధం

లక్నో: ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో బక్రీద్ సందర్భంగా ఒంటేలను బలివ్వడంపై అధికాధికారులు నిషేధం విధించారు. ఒంటేను ప్రభుత్వం నిషిద్ధ జంతువుగా ప్రకటించడంతో ఒంటేల కొనుగోలు, విక్రయాలు జరుగకుండా పోలీసులు, ఇంటెలిజెన్స్ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కౌశల్ రాజ్ శర్మ ఆదేశించారు. రాజస్థాన్ నుంచి తెప్పించిన ఒంటేలలో నగర పరిధిలో ఒక్క ఒంటేను కూడా విక్రయించడానికి వీలు లేదని ఆయన ఆదేశించారు. బక్రీద్ సందర్భంగా ఒంటేలను బలివ్వడం లక్నో చరిత్రలోనే ఎప్పుడూ జరుగలేదని కలెక్టర్ తెలిపారు. జిల్లా రికార్డుల్లో కూడా అలాంటి సమాచారం లేదని ఆయన పేర్కొన్నారు. వ్యాపారులు బక్రీద్‌కు కొన్ని వారాల ముందు రాజస్థాన్ నుంచి ఒంటేలను తూర్పు ఉత్తరప్రదేశ్‌లో విక్రయించడానికి వెళ్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. లక్నో నుంచి వెళ్లే ఈ ఒంటేలను విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లక్నోలో బక్రీద్‌కు ఒంటేల బలిపై నిషేధం

ఔరంగాబాద్‌లో వందేమాతరం రగడ

ఔరంగాబాద్: ఔరంగాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశం (ఎఎంసి)లో శనివారం స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. శివసేన, బిజెపి ఉమ్మడిగా ఏర్పాటు చేసిన ఎఎంసి సమావేశంలో 'వందేమాతరం' జాతీయ గేయాన్ని ఆలపిస్తున్న సమయంలో ఇద్దరు ఎఐఎంఐఎం కార్పొరేటర్లు లేచి నిలబడేందుకు నిరాకరించారు. దీంతో శివసేన, బిజెపి సభ్యులు ఎఐఎంఐఎం కార్పొరేటర్ల వైఖరిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వారిద్దరిపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో ఎఐఎంఐఎం కార్పొరేటర్లకు అధికార కూటమికి మధ్య మాటల యుద్ధం స్వల్ప ఘర్షణకు దారితీసింది. అయితే ఈ ఘర్షణలో ఎవరికి కూడా గాయాలయినట్టు సమాచారం లేదు. కానీ, సమావేశంలో మైక్రో ఫోన్లు మాత్రం ధ్వంసమైనట్టు తెలిసింది. ఎఎంసి సభ్యుల డిమాండ్ మేరకు ఆ ఇద్దరి కార్పొరేటర్లను మేయర్ బాపు ఘాడమోడ్ ఒక రోజు వరకు సస్పెండ్ చేయగా, గంటపాటు సభను వాయిదా వేశారు. ఎఎంసిలో అతిపెద్ద ప్రతిపక్షమైన ఎఐఎంఐఎం పార్టీ నుంచి 25 మంది సభ్యులు ఉన్నారు.

ముగ్గురు డ్రగ్ స్మగ్లర్లు అరెస్టు

ముంబయి: నగరంలోని స్కూళ్లు, కాలేజీ విద్యార్థులకు మాదక ద్రవ్యాలను అమ్మేందుకు వచ్చిన ముగ్గురు డ్రగ్స్ స్మగ్లర్లను ముంబయి పోలీసులు అరెస్టు చేశారు. సెంట్రల్ ముంబయిలోని మజాగాన్ నుంచి యాంటీ నార్కోటిక్స్ సెల్ (ఎఎన్‌సి) స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న సమయంలో ఈ ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. ఓ స్కూల్ టీచర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఎఎన్‌సి ఆకస్మిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో వారి నుంచి 171 గ్రాముల ఎండి మాదక ద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అయితే దీని విలువ రూ. 3.42 లక్షల వరకు ఉంటుందని అన్నారు. అరెస్టైన ముగ్గురు స్మగ్లర్లు రే రోడ్‌కు చెందిన జకీర్ మన్సూర్ షేక్ (33), నర్జాబి అలిహాద్ షేక్ (40), పకి బబ్లూ షేక్ (26) నివాసులుగా గుర్తించినట్టు ఎఎన్‌సి డిసిపి శివదీప్ లాండే వెల్లడించారు.

అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై గవర్నర్



చెన్నై : అర్ధరాత్రి వేళ పుదుచ్చేరిలో మహిళలకు భద్రత ఎలా ఉందో తెలుసుకునేందుకు సాక్షాత్తూ గవర్నర్ కిరణ్ బేడీ ఓ అజ్ఞాత వ్యక్తిలా వెళ్లి పరిశీలించారు. శుక్రవారంనాడు రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్లి ప్రధాన రహదారుల్లో పర్యవేక్షించారు. ఎవరూ ఆమెను గుర్తుపట్టకుండా ఉండేందుకు ముఖానికి చున్నీ కప్పుకున్నారు. ఎటువంటి భద్రత లేకుం డా అర్ధరాత్రి వేళ ఆమె ఎంతో ధైర్యంగా ద్విచక్రవాహనంపై పర్యటించా రు. దీని గురించి ఆమె స్వయంగా ట్విటర్ ద్వారా తెలియజేశారు. 'పుదుచ్చేరిలో రాత్రివేళ బయట ఉండటం సురక్షితమే. కానీ భద్రతను మరింత మెరుగుపరచాల్సి ఉంది'. ప్రజలు తమకు ఏదైనా అవసరమైతే 100కు ఫోన్ చేసి సహాయం తీసుకోవాలి' అన్నారు.

బిజెపి ఎంఎల్‌ఎలపై వారెంట్లు

ముజఫర్‌నగర్ : రైలు సర్వీసులకు అంతరాయం కలిగించారన్న కేసు లో కోర్టుకు హాజరు కానందుకు ఇద్దరు బిజెపి ఎంఎల్‌ఎలపై స్థానిక కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... ముజఫర్‌నగర్ నియోజకవర్గ ఎంఎల్‌ఎ కపిల్ అగర్వాల్, బుధానా ఎంఎల్‌ఎ ఉమేష్ మాలిక్‌లకు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ గోపాల్ తివారీ నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేశారు.



దమ్ముంటే పార్టీని చీల్చు

నిజమైన జెడి(యు) మావైపే, శరద్ యాదవ్‌కు నితీశ్ సవాల్, ఎన్‌డిఎలో చేరుతూ తీర్మానం

పాట్నా : పార్టీ నేత శరద్ యాదవ్ ఏ సొంత నిర్ణయం అయినా స్వేచ్ఛగా తీసుకోవచ్చునని, అది ఆయన ఇష్టం అని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ వ్యాఖ్యానించారు. అతి కొద్ది మంది పార్టీకి దూరమైతే ఏ ప్రభావం పడదని స్పష్టం చేశారు. ఆయనకు ధైర్యముంటే పార్టీని చీల్చవచ్చునని సవాల్ విసిరారు. నిజమైన జెడియూ తమ వైపు ఉందని స్పష్టంచేశారు. 'శక్తి ఉంటే జెడియు లెజిస్లేచర్ పార్టీని రెండుగా చీల్చవచ్చు, పార్టీలోమూడింట రెండొంతుల మెజార్టీని నిరూపించుకుంటారా? లేకపోతే పార్టీ సభ్యత్వం పోకతప్పదు' అని పార్టీలోని తన ప్రత్యర్థులను నితీశ్ ఘాటుగా హెచ్చరించారు. మహాకూటమి నుంచి విడిపోవడాన్ని యాదవ్ వ్యతిరేకించడంపై ఆయన మండిపడ్డారు. 2013లో పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన ఎన్‌డిఎ నుంచి వైదొలిగిన అంశంపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. శరద్ పోటీ సభలతో పార్టీపై ఎలాంటి ప్రభావం పడబోదని నితీశ్ తెలిపారు. ఏదైనా కలిసికట్టుగా ఉండాలని, రాజకీయాలలో కుటుంబ ప్రయోజనాలు కుదరవని స్పష్టం చేశారు. తాను శరద్‌ను గౌరవిస్తానని, రాజకీయంగా ఆయన అంటే తనకు అభిమానం అని, 2004లో మాధేపురా నుంచి పోటీ చేసి ఓడిపోయినప్పుడు తాను స్వయంగా కలుసుకుని యాదవ్‌ను ఎగువ సభకు పంపించేలా ఒప్పించానని తెలిపారు. ఈ సందర్భంగా నితీశ్ లాలూపైనా, ఆర్జేడీపైనా తీవ్ర విమర్శలు సంధించారు. వ్యక్తిగత ఆరోపణలకు దిగే వారిని తాను పట్టించుకోదల్చుకోలేదని తెలిపారు. పార్టీలో తమకే బలం ఉందని ఇప్పటి జాతీయ కార్యవర్గ సమావేశంలో స్పష్టం అయిందని చెప్పారు. ఈ నెల 27న పాట్నాలో జరిగే లాలూ ర్యాలీకి శరద్ హాజరయితే చర్య తప్పదని పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి త్యాగి తెలిపారు. శరద్ యాదవ్ సీనియర్ నేత, చాలా కాలంగా పార్టీతో అనుబంధం పెంచుకుని ఉన్నందున ఇప్పటివరకూ చర్యలూ తీసుకోలేదని చెప్పారు. అయితే లక్ష్మ ణరేఖ దాటితే వేటు తప్పదని స్పష్టం చేశారు. అన్నింటినిలోనూ నితీశ్‌ను వ్యతిరేకిస్తూ శరద్ పార్టీ క్రమశిక్షణకు గండికొడుతున్నారని తెలిపారు. ఇప్పటివరకూ వేచి ఉన్నామని, అయితే లాలూ ర్యాలీకి హాజరయితే చర్యలు ఉంటాయని తెలిపారు.



జనం తీర్పును కాదనే దమ్ముందా?

నితీశ్‌కు శరద్ యాదవ్ సవాల్, జెడియు తన సొంత ఇల్లని వెల్లడి నితీశ్‌కు పోటీగా జన్ అదాలత్ పేరిట సమావేశం

పాట్నా : జెడియూ సీనియర్ నేత శరద్ యాదవ్ శనివారం 'జన్ అదాలత్' ఏర్పాటు చేసి నితీశ్‌కుమార్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు కురిపించారు. బీహారీలు మహాకూటమికి పట్టం కట్టారని, ఈ తీర్పును కాదని దీనిని కాదనే అధికారం ఎవరికీ లేదని తేల్చిచెప్పారు. బీహారీలు రాష్ట్రంలో మహాకూటమిని నిలబెట్టుకుని తీరుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఓ వైపు జెడియూ జాతీయ కార్యవర్గం ఏర్పాటు చేసి నితీశ్ కుమార్ ఆధ్వర్యంలోనే పాట్నాలోనే జాతీయ కార్యవర్గంలో జెడియూను ఎన్‌డియేలో చేరే అంశంపై తీర్మానం వెలువరించింది. ఇదే సమయంలో యాదవ్ సభ పోటీగా జరిగింది. బిజెపి రథాన్ని బీహార్ పొలిమేరల్లోకి రాకుండా బీహారీలు తమ ఓటు ద్వారా నిర్ణయించారని, దీనికి విరుద్ధంగా ఇప్పుడు దొడ్డిదారిన నితీశ్ బిజెపిని పీఠంపైకి తేవడం అన్యాయం అని యాదవ్ విమర్శించారు. ఈ పార్టీని తాను చౌదరి చరణ్‌సింగ్ వంటి దిగ్గజాలతో కలిసి ఏర్పాటు చేసి, పెంచి పోషించామని , ఎందరో మధ్యలో వెళ్లిపొయ్యారని , అలాంటిది ఇప్పుడు కొందరు వచ్చి తనను తన ఇంటి నుంచి వెళ్లగొట్టాలని చూస్తున్నారని, ఏది తప్పో, ఏది ఒప్పో ప్రజలే నిర్ణయిస్తారని యాదవ్ తేల్చిచెప్పారు. నితీశ్ వెంట ఉన్నది ఎవరనేది తనకు అప్రస్తుతమని , తనకు ప్రజలు ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు నితీశ్, శరద్ యాదవ్ వర్గాలు శనివారం బలప్రదర్శనకు దిగాయి. ఒకదశలో ఇరువురి మద్దతుదార్లు ఘర్షణలకు దిగారు. ముఖ్యమంత్రి నితీశ్ నివాసం ఎదుటనే ఈ ఘటన జరిగింది. దీనితో ఉద్రిక్తత నెలకొంది. ఇక్కడ జరిగిన ఘర్షణ గురించి స్థానిక పోలీసులు విలేకరులకు తెలిపారు. హెల్మెట్లు లేకుండా శరద్ యాదవ్ మద్దతుదార్లు బైక్‌లపై తిరుగుతూ ఉండగా వారిని సిఎం నివాసం వెలుపల నిలిపివేశామని, వారి వద్ద కర్రలు, బెల్టులు ఉన్నాయని, అన్నేమార్గ్‌లోని నితీశ్ నివాసంలోకి వారు దూసుకుపోవడానికి యత్నించారని, ఈ లోగా నితీశ్ మద్దతుదార్లు అక్కడికి చేరారని పోలీసులు తెలిపారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. అత్యధిక సంఖ్యలో ఉన్న నితీశ్ మద్దతుదార్లు శరద్ అనుచరులను తరిమికొట్టారు. యాదవ్ ఆధ్వర్యంలో జన్ అదాలత్ జరిగే ఎస్‌కె మెమోరియల్ హాల్‌కు వాహనాలు వెళ్తుతుండగా ఘటన జరిగింది.

2022లోగా కశ్మీర్, నక్సల్ సమస్యలు పరిష్కారం

లక్నో : కశ్మీర్ సమస్య, ఉగ్రవాదం, తీవ్రవాదం, ఈశాన్య తిరుగుబాటు సమస్యలకు 2022లోపు పరిష్కారం లభిస్తుందని హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. లక్నోలో 'సంకల్ప్ సే సిద్ధి –న్యూ ఇండియా మూవ్‌మెంట్ (2017–22) నయా భారత్ కా నిర్మాణ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశం ఇప్పుడు కశ్మీర్, ఉగ్రవాదం, తీవ్రవాదం, ఈశాన్య తిరుగుబాటు తదితర సమస్యలను ఎదుర్కొంటోందని అయితే, ప్రధాన నరేంద్ర మోడీ ప్రభుత్వం 2022 నాటికి నూతన భారతదేశ నిర్మాణం కోసం కృషి జరుపుతున్నందున ఆ లోగా వీటిని పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎన్నో సమస్యలున్నాయని, వీటి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని, అయితే వీటిని పరిష్కారం మాత్రం ఖచ్చితంగా దొరుకుతుందని హామీ ఇవ్వగలనని ఆయన అన్నారు.

గుజరాతీ బాలుడి నిజాయితీ

సూరత్ : లక్షలాది రూపాయల విలువైన వజ్రాల మూట దొరికిన 15 ఏళ్ల బాలుడు వాటిని భద్రంగా వాటిని వాటి సొంతదారుడికి తిరిగి ఇచ్చేశాడు. గుజరాత్‌లోని సూరత్‌లో ఈ ఘటన జరిగింది. వజ్రాల వ్యాపారానికి పేరొందిన సూరత్‌లో సేఠ్ మనుసుఖ్ భాయ్ తన జేబులోని వజ్రాల మూటను పోగొట్టుకున్నాడు. బజారులో పడి ఉన్న ఈ మూట వీధులలో క్రికెట్ ఆడుకుంటున్న బాలుడు విశాల్ ఉపాధ్యాయ్‌కు దొరికింది. ఈ బాలుడు ఈ మూటను తీసుకువెళ్లి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నతండ్రి ఫల్‌చంద్‌కు చూపించాడు. ఈ వజ్రాల మూటను తండ్రి వజ్రాల వ్యాపారుల సంఘం కార్యాలయానికి వెళ్లి అప్పగించారు. ఈ వజ్రాల విలువ దాదాపుగా 45 లల రూపాయల వరకూ ఉంటుంది. ఈ తండ్రి కొడుకుల నిజాయితీని సూరత్ అంతా కీర్తించింది.

పిహెచ్‌డిలకు 70 వేల భృతి

న్యూఢిల్లీ : ఐఐటి పరిశోధక విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నెలవారీగా రూ.70 వేల విద్యాభృతి (ఫెలోషిప్)ని అందించనుంది. ఐఐటి లేదా పిహెచ్‌డిలో ప్రవేశాలు పొందే వారికి ఈ ఫెలోషిప్ ఉంటుందని కేంద్ర ఉన్నత విద్య కార్యదర్శి కేవల్ కుమార్ శర్మ తెలిపారు. ఇప్పటివరకూ నెలవారీగా పరిశోధన విద్యార్థుల కు పాతికవేల రూపాయలు చెల్లిస్తున్నారు. ప్రధాని స్కీంలో భాగంగా ఈ భృతిని పెంచుతున్నామన్నారు.

నేడో రేపో విలీనం



- అన్నాడిఎంకె వైరి వర్గాల ఆశాభావం
- సిఎంని దించేస్తామంటూ దినకరన్ వర్గం వార్నింగ్

చెన్నై/తిరువారూర్ : విలీనంపై తమిళనాడులోని అధికార అన్నాడిఎంకె వైరి వర్గాల సారథులు శనివారం ఆశాభావం వ్యక్తం చేశాయి. పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ సిఎం ఎంజిఆర్ శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు తిరువారూర్ చేరుకున్న పళనిస్వామి అన్నాడిఎంకె వైరి వర్గాలు త్వరలోనే కలి సిపోతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు విలీన చర్చలు సజావుగానే సాగుతున్నాయని, ఒకటి రెండు రోజుల్లో సానుకూల ఫలితం వచ్చే అవకాశముందని పన్నీర్‌సెల్వం కూడా ఆకాంక్షించారు. తమ వర్గంలోని ముఖ్య నాయకులతో ఆయన అనధికారిక చర్చలు జరిపిన అనంతరం ఈ మేరకు ఆశాభావం వ్యక్తం చేశారు. పన్నీర్‌సెల్వం వర్గంలోని సభ్యుల మధ్య అభి ప్రాయభేదాల కారణంగా విలీనంపై శుక్రవారం రాత్రి ఎలాంటి నిర్ణయ మూ వెలువడలేదు. జయలలిత మరణంపై సిబిఐతో దర్యాప్తు చేయించాల ని పన్నీర్ వర్గంలోని కొంతమంది నాయకులు డిమాండ్ చేశారు. అయితే ఆమె మరణంపై నిజానిజాల నిగ్గుతేల్చడానికి విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి సారథ్యంలో ఒక దర్యాప్తు సంఘాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమం త్రి పళనిస్వామి ఇప్పటికే ప్రకటించినప్పటికీ, వారు మాత్రం సిబిఐ దర్యాప్తుకే మొగ్గుచూపుతుండటం గమనార్హం. పళనిస్వామి, పన్నీర్‌సెల్వం వర్గాల మధ్య ఇటు పార్టీలోనే కాక అటు రాష్ట్ర మంత్రివర్గంలోనూ కీలక పదవుల కోసం పోటీ నెలకొందనే వార్తలు కూడా వస్తున్నాయి. ఇదిలా ఉంటే, అన్నా డిఎంకె ఉప ప్రధాన కార్యదర్శి టిటివి దినకరన్‌తో సమావేశం ముగిసిన అనంతరం ఆయన విధేయుడు, మాజీ మంత్రి పళనియప్పన్ మాట్లాడుతూ...'గతంలో పన్నీర్ ప్రభుత్వాన్ని, పార్టీని సక్రమంగా నడిపించ లేదు. అందువల్ల ఆయన్ని తప్పించాం. ఇప్పుడు పళని పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే ఆయన్ని కూడా దించేస్తాం' అని హెచ్చరించారు.

గోరఖ్‌పూర్ 'విహార కేంద్రం' కాదు

గోరఖ్‌పూర్ (యుపి) : కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీపై ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ శనివారం ధ్వజమెత్తారు. 'ఢిల్లీలో కూర్చొని ఉండే యువరాజ్ గోరఖ్‌పూర్‌ను ఒక విహార కేంద్రంగా మార్చేందుకు అనుమతించం' అని రాహుల్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 71 మంది చిన్నారుల మరణించిన ఇక్కడి బిఆర్‌డి ఆస్పత్రితో పాటు బాధిత కుటుంబాలను రాహుల్ పరామర్శించడానికి వచ్చిన నేపథ్యంలో సిఎం ఈ మేరకు చురకలు అంటించారు. మెదడువాపు వ్యాధి వ్యాప్తిని అడ్డుకునే దిశగా ఇక్కడ 'స్వచ్ఛ్ ఉత్తర్ ప్రదేశ్ స్వస్త్య ఉత్తర్‌ప్రదేశ్ ఉద్యమా'న్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రాహుల్‌తో పాటు రాష్ట్ర మాజీ సిఎం అఖిలేష్ యాదవ్‌పైనా విమర్శలు చేశారు. 'షెహ జాదా లక్నోలోనూ యువరాజ్ ఢిల్లీలోనూ కూర్చున్నారు. వారికి ఈ పరిశుభ్రతా ఉద్యమం గురించి తెలియదు' అన్నారు.

పిఓకెలో స్థానికుల ఆందోళన

న్యూఢిల్లీ : పాకిస్తాన్ నుంచి తమకు విమోచనం కల్పించాలని డిమాండ్ చేస్తూ పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఓకె)లోని స్థానికులు శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జె&కె స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిందాలి నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఆందోళనలో పాల్గొన్న స్థానిక నాయకుడు లియాఖత్ ఖాన్ మాట్లాడుతూ ఈ ప్రాంతానికి ఉగ్రవాదులను పంపించి, ఇక్కడి ప్రశాంత వాతావరణానికి పాక్ తీవ్ర విఘాతం కల్గిస్తోందని ఆరోపించారు. పాక్ రాజకీయ పార్టీలు పిఓకెను లూఠీ చేస్తున్నాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో బుల్లితెర నటుల మృతి



ముంబయి: మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శనివారం నాడు అహ్మదాబాద్, ముంబయి రహదారిపై పాల్ఘూర్‌లోని మనోర్ వద్ద జరిగిన ఈ ఘటనలో ఇద్దరు బుల్లితెర నటులు ప్రాణాలు కోల్పోయారు. 'సంకట మోచన్ మహాబలి హనుమాన్' సీరియల్‌లో నటిస్తున్న గగన్ కాంగ్, అర్జిత్ లావానియా దుర్మరణం చెందారు. 'మహాకాళి' టీవీ షో షూటింగ్‌లో పాల్గొని ముంబయికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వీరు ప్రయాణిస్తున్న కారు ఓ కంటైనర్‌ను ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందారు. హనుమాన్ సీరియల్ ద్వారా ప్రాచుర్యం పొందిన గగన్ 'మహాకాళి'లో ఇంద్రుడిగా నటిస్తున్నాడు. అర్జిత్ నంది పాత్రలో కన్పిస్తున్నారు. శుక్రవారంనాడు మొత్తం విరామం లేకుండా షూటింగ్‌లోని పాల్గొని శనివారం ఉదయం షూటింగ్ ముగించుకుని ఉమర్‌గావ్ నుంచి ముంబయి బయల్దేరారని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో గగన్ కారు నడుపుతున్నాడు. సంఘటన గురించి తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇరువురి మృతికి టివి, సినీ నటులు పలువురు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.



గర్భసంచి నుంచి 50 కణితుల వెలికితీత

ఇటానగర్ : ఇక్కడి వైద్యుల బృందం ఓ మహిళ గర్భాశయం నుంచి 50 కణితులను తొలిగిం చారు. ట్యూమర్ల కారణంగా ఈ మహిళ చాలా సంవత్సరాలుగా నరక యాతన అనుభవి స్తోంది. ప్రత్యేకించి రుతుస్రావం సమయంలో ఆమె తీవ్రస్థాయి నొప్పితో బాధపడుతూ వస్తోంది. ఆమె సమస్యను గుర్తించిన స్థానిక రామకృష్ణ మిషన్ హాస్పిటల్‌కు చెందిన సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ పోస్టింగ్ బేయాంగ్ తమ తోటి వైద్య బృందంతో కలిసి నిర్వహించిన ఆపరేషన్ విజయవంతం అయింది. గర్భసంచీలో లెక్కకు మించి కణితులు ఉన్నట్లు, ఇది అత్యంత అరుదైన లక్షణంగా భావిస్తున్నట్లు బేయాంగ్ తెలిపారు. ఈ మహిళకు 30 ఏళ్ల దరిదాపు వయస్సుఉండటం, అవివాహితగా ఉండటంతో ఈ అరుదైన గర్భసంచీ మ్యోమాస్ దెబ్బతినకుండానే కణితులను తొలిగించేందుకు క్లిష్టమైన ఆపరేషన్ చేయాల్సి వచ్చిందని తెలిపారు. వైద్య పరిభా షలో ఈ ఆపరేషన్‌ను మ్యామెక్టోమీగా పిలుస్తారు. కడుపులో భరించలేని బాధ ఉండ టంతో ఆ మహిళ పలువురు డాక్టర్లను సంప్రదించింది. అయితే హిస్టీరెక్టోమీ చేయాల్సి ఉందని, గర్భాశయం మొత్తం తొలిగిపోతుందని వారు చెప్పారు. ఈ ఆపరేషన్ వద్దను కున్న మహిళకు తరచూ నొప్పి రావడం రుతుస్రావ క్రమంలో అధికంగా రక్తంపో వ డంతో బలహీనం అయిపోతూ వచ్చింది. ఇప్పుడు ఆమె గర్భాశయం నుంచి కణితు లను తొలిగించడం ద్వారా గర్భాశయాన్ని నిలపడం ద్వారా స్థానిక వైద్యులు తమ ఘనతను చాటుకున్నారు.



ఛాతీ నుంచి 3.2 కిలోల కణితి తొలగింపు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో రష్యన్ జాతీయుడి ఛాతీలో పెరిగిన 3.2 కిలోల కణితిని డాక్టర్లు తొలగించారు. ఎంతో రిస్క్‌తో కూడిన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి వర్గాల తెలిపాయి. రష్యన్ జాతీయుడు ఎమిలి తన ఛాతీలో పెరుగుతున్న కణితితో గత ఐదేళ్లుగా ఊపిరి ఆడక ఇబ్బందికి గురయ్యారని వసంత్ కుంజ్‌లోని ఫోర్టిస్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఛాతీలోని కణితి కుడి ఊపిరి తిత్తిపై ఒత్తిడిని పెంచడంతో ఆపరేషన్ క్లిష్టంగా మారిందన్నారు. జులై 31న ఆస్పత్రిలో చేరిన రోగికి ఆగస్టు 1 ఆపరేషన్ చేసి ఆగస్టు 8న డిశ్చార్జి చేసినట్లు డాక్టర్లు తెలిపారు. గుండె, ఇతర ముఖ్య అవయవాలకు రక్తం సరఫరా చేసే ప్రధాన వాహకంకు ఆనుకొని కణితి పెరిగి పోవడంతో సర్జన్లు ఇబ్బంది పడినట్లు తెలిపారు. ఊపిరి తిత్తులు, ఛాతీకి మధ్య ఉన్న కుహరంలో కణితి పెరిగిందన్నారు. ఈ ప్రదేశంలో కణితి పెరగడానికి కారణం తమకు తెలియదన్నారు. సిగరెట్ కాల్చడం వల్ల ఇది ఏర్పడలేదని తెలి పారు. సర్జరీ విజయవంతంగా పూర్తి అయిన తర్వాత పొగ తాగే వల్ల కంటే తాగని వారు త్వరగా కోలుకుంటారని గొంతు క్యాన్సర్ సర్జరీ నిపుణులు సవ్యసాచి అన్నారు.



భూమి పక్క నుంచి దూసుకువెళ్లనున్న ఉల్క

వాషింగ్టన్ : అత్యంత భారీ గ్రహ శకలం ఒకటి సెప్టెంబర్ 1న భూమిని దాటుకుంటూ పోతుంది. దాదాపు భూమి పరిణామంలో ఉండే ఈ శకలం వల్ల భూమికి ఎలాంటి ముప్పు లేదని నాసా శాస్త్రజ్ఞులు తెలిపారు. ప్రస్తుతం ఈ శకలం భూమికి 70 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉంది. ఫ్లోరెన్స్ అస్టారాయిడ్‌గా వ్యవహరించే ఈ ఉల్క భూమికి దగ్గరగా దూసుకువస్తున్న వాటిలో అతి భారీ పరిణామపు శకలం. నాసాకు చెందిన స్పిట్జర్ టెలీస్కోప్ నుంచి దీని సైజ్ గురించి విశ్లేషించారు. ఈ శకలం వెడల్పు 4.4 కిలోమీటర్ల వరకూ ఉంటుందని వెల్లడైంది. పలు శకలాలు భూమికి సమీపం నుంచి వెళ్లుతూ ఉంటాయని, ఈ అస్టారాయిడ్ కూడా వీటిలో ఒకటని నాసాకు చెందిన నిపుణుడు పాల్ ఛోడస్ తెలిపారు. ఓ గ్రహశకలం అందులోనూ అత్యంత భారీ పరిణామపు శకలం భూమికి సమీపంలో నుంచి వెళ్లుతుండటం ఖగోళ శాస్త్రీయ పరిశోధనలకు కీలకంగా మారింది. ఈ ఫ్లోరెన్స్ శకలాన్ని అత్యంత దగ్గరి నుంచి వీక్షించి, దీనిలోని రహస్యాలను ఛేదించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నాసా బృందం తెలిపింది.

ముషారఫ్‌కు చేదు అనుభవం

ప్రసంగాన్ని అడ్డుకున్న బెలూచిస్తాన్ ఆందోళనకారులు

న్యూఢిల్లీ : పాక్ మాజీ మిలటరీ అధినేత పర్వేజ్ ముషారఫ్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఓస్లోలో నోబుల్ పీస్ సెంటర్ ఆధ్వర్యంలో 'శాంతి కోసం చర్చలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ముషారఫ్ ప్రసంగిస్తుండగా బెలూచిస్తాన్ ఆందోళనకారులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శాంతి గురించి మాట్లాడే హక్కు ఆయనకు లేదని నిందించారు. పరిస్థితి గందరగోళంగా మారడంతో నిర్వాహకులు కార్యక్రమాన్ని మధ్యలోనే ముగించారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించేందుకు ముషారఫ్‌ను ఆహ్వానించడాన్ని నిరసిస్తూ బెలూచిస్తాన్ ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేయడంతో నోబు ల్ పీస్ సెంటర్ కార్యక్రమాన్ని రద్దు చేసి మంచి పని చేసిందని బెలూచిస్తాన్ రిపబ్లికన్ పార్టీ అధికార ప్రతినిధి షేర్ మహ్మద్ బుగ్తీ ట్వీట్ చేశారు.

వర్జీనియా ఘటనకు నిరసనగా కళాకారుల రాజీనామా

జుంపాలాహిరి, కాల్‌పెన్ సహా ..

వాషింగ్టన్ : వర్జీనియా జాత్యహంకార హింసాకాండ వివాదం విషయంలో అధ్యక్షుడు ట్రంప్ కళలు, హ్యూమానిటీస్ కమిటీ మొత్తం రాజీనామా చేసింది. వారిలో ఇండియన్–అమెరికన్ లైన జుంపాలాహిరి, కాల్‌పెన్ కూడా ఉన్నారు. కమిటీకి చెందిన 17మంది సభ్యులు పారిస్ వాతావరణ ఒప్పందంనుంచి వైదొలగాలన్న ట్రంప్ నిర్ణయానికి వ్యతిరేకంగా కూడా రాజీనామా చేస్తున్నట్లు తమ లేఖలో తెలిపారు. ఆధిక్యతా భావాలు, వివక్షలు, విద్వేష ప్రచారాలు అమెరికన్ విలువలు కానేకావని వారు తమ లేఖలో పేర్కొన్నారు. అమెరికా విలువలను ట్రంప్ పాటించటం లేదని పేర్కొన్నారు.అందుకే రాజీనామా చేస్తున్నామని , పరిస్థితి ఇప్పటికి మీరు అర్థం చేసుకోలేకపోతే మీ రాజీనామాకు ఒత్తిడి తెస్తాం అని కూడా వారు ట్రంప్‌ను హెచ్చరించారు. గత వారం వర్జీనియాలోని చార్లెట్స్‌విలీ లో 'మితవాదులను ఐక్యం చేద్దాం' పేరుతో జరిగిన ర్యాలీలో హింసాకాండ చెలరేగి ఒక మహిళ మరణించారు. ఆ ర్యాలీలోంచి ఒక వాహనం నిరసన ర్యాలీపైకి దూసుకువెళ్లడంతో 19మంది గాయపడ్డారు. ఈ ఘటనలకు దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి.

ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం

ఫిట్‌నెస్ వర్క్‌షాప్‌లో గీతం విసి శివప్రసాద్





మన తెలంగాణ/ హైదరాబాద్ : వృత్తి జీవితంలో ఒత్తిడి అనివార్యమని, దానిని అధిగమించడానికి విద్యార్థి దశ నుంచే సన్నద్ధులు కావాలని, అప్పుడే వృత్తిలో రాణించగలరని గీతం విశ్వవిద్యాలయం ప్రొ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్.శివప్రసాద్ ఉద్బోధించారు. 'వావ్ రెవల్యూషన్' పేరిట కళాకృతి విద్యార్థి విభాగం ఏర్పాటు చేసిన ఒకరోజు ఉమెన్ వెల్‌నెస్ వర్క్‌షాప్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ప్రతిరోజు సమతుల ఆహారం తీసుకుంటూ శారీరక వ్యాయామం చేయాలని ఆయన సూచించారు. రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్ఆర్ వర్మ మాట్లాడుతూ, శరీర ధారుడ్యాన్ని పెంపొందించుకోవడంతోపాటు స్వీయరక్షణ పద్ధతులను కూడా నేర్చుకోవాలని సూచించారు. వర్క్‌షాప్ శిక్షకురాలు పూర్ణిమ మండవ మాట్లాడుతూ, విద్యార్థినులు రోజువారీ కార్యకలాపాలలో మునిగిపోయి ఆరోగ్య సంరక్షణ, ఫిట్‌నెస్ వంటి అంశాలకు ప్రాధాన్యం తగ్గిస్తున్నారని అన్నారు. ఇది సమీప భవిష్యత్తులో దురదృష్టకర పరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడానికి, స్వీయ రక్షణకు అవసరమైన పద్ధతులను ఈ కార్యశాలలో నేర్పిస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యశాలలో దాదాపు 250 మంది ఇంజనీరింగ్ విద్యార్థినులు పాల్గొని శిక్షణ పొందారు.

హెచ్‌ఐసిసిలో 'ఎస్‌విఎస్ ఇండియా 2017' సదస్సు



మన తెలంగాణ/హైదరాబాద్: నగరంలోని హెచ్‌ఐసిసిలో ఈ నెల 20వరకు ఫ్యాక్స్ ఫౌండేషన్, ఇండియా, యూఎస్ఎ కార్డియోవాస్కులర్ రీసెర్చి ఫౌండేషన్ (సిఆర్‌పిఎఫ్) సంయుక్తంగా ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఎస్‌విఎస్ ఇండియా 2017 సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు దేశవిదేశాల నుంచి 15 వందల మందికి పైగా ప్రతినిధులతో పాటు 200 మందికి పైగా ప్రొఫెసర్లు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఫ్యాక్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ.. జాతీయ అంతర్జాతీయంగా కొత్త పద్ధతులు, సాంకేతికతలను ఈ సదస్సులో ప్రదర్శించనున్నట్టు చెప్పారు. ఎసిఎఎల్‌ఎమ్ వ్యవస్థాపకుడు రాహుల్ పొట్లూరి మాట్లాడుతూ.. ఎసిఎఎల్ఎమ్ ద్వారా బిగ్‌డేటాపై దృష్టిపెడుతున్నామని అన్నారు.

డ్రగ్స్ వినియోగ పరిణామాలపై ఇ-లెర్నింగ్

మన తెలంగాణ/హైదరాబాద్ : డ్రగ్స్, ఆల్కహాల్ వినియోగం వల్ల కలిగే విపత్కర పరిణామాలపై అవగాహన పెంచే ఉచిత ఇ లెర్నింగ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలంగాణ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టిటా) అధ్యక్షులు సందీప్ కుమార్ మక్తాల తెలిపారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో టిటా గ్లోబల్ ఉపాధ్యక్షులు రాణ ప్రతాప్ బొజ్జం, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్ మడిపోజు తదితరులు పాల్గొన్నారు. జెఎన్‌టియు (హైదరాబాద్), సాఫ్ట్‌వేర్ కంపెనీ 360 లెర్నింగ్‌తో కలిసి జెఎన్‌టియు అనుబంధ కళాశాల విద్యార్థులందరికి ఇ లెర్నింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో సమీక్ష తదితర అంశాలు పోర్టల్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు.

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన



మన తెలంగాణ/మేడ్చల్: డ్రగ్స్, మాదక ద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు లష్ లైఫ్ బిస్ట్రో ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం దూలపల్లి సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కాలేజీలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా కమిషనర్ చంద్రవదన్, మల్కాజిగిరి ఎంపి మల్లారెడ్డి, నటి మానసతో పాటు కళాశాల యాజమాన్యం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. యువత భవిష్యత్తుకు ముప్పుగా పరిణమిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని మొగ్గలోనే తుంచివేయాలంటూ పిలుపునిచ్చారు.

రష్యాలో దుండగుడి వీరంగం

- పాదచారులపై కత్తితో దాడి, 8 మందికి గాయాలు
- ఫిన్‌లాండ్‌లో ఐదుగురు అనుమానిత వ్యక్తులు అరెస్ట్



మాస్కో/ఫిన్‌లాండ్: రష్యాలోని సుర్గత్ నగరంలో ఓ దుండగుడు వీరంగం సృష్టించాడు. వీధుల్లో ఒంటరిగా సంచరిస్తూ మార్గంలో పాదచారులపై విచక్షణ లేకుండా కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈశాన్య మాస్కోలోని ఆయిల్‌రిచ్ ఖాంటీ మాన్సి ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. దుండగుడి దాడిలో తీవ్రగాయాలైన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా, మిగతా ఆరుగురు పరిస్థితి నిలకడగా ఉన్నట్టు రష్యా విచారణ కమిటీ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిన్‌లాండ్‌లో టుర్కు మార్కెట్ సమీపంలో మరో కత్తి దాడి ఘటన చోటుచేసుకోవడంతో రంగంలోకి దిగిన పోలీసులు దుండగుడిపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో అతడికి బుల్లెట్ గాయం కావడంతో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో వీధుల్లో అనుమానస్పదంగా తిరుగుతున్న మరో ఐదుగురు వ్యక్తులను కూడా అరెస్టు చేశారు. కత్తి దాడి ఘటనల్లో ఇప్పటివరకూ ఇద్దరు మృతిచెందినట్టు తమ విచారణలో వెల్లడైందని చెప్పారు. ఫిన్‌లాండ్ కత్తి దాడి ఘటన అనంతరం బాధితుల సంఖ్య ఆరు నుంచి ఎనిమిదికి చేరిందని తెలిపారు. అరెస్టైన ఐదుగురు వ్యక్తులను విచారిస్తున్నామని ఎన్‌బిఐ విచారణ అధికారి మార్కస్ లైనే చెప్పారు. వరుస కత్తి దాడులకు పాల్పడిన దుండగుడు ఎవరూ అనేది ఇప్పటివరకూ గుర్తించలేదని లైనే అన్నారు. బుల్లెట్ గాయాలైన దుండగుడిని ఇంకా విచారించాల్సి ఉందని చెప్పారు. దాడులకు పాల్పడేది సైకోనా, లేక ఉగ్రవాదా? అనేది విచారణ అనంతరం మాత్రమే నిర్ధారించగలమని అన్నారు. ఇటీవల వరుస కత్తి దాడుల ఘటనలతో దేశవ్యాప్తంగా ఫిన్‌లాండ్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఎయిర్‌పోర్టులు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో భద్రతా చర్యలను వేగవంతం చేశారు.

కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ టిఆర్ఎస్ ప్రభుత్వం

పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి



మన తెలంగాణ/శంషాబాద్ : శనివారం శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేణుగౌడ్ ఇంట్లో టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ నాయకత్వంలో యుపిఏ ప్రభుత్వం హైదరాబాద్ శివారు ప్రాంతాలైన రంగా రెడ్డి జిల్లాలోని శంషాబాద్,మహేశ్వరం ప్రాంతాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌ను 2013లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేయడం జరిగిందన్నారు.ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం ఈ ప్రాంతం ఒక గొప్ప ఐటీ హబ్‌గా మారాలని ప్రపంచంలోనే చాలా ప్రఖ్యాతి గాంచిన సిలికాన్ వ్యాలీ, చైనాలోని షాంఘై స్థాయిలో ఎదగాలని ఆ స్థాయిలో పెట్టుబడులు రావాలని లక్షలాది ఉద్యోగాలు మన యువతకు రావాలని ఐటీఐఆర్ ప్రాజెక్ట్ తేవడం జరిగిందన్నారు. బాధాకరమైన విషయం ఏమంటే కెసీఆర్ ఐటీఐఆర్ చాలా గొప్ప ప్రాజెక్టు అని ఆయనే స్వయంగా చేవెళ్ల బహిరంగ సభలో చెప్పారన్నారు. ఆ తర్వాత 2014లో మొదటి శాసన సభ సమావేశంలో గవర్నర్ ప్రసంగంలో ఐటీఐఆర్ ద్వారా రెండు లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని, 50లక్షల ఉద్యోగావకాశం యువతకు దొరుకుతుందని చెప్పి మళ్లీ 2017లో బడ్జెట్ సమావేశంలో మళ్లీ అదే మాట గవర్నర్ ప్రసంగంలో చెప్పించిన కెసీఆర్ ఐటీఐఆర్ ప్రాజెక్టు ఏమైందో చెప్పాలన్నారు. ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం లేదు ఇది కెసీఆర్ పాలనకు నిదర్శనం కాదా అని అన్నారు.పాత పనులకే దిక్కులేదు కొత్త పనులు ఏమి చేస్తారు అని అన్నారు.మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్నా చేసింది ఏమి లేదు అని దుయ్యబట్టారు.ప్రజలను మభ్యపెట్టడం తప్ప ప్రజలకు ఒరగబెట్టింది ఏమి లేదని ఆరోపించారు. ఐటీఐఆర్‌కే దిక్కుదివాణంన లేదని ఇంకా మీరేం చేస్తారు అసలు ఈ ప్రాజెక్టు ఎందుకు చేయలేక పోతున్నారో కెసీఆర్ రంగారెడ్డి జిల్లా ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ హోంమంత్రి సబితారెడ్డి, ఎంపి నంది ఎల్లయ్య, మాజీ ఎమ్మెల్యే మల్లురవి, సంపత్‌కుమార్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రావణ్‌కుమార్, పార్టీ చేవెళ్ల ఇంచార్జి కార్తీక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

10 లోక్‌సభ, 68 అసెంబ్లీ స్థానాలు గెలుపే లక్ష్యం

- ఇప్పటికే బిజెపి ఎంపి అభ్యర్థుల గుర్తింపు
- గెలుపు గుర్రాలను అన్వేషిస్తున్న అమిత్‌షా మనుషులు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో కనీసం 10 లోక్‌సభ, 68 శాసన సభ స్థానాలను గెలవాలని బిజెపి జాతీయ అధ్యక్షులు అమిత్‌షా లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో భాగంగా ఆయన ఢిల్లీ నుండి కొంత మందిని ప్రత్యేకంగా రాష్ట్రానికి పంపించారు. వారు రాష్ట్రమంతటా పర్యటిస్తూ గెలుపు గుర్రాలను గుర్తించే పనిలో పడినట్లు బిజెపి రాష్ట్ర నాయకుల్లో ప్రచారం జోరందుకుంది. దాదాపు 10 లోక్‌సభ స్థానాలకు బరిలో నిలిపే అభ్యర్థుల పేర్లపై ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చినట్లు సమాచారం. గడచిన ఏడాది కాలంగా తెలంగాణపై అమిత్‌షా ప్రత్యేక దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. కానీ అమిత్‌షా ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర పార్టీ నాయకుల కార్యాచరణ లేకపోవడంతో అన్నీ తానై వ్యవహరించాలని జాతీయ అధ్యక్షుడు నిర్ణయించుకున్నట్లు బిజెపిలో చర్చ సాగుతోంది. పార్టీలో చేరికలు నిరంతరమని రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రకటించినప్పటికీ ఎవరెవరు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు, ఎవరెవరితో చర్చిస్తున్నారన్న అంశంపై స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. గత కొద్ది రోజులుగా తెలంగాణకు చెందిన కొంత మంది నేరుగా ఢిల్లీకి వెళ్ళి అమిత్‌షాను కలవడం, ఆయనతో చర్చించిన అనంతరం రాష్ట్రానికి వచ్చి తమదైన శైలిలో స్పందిస్తున్నారు. ఇటీవల సీనియర్ నేత డి. శ్రీనివాస్ కుమారుడు అరవింద్ ప్రధాని నరేంద్ర మోడీని కీర్తిస్తూ భారీగా పత్రికా ప్రకటనలను ఇచ్చారు. ఈయనకు అమిత్‌షా స్పష్టమైన హామీ లభించిందని చెబుతున్నారు. అదే విధంగా మాజీ మంత్రి, మెదక్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి కరణం రామచందర్‌రావు కోడలు ప్రణతి కూడా అమిత్‌షాను కలిసి హామీ తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆమె కూడా ఆ జిల్లాలోని లోక్‌సభ పరిధిలో తన కార్యకలాపాలను విస్తరించుకుంటున్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజిగిరి, వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్, భువనగిరి, నిజామాబాద్, చేవెళ్ళ, నల్లగొండ లోక్‌సభ స్థానాల అభ్యర్థుల ఎంపికపై అమిత్‌షా స్పష్టతకు వచ్చినట్లు తెలిసింది. ఈ నియోజకవర్గాలలో కనీసం నాలుగు చొప్పున అసెంబ్లీ స్థానాలను కూడా గెలిపించాలని లక్ష్యంతో సరైన అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో అమిత్‌షా ఉన్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది.

మూడు నెలల్లో అభ్యర్థుల జాబితా!: రానున్న మూడు మాసాల కాలంలో మిగతా లోక్‌సభ స్థానాలతో పాటు అసెంబ్లీ అభ్యర్థులను కూడా ఖరారు చేస్తామని రాష్ట్ర పార్టీకి బిజెపి కేంద్ర నాయకత్వం సంకేతాలను పంపించినట్లు సమాచారం. త్వరలోనే రాష్ట్ర పర్యటనకు అమిత్‌షా రానున్న నేపథ్యంలో ఆయా లోక్‌సభ, శాసనసభ అభ్యర్థుల జాబితాను రాష్ట్ర నాయకులకు అందిస్తారన్న ప్రచారం కూడా జోరందుకుంది. పార్టీ రాష్ట్ర నాయకుల పనితీరును కూడా అమిత్‌షా మనుషులు అంచనా వేస్తున్నారని, అవసరమైతే పార్టీలో మార్పులకు కూడా రాష్ట్ర పర్యటన సందర్భంగా శ్రీకారం చుట్టబోతున్నారన్న చర్చ కూడా సాగుతోంది. ఏది ఏమైనా గెలుపే ధ్యేయంగా పావులు కదుపుతున్న అమిత్‌షా వేర్వేరు పార్టీలలో ఉండి కీలకంగా వ్యవహరిస్తున్న వారిని వీలైనంత తొందరగా పార్టీలోకి తీసుకుని కీలక బాధ్యతలను కట్టబెట్టనున్నారన్న ప్రచారం కూడా సాగుతోంది.

అనాథల బడి స్థలాన్ని పోలీసు కమిషనరేట్‌కు కేటాయిస్తారా?



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం రాచకొండ పోలీస్ కమిషనరేట్ కోసం వందేళ్ళ చరిత్ర కలిగిన విక్టోరియా రెసిడెన్షియల్ స్కూల్ (అనాథల బడి)కు సంబంధించిన 10 ఎకరాల భూమిని కేటాయించడం సిగ్గుచేటు అని వామపక్ష, ప్రజాసంఘాలు విమర్శించాయి. ఈ మేరకు సచివాలయంలో శనివారం టిపిఎఫ్ అధ్యక్షులు నలమాస కృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గం సభ్యులు మల్లెపల్లి ఆదిరెడ్డి ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శి అజయ్ మిశ్రాకు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం వారు మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ ఇంతకు ముందు పనిచేసిన సిఎంలు అనాథాశ్రమాన్ని సందర్శించి దాని తోడ్పటుకు కృషి చేసారని గుర్తు చేశారు. కెసిఆర్ మాత్రం ఆ విక్టోరియా రెసిడెన్షియల్ భూములను పోలీసుల పరం చేయడానికి సిద్ధపడ్డారని, దీనిని వెనక్కు తీసుకోవాలన్నారు. అనాథ పిల్లల కోసం నిజాం రాజుట్రస్ట్‌గా ఏర్పర్చి అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అనాధ పిల్లల భూమిని ఆక్రమించుకుంటూ పోలీసులకు అప్పజెప్పడం దురదృష్టకరమన్నారు. సిఎం కెసిఆర్ చెపుతున్న కెజి టూ పిజి విద్య కోసం ఆ పది ఎకరాల భూమిలో భవనాలు నిర్మించి విద్యా వ్యాప్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్) (యన్.డి) హన్మేష్, విద్య పరిరక్షణ కమిటీ రవిచంద్ర, పివొడబ్ల్యూ సంధ్య, వెంకటస్వామి. విరసం అరవింద్ తదితరులు ఉన్నారు.

దేవున్ని నమ్మే వారెవరూ లేరు

- కేవలం మన సౌకర్యానికే....
- హైకోర్టు జడ్జి వి.రామసుబ్రమణియన్

మన తెలంగాణ/హైదరాబాద్ : నాలుగు ఖండాలు, 12 దేశాల్లో పౌర హక్కుల కోసం బీజాలు వేసిన, ఐదు సార్లు నోబెల్ బహుమతి కోసం పేరు నామినేట్ చేయబడ్డ మహాత్మాగాంధి ప్రత్యేకమైన వ్యక్తి అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ అన్నారు. సర్వోదయ ఇంటర్నేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మహాత్ముని స్థానమెక్కడ?అనే అంశంపై ప్రసంగించారు. ప్రపంచంలోని చాలా మంది ప్రముఖులు మహాత్మాగాంధిని కీర్తించారని, యేసుక్రీస్తు ఇచ్చిన ప్రేరణకు, గాంధీ మార్గం చూపించారని అమెరికా నల్లజాతి హక్కుల పోరాట యోధుడు మార్టిన్ లూథర్ కింగ్ వ్యాఖ్యానించినట్లు గుర్తు చేశారు. వ్యక్తిగత జీవితంలోను గాంధి ఆదర్శప్రాయమైన విలువలను పాటించారని అన్నారు. అయితే గాంధిపై ప్రధానంగా నాలుగు రకాల విమర్శలు కూడా ఉన్నాయన్నారు. అగ్రవర్ణాలు ఆయనను దళితుల పక్షపాతి అని, దళితులు ఆయన బనియా అని అగ్రవర్ణాలకు అనుకూలమని, ముస్లింలు ఆయనను అగ్రవర్ణ హిందు అని, హిందువులు ఆయనను లౌకికవాదం పేరుతో ముస్లింలకు పక్షం వహించారనే అభిప్రాయాలున్నాయన్నారు. దళిత ఉద్యమకారుల నుండి ఎక్కువగా పూణె ఒడంబడికపై విమర్శలున్నాయని, గాంధి కారణంగానే దళితులకు ద్వంద్వ ఓటు హక్కు దక్కలేదనే విమర్శ ఉందన్నారు. ప్రొఫెసర్ కంచె ఐలయ్య రాసిన నేనెట్ల హిందువునైతా? అనే పుస్తకంలోను గాంధి వల్లో దక్కలేదని రాశారన్నారు. గాంధి కాంగ్రెస్‌లో వీటిని వ్యతిరేకించే అగ్రవర్ణ హిందువులతో చర్చలు జరిపేందుకు ప్రయత్నించారన్నారు.1931లో సత్యాగ్రహ గాంధి అసాధారణ విజయాన్ని స్వంతం చేసుకున్నారని, దానితో బ్రిటీష్ పాలకులు రెండవ రౌండ్ టేండ్ సమావేశం ఏర్పాటు చేశారన్నారు. దానికి భారత దేశం నుండి ఒక ప్రతినిధి హాజరు కావాల్సి ఉండి, విభజించు పాలించి పద్ధతిలో ఆ సమావేశానికి పలువురిని పిలిచారన్నారు. మిగిలిన అంశాల్లోనూ గాంధి దృక్పథాన్ని ఆయన వివరించారు.

ఫిజీలో భారీ భూకంపం

రిక్టర్‌స్కేలుపై 6.4గా నమోదు

వెల్లింగ్టన్: దక్షిణ పసిఫిక్‌లోని ఫిజీ ద్వీపంలో శనివారం భారీ భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.4గా నమోదైనట్టు అమెరికా భూకంప శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఫిజీ రాజధాని తూర్పు సూవకు 178 మైళ్ల దూరంలో 538 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్టు అమెరికా భూగర్భ సర్వే (యుఎస్‌జిఎస్) పేర్కొంది. అయితే భూకంపం కారణంగా ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లినట్టు సమాచారం అందలేదు. హవాయి ఆధారిత పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం కూడా భూకంప తీవ్రతపై అధికారికంగా ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు.

పాక్ 'మదర్ థెరిసా'కు కన్నీటి వీడ్కోలు



కరాచీ: పాకిస్థాన్ మదర్ థెరిసాగా పేరొందిన జర్మనీ సంతతి వైద్యురాలు, క్యాథలిక్ సన్యాసిని రూథ్ క్యాతరీనా మార్థా ఫౌ (89)అంత్యక్రియలను పాక్ ప్రభుత్వం శనివారం అధికార లాంఛనాలతో నిర్వహించింది. సుధీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రూథ్ ఈ నెల 10న కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆమె మృతిపట్ల పాక్ ప్రధాని షాహీద్ ఖాకన్ అబ్బాసీ సంతాపాన్ని ప్రకటించారు. దేశంలో కుష్ఠు వ్యాధి నిర్మూలనకై రూథ్ చేసిన నిస్వార్థపరమైన కృషికిగాను పాక్ ప్రజలంతా ఆమెకు ఎంతో రుణపడి ఉన్నారని అన్నారు. రూథ్ అంత్యక్రియల్లో భాగంగా ఆమె పార్థీవదేహ పేటికను పాకిస్థాన్ ఆర్మీ సిబ్బంది కరాచీలోని సద్దార్ ప్రాంతం వద్దకు తీసుకవచ్చారు. ఆమె భౌతియకాయంపై పాక్ జాతీయ జెండాను కప్పి 19 తుపాకీలతో గౌరవ వందనాన్ని సమర్పించారు. అనంతరం ఆమె భౌతికకాయాన్ని కరాచీలోని గోరా ఖబారిస్తాన్ సశ్మాన వాటిక వద్దకు తరలించారు. పాక్ మదర్ అంతిమ వీడ్కోలు కార్యక్రమంలో పాక్ అధ్యక్షుడు మమ్నూన్ హుస్సేన్, సింధ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మురాద్ అలీ షా, సింధ్ గవర్నర్ ముహమ్మద్ జుబెయిర్, పాక్ ఆర్మీ చీఫ్ స్టాఫ్ జనరల్ ఖమర్ జవెద్ బజ్వా తోపాటు వందలాది మంది ప్రజలు, 'మేరీ అడిలైడ్ కుష్ఠ నివారణ కేంద్రం' (ఎంఎఎల్‌సి) సభ్యులు పాల్గొన్నారు. పాకిస్థాన్ ప్రజలు గర్వపడేలా రూథ్ థెరిసా చేసిన కృషి మరువలేనిదిగా విదేశీ కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. రూథ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తు ఆమెకు ఘన నివాళిని ఘటించినట్టు పేర్కొంది. గత 29 సంవత్సరాల్లో పాకిస్థాన్‌లో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరగడం ఇది రెండోసారి. కాగా, గత ఏడాది చనిపోయిన దేశ పరోపకారి అబ్దుల్ సత్తర్ ఎధికి కూడా పాక్ ప్రభుత్వం ఇదే తరహాలో ఘనంగా అంత్యక్రియలను నిర్వహించింది. కరాచీలోని ప్రభుత్వ ఆస్పత్రికి రూథ్ గౌరవార్థం ఆమె పేరును పెడుతున్నట్టు సింధ్ సిఎం షా ప్రకటించారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనకై రూథ్ చేసిన కృషికిగాను అనేక అవార్డులు రాగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) ఆమె సేవలను గుర్తించి 1996 లో కుష్ఠు వ్యాధి రహిత పాక్‌గా ప్రకటించింది.

కాల్పుల కేసులో విక్రమ్‌కు బెయిల్

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : కాల్పుల కేసులో మాజీ మంత్రి ముఖేష్ గౌడ్ కుమారుడు విక్రమ్ గౌడ్‌కు నాంపల్లి కోర్టు శనివారం బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా రూ.25 వేల విలువైన రెండు షూరిటీలను సమర్పించాలని ఆదేశించింది. ప్రతి ఆదివారం బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌కు హాజరు కావాలని ఆదేశించింది. తనపట్ల ప్రజల్లో సానుభూతిని పెంపొందించుకుని తద్వారా ఎమ్మెల్యేగా గెలవాలనే ఏకైక లక్ష్యంతో విక్రమ్ తనపై కిరాయి ముఠాతో కాల్పులు జరిపించుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో కిరాయి ముఠా సభ్యులు నంద, బాబుజాన్, షేక్ అహ్మద్, రయీస్, గోవింద్‌లను ఈ నెల 2న అరెస్టు చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. మరుసటి రోజు అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విక్రమ్‌ను సైతం అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. అయితే ఇటీవల విక్రమ్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై వాదోపవాదాల అనంతరం కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

నోట్ల మార్పిడి కేసులో ఆరుగురి అరెస్టు

- రూ.కోటి పాతనోట్లు స్వాధీనం



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీ బ్యూరో: రద్దయిన పాత నోట్లను మార్పిడి చేసే మరో ముఠా గుట్టును కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ముఠాకు చెందిన ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.కోటి పాతనోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బర్కత్‌పురాకు చెందిన పెట్రోల్ బంక్ యజమాని రాజ్‌కుమార్ బగాడి (51), తలాబ్‌కట్టకు చెందిన స్పోర్ట్స్ ఆర్టికల్స్ వ్యాపారి అహ్మద్ బిన్ అలీ (30), బహదూర్‌పురాకు చెందిన క్యాబ్ డ్రైవర్ మహ్మద్ సల్మాన్ (28), శాలిబండకు చెందిన టెక్స్‌టైల్ వ్యాపారి మహ్మద్ షబ్బీర్ (43), నేరేడ్‌మెట్‌కు చెందిన మహ్మద్ అహ్మద్ షరీఫ్ (30), పోస్టల్ శాఖకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి పెద్ద శెరి రెడ్డి ఖర (63)లు ఒక ముఠాగా ఏర్పడి రద్దయిన పాతనోట్లను కమిషన్ రూపంలో కొత్త నోట్లను ఇచ్చే వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాజ్‌కుమార్ ఇంట్లో శనివారం రూ.కోటి (రూ.1000, రూ.500) రద్దయిన నోట్లను మార్పిడి చేసేందుకు తీసుకువచ్చారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీసాయిని శ్రీనివాస్‌రావు, ఎస్ఐలు కె.వినోద్‌కుమార్, కానిస్టేబుళ్లు బి.ఈశ్వర్ విజేంద్రకుమార్, ఎస్.దుర్గేష్‌లు వల పన్నిపట్టుకున్నారు. పై ఆరుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.కోటి నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఘరానా మోసగాడు అరెస్టు

మన తెలంగాణ/హైదరాబాద్ : కోటి రూపాయల రుణం ఇప్పిస్తానని నమ్మించి మూడేళ్ళ పాటు వేర్వేరు పేర్లతో మోసాలకు పాల్పడి రూ. 3 లక్షలను కాజేసిన ఘరానా మోసగాడిని సిఐడి పోలీసులు అరెస్టు చేశారు. సిఐడి చీఫ్ గోవింద్ తెలిపిన ప్రకారం ఎస్ ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తికి మూడేళ్ళ క్రితం ఒక వ్యక్తి ఫోన్ చేసి వడ్డీ లేకుండా కోటి రూపాయల రుణం ఇప్పిస్తామని ఆశ పెట్టాడు. రుణ మంజూరు కోసం కావాల్సిన డాక్యుమెంట్ల కోసం రూ. 20 వేలు తన ఖాతాలో జమ చేయాలని చెప్పాడు. ఆ తర్వాత వేర్వేరు ఫోన్ నంబర్ల ద్వారా ప్రవీణ్‌కుమార్ వేర్వేరు పేర్లతో సంప్రదిస్తూ మూడేళ్లలో మొత్తం రూ. 3 లక్షలను దాదాపు 12 బ్యాంక్ ఖాతాలలో జమ చేయించుకున్నాడు. ఆ తర్వాత ఫోన్ తీయడం మాని వేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు ప్రవీణ్‌కుమార్ సిఐడిని జనవరి 31 ఆశ్రయించాడు. ఈ కేసును నమోదు చేసుకుని సిఐడి అధికారులు దర్యాప్తును చేపట్టగా, 12 బ్యాంక్ ఖాతాలు, మూడేళ్ళుగా ప్రవీణ్‌కుమార్‌ను మాటలతో మోసం చేస్తూ డబ్బులు కాజేసిన వ్యక్తి ఒక్కడేనని గుర్తించారు. చెన్నైలోని కెవికె హోటల్‌లో బస చేసిన ఆంధ్రాసోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ స్టోర్ కీపర్ 27 సంవత్సరాల హర్షవర్ధన్ అని గుర్తించారు. నెల్లూరు జిల్లా గూడూరు రైల్వే స్టేషన్ సమీపంలోని మాలవీయనగర్‌కు చెందిన వాడని గుర్తించి అరెస్టు చేశారు. వడ్డీ రహిత రుణాలను ఇప్పిస్తామని, తక్కువ వడ్డీకి రుణాలను ఇప్పిస్తామని ఫోన్ చేసే వారెవరినీ నమ్మొద్దని సిఐడి పోలీసులు ప్రజలను హెచ్చరించారు.

క్లీన్‌స్వీప్ కష్టమే : గవాస్కర్



దంబుల్లా: శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్‌లో టీమిండియాకు గట్టి పోటీ ఎదురు కావడం ఖాయమని భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ స్పష్టం చేశాడు. టెస్టుల్లో క్లీన్‌స్వీప్ సాధించిన కోహ్లి సేన వన్డేల్లో దీన్ని సాధించడం చాలా కష్టమన్నాడు. టెస్టులతో పోల్చితే వన్డేల్లో శ్రీలంక బలంగా ఉంటుందన్నాడు. లసిత్ మలింగ, కపుగెదెర, తిసారా పెరీరాల చేరికతో లంక బలోపేతంగా మారిందన్నాడు. భారత్‌కు గట్టి పోటీ ఇచ్చే సత్తా ప్రస్తుత లంక జట్టుకు ఉందన్నాడు. గతంలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా భారత్‌పై లంక సంచలన విజయం సాధించిన విషయాన్ని గవాస్కర్ గుర్తు చేశాడు. ఉపుల్ తరంగ, గుణతిలక, డిక్వెల్లా రూపంలో లంకకు వన్డే స్పెషలిస్ట్‌లు ఉన్న విషయాన్ని మరువ కూడదన్నాడు. పెరీరా చేరికతో నాణ్యమైన ఆల్‌రౌండర్ అందుబాటులోకి వచ్చాడన్నాడు. దీంతో భారత్‌ను ఓడించే సత్తా వారికుందన్నాడు. అయితే సిరీస్ మాత్రం కోహ్లి సేనాకే దక్కుతుందన్నాడు. ఒకటి రెండు మ్యాచుల్లో మాత్రమే లంకకు గెలిచే అవకాశాలున్నాయన్నాడు. సిరీస్ సాధించడం లంకకు అంత తేలిక కాదన్నాడు. మరోవైపు కోహ్లి సేన చాలా బలమైన జట్టని చెప్పాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు జట్టులో కొదవలేదన్నాడు. రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, రాహుల్‌లు చెలరేగడం ఖాయమన్నాడు.

సమరోత్సాహంతో కోహ్లి సేన

- **లంకకు పరీక్ష, ఫేవరెట్‌గా భారత్, నేడు తొలి వన్డే**



దంబుల్లా : టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా వన్డే సమరానికి సమరోత్సాహంతో సిద్ధమైంది. శ్రీలంకతో జరిగే ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ఆదివారం తెరలేవనుంది. దంబుల్లా వేదికగా తొలి మ్యాచ్ జరుగనుంది. డే/నైట్ ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్ భారత కాలమాన ప్రకారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి సేన ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. మరోవైపు ఇప్పటికే టెస్టు సిరీస్‌లో ఘోర పరాజయం చవిచూసిన శ్రీలంక కనీసం వన్డేల్లోనైనా జయకేతనం ఎగుర వేయాలనే పట్టుదలతో ఉంది. అయితే బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో బలోపేతంగా ఉన్న భారత్‌ను ఓడించడం అనుకున్నంత తేలిక కాదు. సీనియర్ క్రికెటర్లు రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమి, యువరాజ్ సింగ్, సురేశ్ రైనాలు లేకుండానే భారత్ వన్డే సిరీస్‌కు సిద్ధమైంది. వీరు లేకున్నా టీమిండియా చాలా బలంగా ఉంది. కెప్టెన్ కోహ్లి వన్డేల్లో ఆకాశమే హద్దుగా చెలరేగి పోతున్న విషయం తెలిసిందే. అంతేగాక ఓపెనర్లు శిఖర్ ధావన్, లోకేష్ రాహుల్‌లు భీకర ఫాంలో ఉన్నారు. మిడిలార్డర్‌లో అజింక్య రహానె కూడా మెరుగైన బ్యాటింగ్‌ను కనబరుస్తున్నాడు. ఇక మనీష్ పాండే కూడా చేరడంతో బ్యాటింగ్ మరింత బలోపేతంగా తయారైంది. భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రిత్ బుమ్రా, చైనామెన్ బౌలర్ కుల్దీప్ యాదవ్, శర్దుల్ ఠాకూర్, హార్దిక్ పాండ్యాలతో కూడిన బలమైన బౌలింగ్ లైనప్ భారత్‌కు అందుబాటులో ఉంది. కాగా, సీనియర్లు రిటైర్మెంట్ ప్రకటించడంతో బలహీనంగా మారిన శ్రీలంకకు ఈ సిరీస్ సవాలుగా మారింది. టెస్టు సిరీస్ ఓటమితో ఇంటాబయట విమర్శలను ఎదుర్కొంటున్న లంక కనీసం వన్డేల్లోనైనా గెలిచి కాస్తయిన పరువును కాపాడుకోవాలని భావిస్తోంది.

బ్యాటింగే బలం

ఈ సిరీస్‌లో భారత్ బ్యాటింగ్‌నే నమ్ముకుంది. ఓపెనర్లు శిఖర్ ధావన్, రోహిత్ శర్మలు మరోసారి చెలరేగేందుకు సిద్ధంగా ఉన్నారు. రాహుల్ కూడా ఓపెనర్ రేసులో ఉన్నా అతనికి ఈ స్థానంలో ఆడించడం కష్టమే. ఛాంపియన్స్ ట్రోఫీలో ప్రకంపనలు సృష్టించిన ధావన్, రోహిత్‌లు మరోసారి అదే సంప్రదాయాన్ని కొనసాగించాలనే పట్టుదలతో ఉన్నారు. టెస్టుల్లో బెంచ్‌కే పరిమితమైన రోహిత్ వన్డేల్లో ఆడడం ఖాయంగా కనిపిస్తోంది. అతను అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు. వన్డేల్లో అసాధారణ రికార్డు కలిగిన రోహిత్ సిరీస్‌లో జట్టుకు ప్రధాన ఆయుధంగా మారాడు. ఇక టెస్టు సిరీస్‌లో అదరగొట్టిన శిఖర్ ధావన్ వన్డేల్లో కూడా చెలరేగేందుకు తహతహలాడుతున్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన ధావన్, రోహిత్‌లు విజృంభిస్తే లంకకు కష్టాలు ఖాయం. రాహుల్‌కు మిడిలార్డర్‌లో చోటు లభించడం ఖాయంగా కనిపిస్తోంది. అజింక్య రహానె లేదా మనీష్ పాండే స్థానంలో అతను జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు కెప్టెన్ కోహ్లి కూడా వన్డేల్లో విజృంభించాలనే పట్టుదలతో ఉన్నాడు. ఇప్పటికే వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానంలో ఉన్న కోహ్లి లంకపై మరింత మెరుగ్గా ఆడాలని భావిస్తున్నాడు. టెస్టుల్లో కూడా కోహ్లి బ్యాట్‌ను ఝులిపించాడు. వన్డేల్లో కూడా జట్టును ముందుండి నడిపించాలనే ఉద్దేశంతో కనిపిస్తున్నాడు.

ప్రత్యేక ఆకర్షణగా హార్దిక్

మరోవైపు టెస్టు సిరీస్‌లో అద్భుతంగా చెలరేగిన హార్దిక్ పాండ్యా వన్డే సిరీస్‌కు కీలకంగా మారాడు. భీకర ఫాంలో ఉన్న పాండ్యా వన్డేల్లోనూ చెలరేగేందుకు సిద్ధమయ్యాడు. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా అతనికి ఉంది. చివరి టెస్టులో మెరుపు సెంచరీతో భారత్‌ను ఆదుకున్న హార్దిక్ వన్డేల్లో కూడా అదే జోరును కొనసాగించాలనే లక్ష్యంతో ఉన్నాడు. బౌలింగ్‌లో కూడా హార్దిక్ మెరుపులు మెరిపిస్తున్నాడు. దీంతో అతను సిరీస్‌కు ప్రత్యేక ఆకర్షణగా మారాడు. ఇక, కుల్దీప్ యాదవ్‌పై కూడా అందరి దృష్టి నిలిచింది. సీనియర్లు అశ్విన్, జడేజాలు లేకుండానే భారత్ బరిలోకి దిగుతోంది. దీంతో చివరి టెస్టులో సత్తా చాటిన కుల్దీప్ యాదవ్ జట్టుకు ప్రధాన స్పిన్నర్‌గా మారాడు. స్పిన్ సహకరించే లంక పిచ్‌లపై చెలరేగేందుకు సిద్ధంగా ఉన్నాడు. మరో బౌలర్ అక్షర్ పటేల్‌కు తుది జట్టులో చోటు దక్కడం కష్టంగా కనిపిస్తోంది. ఫాస్ట్ బౌలర్లు బుమ్రా, భువనేశ్వర్ కుమార్‌లు జట్టుకు కీలకంగా మారారు. ఇటీవల కాలంలో వన్డేల్లో వీరిద్దరూ నిలకడగా రాణిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఈసారి కూడా జట్టు వీరిపై భారీ ఆశలు పెట్టుకుంది.

అందరి కళ్లు ధోనీపైనే..

ఇక, సీనియర్ ఆటగాడు, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి ఈ సిరీస్ చాలా కీలకంగా మారిందని చెప్పాలి. ఇటీవల కాలంలో వరుస వైఫల్యాలు చవిచూస్తున్న ధోనీపై విమర్శల వర్షం కురుస్తున్న విషయం విదితమే. కాగా, తన బ్యాట్ ద్వారా వారికి గట్టి సమాధానం చెప్పాలనే పట్టుదలతో ధోనీ ఉన్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన ఇవ్వడంతో ధోనీకి ఊరటనిచ్చే అంశం. ఇప్పటికే సీనియర్లు యువరాజ్ సింగ్, సురేశ్ రైనాలు జట్టులో స్థానం కోల్పోయిన నేపథ్యంలో ధోనీపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఈ సిరీస్‌లో రాణించడం అతనికి తప్పనిసరిగా మారింది. ఈసారి విఫలమైతే అతనికి కష్టాలు తప్పక పోవచ్చు. అయితే ధోనీ మాత్రం తన మార్క్ ఆటతో చెలరేగేందుకు సిద్ధమయ్యాడు. అజింక్య రహానె కూడా వన్డేల్లో చెలరేగేందుకు తహతహలాడుతున్నాడు. టెస్టుల్లో అసాధారణ రీతిలో చెలరేగిన రహానె మళ్లీ గాడిలో పడ్డాడు. వెస్టిండీస్‌పై మెరుపులు మెరిపించిన రహానె ఈసారి కూడా దూకుడుగా ఆడాలనే లక్ష్యంతో కనిపిస్తున్నాడు.



మరో మైలురాయికి చేరువలో ధోనీ

భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ మరో అరుదైన రికార్డుకు చేరువయ్యాడు. శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్ ద్వారా ధోనీ తన కెరీర్‌లో మరో మైలురాయిని అందుకోనున్నాడు. ఇప్పటికే 296 వన్డేలు ఆడిన ధోనీ సిరీస్‌లో 300వ మ్యాచ్‌ను అందుకోనున్నాడు. తన వన్డే కెరీ ర్‌లో ఇప్పటిదాక ధోనీ 296 వన్డేలు ఆడాడు. ఇందులో 51.33 సగటుతో 9496 పరుగులు చేశాడు. వీటిలో పది సెంచరీలు, మరో 64 అర్ధ సెంచరీలు ఉన్నాయి. కాగా, భారత్ తరపున మహ్మద్ అజారుద్దీన్, సచిన్ టెండూ ల్కర్, సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్, యువరాజ్ సింగ్‌లు మాత్రమే మూడువందల వన్డేల మైలురాయిని అందుకున్నా రు. మరో నాలుగు వన్డేలు ఆడితే ధోనీ కూడా ఈ అరుదైన రికార్డును తన పేరిట లిఖించు కుంటాడు. కాగా, వికెట్ కీపింగ్‌లో కూడా ధోనీకి మ రో రికార్డు ఊరిస్తోంది. తన కెరీర్‌లో ధోనీ ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 97 స్టంపింగ్‌లు చేశాడు. మరో మూడు స్టంపింగ్‌లు చేస్తే ఈ విభాగంలో సెంచరీ మార్క్‌ను అందుకుంటాడు.

లంకకు చావోరేవో..

టెస్టుల్లో క్లీన్‌స్వీప్‌కు గురైన ఆతిథ్య శ్రీలంకకు వన్డే సిరీస్ పెను సవాలుగా తయారైంది. ఈ సిరీస్‌లో గెలిచి విమర్శకులకు గట్టి సమాధానం చెప్పాలనే పట్టుదలతో లంక ఉంది. ఉపుల్ తరంగ నేతృత్వంలో లంక సిరీస్‌కు సిద్ధమైంది. అయితే టెస్టుల్లో తరంగ పేలవమైన ఆటతో నిరాశ పరిచిన విషయం తెలిసిందే. దీంతో అతను వన్డేల్లో ఎలా ఆడుతాడన్నది అంతు బట్టకుండా మారింది. కానీ టెస్టుల్లో నిలకడగా రాణించిన కుశాల్ మెండిస్, డిక్వెల్లాలు జట్టుకు కీలకంగా తయారయ్యారు. వీరిపై జట్టు భారీ ఆశలే పెట్టుకుంది. ఈ ఇద్దరు రాణించడం లంకకు చాలా కీలకం. వీరు చెలరేగితే లంక కష్టాలు చాలా వరకు తీరుతాయి. అంతేగాక టెస్టుల్లో విఫలమైన గుణతిలక, మాథ్యూస్‌లు కూడా తమ బ్యాట్‌కు పని చెప్పాల్సిన అవసరం ఉంది. మరోవైపు సీనియర్ ఆటగాడు కపుగెదెర జట్టులోకి రావడం బ్యాటింగ్ విభాగాన్ని మరింత బలోపేతంగా మార్చిందని చెప్పాలి. అతను కూడా రాణిస్తే లంకకు భారీ స్కోరు చేయడం కష్టమేమి కాదు.

మలింగ బూస్ట్

కాగా, ఫాస్ట్ బౌలర్ లసిత్ మలింగ జట్టులో చేరడమే లంకకు ఊరటనిచ్చే అంశం. వన్డేల్లో మంచి బౌలర్‌గా పేరు తెచ్చుకున్న మలింగకు భారత్‌పై కూడా మెరుగైన రికార్డే ఉంది. ఈ సిరీస్‌లో అతను జట్టుకు ప్రధాన అస్త్రంగా మారాడు. అతను విజృంభిస్తే భారత బ్యాట్స్‌మెన్‌కు ఇబ్బందులు తప్పక పోవచ్చు. అంతేగాక, సీనియర్ ఆల్‌రౌండర్ తిసారా పెరీరా కూడా జట్టులోకి వచ్చాడు. దీంతో ప్రపంచ స్థాయి ఆల్‌రౌండర్ సేవలు లంకకు అందుబాటులోకి వచ్చాయి. దీంతోపాటు ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌పై భారీ లక్ష్యాన్ని ఛేదించడం కూడా లంకకు కలిసి వచ్చే అంశమే. రెండు జట్లు కూడా విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతుండడంతో పోరు నువ్వానేనా అన్నట్టు సాగడం ఖాయం.

జట్ల వివరాలు

భారత్ (అంచనా): విరాట్ కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ (వైస్ కెప్టెన్), శిఖర్ ధావన్, లోకేష్ రాహుల్, కేదార్ జాదవ్/రహానె, మనీష్ పాండే, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, చాహల్, భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రిత్ బుమ్రా.

శ్రీలంక (అంచనా): ఉపుల్ తరంగ (కెప్టెన్), గుణతిలక, కుశాల్ మెండిస్, నిరోశన్ డిక్వెల్లా, అంజెలో మాథ్యూస్, కపుగెదెర, హసరంగా, తిసారా పెరీరా, విశ్వ ఫెర్నాండో, లసిత్ మలింగ, లక్షణ్ సందకాన్.



హెచ్‌సిఏపై అజర్ ఫైర్



మన తెలంగాణ/ హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సిఎ)పై భారత మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించాడు. హెచ్‌సిఏ ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని, వాటిని రద్దు చేయాలని బిసిసిఐను డిమాండ్ చేశాడు. లోథా కమిటీ సిఫార్సులకు పూర్తి విరుద్ధంగా హైదరాబాద్ క్రికెట్ సంఘం ఎన్నికలను నిర్వహించారని విమర్శించాడు. ఈ కమిటీకి పదవుల్లో కొనసాగే నైతిక హక్కు లేదని చెప్పాడు. ఈ పాలక మండలిని రద్దు చేసి హెచ్‌సిఏకు తాజాగా ఎన్నికలు జరిపించాలని కోరాడు. హెచ్‌సిఏ పెద్దలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, రంజీ జట్టు ఎంపికలో ప్రతిభకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని దుయ్యబట్టాడు. ప్రతిభావంతులైన ఎందరో క్రికెటర్లను హెచ్‌సిఏ పెద్దలు నిర్లక్ష్యం చేస్తున్నారన్నాడు. గతంలో ఇటువంటి పరిస్థితి ఉండేది కాదన్నాడు. హెచ్‌సిఏ ఎన్నికలు జరిగిన తీరుపై అజారుద్దీన్ ప లు అనుమానాలు వ్యక్తం చేశాడు. హెచ్‌సిఏలో అవీనితి రా జ్య మేలుతుందని, ఇలాగే ఉంటే రాష్ట్ర క్రికెట్‌కు తీరని నష్టం జరగడం ఖాయమని జోస్యం చెప్పాడు. ఇప్పటికైన భారత క్రికెట్ బోర్డు అధికారులు, పాలక మండలి ప్రతినిధులు ఈ అంశంపై జోక్యం చేసుకోవాలని అజారుద్దీన్ సూచించాడు. కాగా, హెచ్‌సిఏ ఎన్నికలపై సుప్రీం కోర్టు తీర్పు రావడానికి ఇంకా కొంత సమయం పడుతుందని, తీర్పు వచ్చిన తర్వా త తన భవిష్యత్తు కార్యచరణ ప్రణాళికను ప్రకటిస్తానని అజారుద్దీన్ తెలిపాడు.

క్రీడల్లో రాణించాలి

- **జాతీయ లగోరీ జూనియర్ చాంపియన్ షిప్‌ను ప్రారంభించిన ఎంఎల్ఎ**

మన తెలంగాణ/ వికారాబాద్ జిల్లా : క్రీడాకారులు క్రీడలలో రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని వికారాబాద్ ఎంఎల్ఎ బి.సంజీవరావు తెలిపారు. ఐదవ జాతీయ లగోరీ జూనియర్ చాంపియన్‌షిప్ క్రీడలు వికారాబాద్ జిల్లా కేంద్రం లోని బ్లాక్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని వికారాబాద్ ఎంఎల్ఎ బి.సంజీవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ స్థాయి క్రీడలు వికారాబాద్‌లో జరగడం గొప్ప విషయమన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల క్రీడాకారులు లగోరీ ఆడటానికి ఇక్కడికి రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. వికారాబాద్‌లో జాతీయ స్థాయి క్రీడలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు ఈ ప్రాంత ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. తాను కూడా ఇంటర్ విద్య చదివేటప్పుడు క్రీడలు ఆడేవాడినని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.రాంచంద్రారెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.శివరాజ్, టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు బి.క్రిష్ణయ్య, నాయకులు హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.



11 రాష్ట్రాల క్రీడాకారులు

వికారాబాద్‌లో శనివారం ప్రారంభమైన ఐదవ జాతీయ లగోరీ జూనియర్ చాంఫియన్‌షిప్ క్రీడలకు దేశంలోని 11 రాష్ట్రాల నుంచి 264 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఛత్తీస్‌ఘడ్, ఢిల్లీ, హర్యానా, మధ్యప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, పాండిచ్చేరి, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి 264 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతి రాష్ట్రంలో నుంచి బాలికలు, బాలుర బృందాలు పాల్గొనగా, కర్నాటక రాష్ట్రం నుంచి మాత్రం బాలికల బృందం ఒక్కటే పాల్గొన్నది. ఈ కార్యక్రమంలో లగోరీ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి సందీప్, జాతీయ సంయుక్త కార్యదర్శి తుషార్ జాదవ్, తెలంగాణ రాష్ట్ర లగోరీ అసోసియేషన్ కార్యదర్శి పి.నవీన్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రావు, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర కార్యదర్శి చింతామణి, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి మనోజ్‌కుమార్, హర్యానా రాష్ట్ర కార్యదర్శి జావీద్, కర్నాటక రాష్ట్ర కార్యదర్శి బస్వరాజ్, తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి కళావతి అయ్యాంగర్, మహారాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి భరద్వాజ, పాండిచ్చేరి రాష్ట్ర కార్యదర్శి రాజశేఖరన్, గుజరాత్ రాష్ట్ర కార్యదర్శి రవి రాథోడ్, మధ్యప్రదేశ్ రాష్ట్ర కోచ్ కమల్ మడ్వా తదితరులు పాల్గొన్నారు.



భారత్‌ను ఓడించడం చాలా కష్టం : క్లార్క్



న్యూఢిల్లీ: వరుస విజయాలతో దూకుడు మీదున్న టీమిండియాను ఓడించడం ఏ జట్టుకైనా చాలా కష్టమని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ అభిప్రాయపడ్డాడు. టెస్టు, వన్డేల్లో విరాట్ సేన అసాధారణ ఆటను కనబరుస్తుందన్నాడు. ఈ నేపథ్యంలో భారత్‌ను ఓడించడం ఇతర జట్లకు అంత సులువు కాదన్నాడు. భారత్‌తో జరిగే వన్డే, ట్వంటీ–20 సిరీస్‌లో గెలవడం ఆస్ట్రేలియాకు కష్టమేనన్నాడు. సొంత గడ్డపై, విదేశాల్లో భారత్ చాలా అద్భుతంగా ఆడుతుందన్నాడు. ఇటీవల కాలంలో కోహ్లి సేన రెండు ఫార్మాట్‌లలో కూడా చాలా బలంగా మారిందని క్లార్క్ అన్నాడు. ఒకప్పుడూ ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌లు కూడా ఇలాగే ఆడుతుండేవన్నాడు. ప్రస్తుతం ఈ సంప్రదాయాన్ని భారత్ కొనసాగిస్తుందన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కోహ్లి సేన దూకుడు తనను ఎంతో ఆకట్టుకుంటుందన్నాడు. శ్రీలంక సిరీస్‌లో భారత్ ఆడిన తీరు చూడముచ్చటగా ఉందన్నాడు. లంకకు వారి సొంత గడ్డపై ఓడించడం ఏ జట్టుకైనా చాలా కష్టమన్నాడు. అయితే భారత్ ఏకంగా ఆ జట్టుపై క్లీన్ స్వీప్ సాధించడం చాలా అరుదైన అంశమన్నాడు. తాను చూసిన అత్యుత్తమ ఆటగాళ్లలో కోహ్లి ఒకడని, అతని కెప్టెన్సీ అంటే తనకు ఎంతో ఇష్టమని క్లార్క్ చెప్పాడు.

తెలుగు టైటాన్స్‌కు ఓ గెలుపు

లక్నో: ప్రొ కబడ్డీ ఐదో సీజన్‌లో తెలుగు టైటాన్స్‌కు రెండో విజయం దక్కింది. వరుస ఓటములతో సతమతమవుతున్న టైటాన్స్ శనివారం జరిగిన మ్యాచ్‌లో 37–32 పాయింట్ల తేడాతో యు ముంబాను ఓడించింది. స్టార్ ఆటగాడు రాహుల్ చౌదరి అద్భుత ఆటతో టైటాన్స్‌ను గెలిపించాడు. అసాధారణ రీతిలో చెలరేగి పోయిన రాహుల్ ఏకంగా 13 పాయింట్లు సాధించి టైటాన్స్ విజయంలో ముఖ్య భూమిక పోషించాడు. ప్రారంభం నుంచే టైటాన్స్ కసిగా ఆడింది. టైటాన్స్ ఈ సారి ఎటువంటి పొరపాట్లు లేకుండా ఆడింది. సోమ్‌బీర్ కూడా తనవంతు పాత్ర పోషించాడు. ముంబాను హడలెత్తించిన సోమ్‌బీర్ 8 పాయింట్లను సాధించి జట్టును ఆదుకున్నాడు. మరోవైపు ముంబా జట్టులో అనూప్ కుమార్ 9 పాయింట్లను సాధించాడు. షబ్బీర్ ఆరు, సు రేందర్ నాలుగు పాయింట్లు సాధించినా ఫలితం లేకుండా పోయింది. టైటాన్స్ ఆటగాళ్లు చివరి వరకు ఆధిపత్యాన్ని చెలాయించి విజయాన్ని అందుకున్నారు.



నాదల్‌కు మరో షాక్

సిన్సినాటి: వరల్డ్ నంబర్‌వన్ రఫెల్ నాదల్ (స్పెయిన్)కు మరో షాక్ తగిలింది. సిన్సినాటి ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ నాదల్ ఆస్ట్రేలియా ఆటగాడు నిక్ కిర్గియాస్ చేతిలో ఓటమి పాలయ్యాడు. శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో 23వ సీడ్ కిర్గియాస్ వరుస సెట్లలో ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడు నాదల్‌ను కంగుతినిపించాడు. రెండు సెట్ల పోరాటంలో కిర్గియాస్ 6–2, 7–5 తేడాతో నాదల్‌పై సంచలన విజయం సాధించాడు. ప్రారంభం నుంచే కిర్గియాస్ దూకుడుగా ఆడాడు. అగ్రశ్రేణి ఆటగాడు నాదల్‌ను ముప్పుతిప్పలు పెడుతూ లక్ష్యం దిశగా సాగాడు. అతని జోరును అడ్డు కోవడం నాదల్‌కు శక్తికి మించిన పనిగా మారింది. తొలి సెట్‌లో కిర్గియాస్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడిన ఆస్ట్రేలియా సంచలన ఆటగాడు సునాయాసంగా సెట్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో మాత్రం టాప్ సీడ్ నాదల్ పుంజుకున్నాడు. టైబ్రేకర్ వరకు పోరును తీసుకెళ్లాడు. అయితే కీలక సమయంలో ఒత్తిడిని తట్టుకోలేక తప్పులు చేశాడు. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న కిర్గియాస్ సెట్‌ను గెలిచి సెమీస్‌కు చేరుకున్నాడు. సెమీఫైనల్లో కిర్గియాస్ స్పెయిన్ ఆటగాడు డేవిడ్ ఫెరరర్‌ను ఎదుర్కొంటాడు. కాగా, ఇటీవలే ప్రపంచ పురుషుల ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానానికి చేరుకున్న నాదల్‌కు ఈ ఓటమి పెద్ద షాక్‌గా మారింది. యూఎస్ ఓపెన్‌కు ముందు నాదల్ పేలవమైన ఫాంతో సతమతమవుతున్నాడు. ఇంతకుముందు రోజర్స్ కప్‌లో కూడా నాదల్ క్వార్టర్ ఫైనల్లోనే ఇంటిదారి పట్టిన విషయం తెలిసిందే.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.